15-5Pg1exHMNWJQE.qxd:15-5Pg1exHMNWJQE.qxd 01/01/01 9:44 AM Page 1

వాసులు
గత వారం సంచికల వివరాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 103 పేజీలు: 12 వెల: 6.50

## యుపిలో ఆరవ సెమీ కండక్టర్ యూనిట్

## జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్ ఆర్మీ

9లో



బుధవారం సుప్రీం చీఫ్ జస్టిస్‌గా బిఆర్ గవాయి చేత ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము


### 'సుప్రీం' చీఫ్ జస్టిస్‌గా

# బిఆర్ గవాయి

### ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

### అత్యున్నత పదవిలో ఆయన ఆరు నెలలే..

**న్యూఢిల్లీ, మే 14:** సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి (బిఆర్ గవాయి) బుధవారం ప్రమాణ స్వీకారంచేసారు. రాష్ట్రపతిభవన్‌లోజరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవాయిచేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ప్రధాని మోడీ ఆయనకు అభినందనలు తెలిపారు. 2019 మే 24నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. సిజెఐగా ఆరునెలలు మాత్రమే కొనసాగుతారు. ఈ ఏడాది నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు. సిజెఐ పీఠాన్నిఅధిరోహించిన రెండోదళిత వ్యక్తిగా గవాయి పేరుపొందారు. మహారాష్ట్రలోని >>2



## డ్రోన్లను ఛేదించే 'భార్గవాస్త్ర'

### భారత్ అమ్ముల పొదిలోకి అత్యాధునిక ఆయుధం

**న్యూఢిల్లీ, మే 14:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పొరుగు దేశం పాకిస్థాన్ ఎక్కువగా డ్రోన్లతో దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు భారత్ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 'భార్గవాస్త్ర'ను సిద్ధం చేసింది. సోలార్ డిఫెన్స్, ఏరోస్పేస్ లిమిటెడ్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ సిస్టమ్‌ను భారత్ తాజాగా విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్ నుంచి పరీక్షించింది. మూడుసార్లు పరీక్షించగా భార్గవాస్త్ర రాకెట్ టార్గెట్‌ను కచ్చిత త్వంతో హిట్ చేసినట్లు అధికారులు >>2

# పాడిపరిశ్రమకు పెద్దపీట



బుధవారం టెక్ ఎఐ2.0 కాన్క్లేవ్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

### రాష్ట్ర జిఎస్‌డిపిలో 11.23% వాటా పశుసంవర్ధక శాఖదే..

### గ్రామాల్లో డెయిరీ షెడ్లకు ఆస్తి పన్ను రద్దు చేస్తాం

### కుల వృత్తులవారికి మరిన్ని ప్రోత్సాహకాలు

### నూతన ఆవిష్కరణలపై సదస్సులో సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 14,ప్రభాతవార్తప్రతినిధి:** పాడి పరిశ్రమద్వారా పేదలజీవితాల్లో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడల్లా వ్యవసాయ రంగానికి అధికప్రాధాన్యత ఇచ్చిందన్నారు. విజయవాడలో బుధవారం హోటల్ మురళీ ఫార్చ్యూన్‌లో జరిగిన పశు సంవర్ధక శాఖ టెక్ ఎఐ2.0 కాన్క్లేవ్‌లో సిఎం పాల్గొన్నారు.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయ పశుసంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి టెక్ ఎఐ2.0 కాన్క్లేవ్ ఉద్దేశాన్ని వివరించే పత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లైవ్ స్టాక్ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పేదరికాన్ని తగ్గించాలనే ఆశయంతో గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టయినబుల్ ట్రాన్స్ ఫర్మేషన్ సంస్థ ఈ వర్క్‌షాపు ఏర్పాటుచేయడం చాలా సంతోషకర మన్నారు. ఇటువంటి సమావేశాలకు హాజరవుతూ కొత్త విషయాలను అందరూ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ వృత్తుల వారితో ముచ్చటించారు. వారి ఆదాయ, వ్యయాలపై చర్చించారు. సుమారు మూడు గంటలకు పైగా సీఎం సమావేశంలో పాల్గొన్నారు.పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

**అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న ఎపి**

భారతదేశం ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో అగ్రగామి ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. మన రాష్ట్రం అందులో వేగంగా పురోగతి సాధిస్తుండటం శుభ పరిణామం. గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానం, మాంసం ఉత్పత్తిలో 5వ స్థానం, పాల ఉత్పత్తిలో 7వ స్థానంలో మన రాష్ట్రం ఉంది. లైవ్ స్టాక్‌లో 2014-15లో సిఎజిఆర్ రూ.43,127 కోట్లు ఉండగా 2018-2019నాటికి దానిని రూ.91,633 కోట్లకు పెంచాం. 201419 మధ్య సిఎజిఆర్ 21 శాతం ఉండగా..201924 మధ్య ఈ వృద్ధి 11 శాతానికి తగ్గింది. 2024-25లో రూ.1.69 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్ర సిఎజిఆర్‌లో ఇది 11.23శాతం. 2025-26 సంవత్సరానికి ఈ రంగంలో జీఎస్డీపీ వృద్ధి లక్ష్యం >>2



### కడప మేయర్

## సురేష్ బాబుపై అనర్హత వేటు

### జీవో జారీ చేసిన ప్రభుత్వం

**రాజంపేట అర్బన్, మే14 ప్రభాతవార్త:** కడప మేయర్ కొత్తమద్ది సురేష్ బాబుపై అర్హత వేటు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. అభివృద్ధి పనుల్లో అవకతవకాలు, పురపాలక చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించడంతో సురేష్ బాబును మేయర్‌పదవి నుంచి తొలగించినట్లు జీవో ఆర్‌టి నెంబర్ 446లో పేర్కొన్నారు.

వివరాల్లోకి వెళితే... కడప మేయర్ సురేష్ బాబు అవకతవకలకు పాల్పడుతున్నారని, కుటుంబ సభ్యుల పేర్లతోనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి పనులు చేపడుతున్నారని ఇది పురపాలక సంఘంనిబంధనలు ఉల్లంఘించడమేనని కడప శాసన సభ్యు >>2

# 27 నుంచి కడపలో 'మహానాడు'

### టిడిపిలో సంస్థాగత మార్పులు తప్పవు: సిఎం చంద్రబాబు

### 16, 17, 18 తేదీల్లో తిరంగా ర్యాలీలు, పార్టీ సంస్థాగత ఎన్నికలు మహానాడులోగా పూర్తి

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:**తెలుగుదేశం పార్టీలో సంస్థాగతమైన మార్పులు తప్పని సరని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు,సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.సుదీర్ఘకాలం పార్టీలో ఆయా స్థాయిల్లో నాయకత్వ బాధ్యతల్లో ఉన్నవారి స్థానే కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు. పార్టీలో క్షేత్ర స్థాయి నుంచి పీ4 కార్యక్రమంతో సహా విస్తృత ప్రచారం జరగాలన్నారు.ఈ ఏడాదిలోనే సూపర్ సిక్స్‌వాగ్దానాల అమలు పరిచే దిశలో చర్యలు చేపడతామన్నారు.ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం సాయంత్రం అమరావతిలో జరిగిన తెలుగుదేశం పొలిట్ బ్యూరో సమావేశంలో సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేసారు. ఆనంతరం ఆయన మార్గనిర్దేశనలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీకి చెందిన ఒకే పదవిలో మూడు సార్లు కంటే ఎక్కువ ఉండరాదన్న పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ నారా లోకేష్ ప్రతిపాదనకు తెలుగుదేశం పొలిట్ బ్యూరో ఒకే చెప్పింది.

మూడు పర్యాయాలు ఆరు ఏళ్లుగా ఉన్న మండల పార్టీ అధ్యక్షుల్ని మార్చాలని నిర్ణయించారు. మూడు పర్యాయాలు మండల పార్టీ అధ్యక్షులుగా చేసిన వారికి ఆ పైస్థాయి పదవి లేదా ఇతర సమాంతర పదవి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. నెలకో సంక్షేమ పథకం అమలు చేసేలా ఏడాది క్యాలెండర్ రూపకల్పనకు పొలిట్ బ్యూరో కీలక నిర్ణయం చేసింది. మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు కడపలో మహానాడు నిర్వహణకు పొలిట్ బ్యూరో నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి ఈ నెల 27న చంద్రబాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు. పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారికి సంఘీభావం గా 16, 17, 18 తేదీల్లో తిరంగా ర్యాలీలు నిర్వహ్నిచాలని పొలిట్ బ్యూరో నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి అన్ని నియోజకవర్గాల్లో తిరంగా ర్యాలీలు చేపట్టాలని నిర్ణయించారు. పార్టీ సభ్యత్వం ఉండి చనిపోయిన వారి కుటుంబాలకు భీమా త్వరగా అందేలా చర్యలకు నిర్ణయం చేశారు.

మహానాడులోగా పార్టీ సంస్థాగత ఎన్నికలు, కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించారు. దాదాపు మూడు గంటలపాటు సాగిన పొలిట్ బ్యూరో సమావేశంలో 12అంశాలపై చర్చ్నిచారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ అమరులకు సంతాపం తెలిపింది. టిడిపి పొలిట్ బ్యూరో. సమావేశ నిర్ణయాలను అనంతరంమంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు వెల్లడించారు. ఇటీవల చనిపోయిన పార్టీ నేతలు శ్రేణులకు పొలిట్ బ్యూరో నివాళుల ర్పించింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించిన ప్రధాని మోడీ, త్రివిధ దళాలకు పొలిట్ బ్యూరో అభినందిస్తూ తీర్మానం చేసింది. పద్మభూషణ్ అందుకున్న పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణకు పొలిట్ బ్యూరో అభినందనలు తెలిపింది.

కడపలో తొలిసారి నిర్వహించే మహానాడుకు ఎంతో ఘనంగా ఏర్పాట్లు చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. తక్కువ సమయమే ఉన్నా ఎవరికీ ఏ లోటూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు చెప్పారు. శతాబ్దాల రాయలసీమ సమస్యల పరిష్కారానికి మహానాడు వేదిక కానుందన్నారు. కడప గడ్డపై యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ అమలుకు మహానాడు నాంది పలకనుంది. లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీతో మహానాడు నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.



### దసరాలోగా చేనేత

# సహకార ఎన్నికలు

### త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు

### 3 నెలలకోసారి ఆప్కో ద్వారా చేనేత దుస్తుల కొనుగోలు: మంత్రి సవిత

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఇడబ్ల్యూఎస్ సంక్షేమచేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేతలకు త్వరలో హెల్త్ ఇన్స్యూరెన్స్ అమలు చేయనున్నామన్నారు. చేనేతల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, చేనేత దుస్తుల అమ్మకాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడలోని ఓ కన్వెన్షన్ సెంటర్ లో రాష్ట్రంలో నలుమూలల నుంచి వచ్చిన నేతన్నలతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సవిత బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేనేత రంగ అభివృద్ధికి సూచనలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రిసవిత మాట్లాడుతూ, చేనేతల అభివృద్ధికి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. నూతన డిజైన్ల తయారీలో శిక్షణ ఇస్తున్నా మన్నారు. తయారైన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మినీ కస్టర్లు, మెగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం 92,724 మందికి రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు. దసరాలోగా సహకార సంఘ ఎన్నికలుచేనేత సహకార సంఘాల బలోపేతానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా సహకార >>2

## గోవిందప్ప బాలాజీ కోర్టుకు హాజరు

### లిక్కర్ కేసు

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ఏ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని పోలీసులు బుధవారం కోర్టుకు హాజరు పరిచారు.మంగళవారం మైసూరులో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈరోజు కోర్టులో హాజరు పర్చడానికి ముందుగా గోవిందప్పను సిట్ కార్యాలయం నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తి అవడంతో ఆయనను కోర్టు ప్రాంగణానికి పోలీసులు తీసుకువచ్చారు. అయితే జీబు దించకుండానే గోవిందప్పను మళ్లీ సిట్ అధికారులు బయటకు తీసుకు వెళ్లిపోయారు. అంతే కాకుండా జీబులో ఉన్న గోవిందప్పను చిత్రీకరించకుండా పోలీసులు అడ్డుకున్నారు.

అతని ముఖం కనిపించకుండా పోలీసులు అడ్డుగా చేతులు పెట్టి దాచిన వైనం చర్చనీయాంశంగా మారింది. గోవిందప్ప అరెస్ట్‌తో లిక్కర్ స్కాం కేసులో అరెస్ట్‌ల సంఖ్య ఐదుకు చేరింది. లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. చాణక్య, కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి విచారణ తర్వాత ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలనునిందితులుగా చేరుస్తూ సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. వసూళ్ల నెట్వర్క్ ద్వారా వచ్చిన డబ్బును షెల్ కంపెనీలకు మళ్లించ >>2

### పెద్దిరెడ్డి, కుటుంబ సభ్యులపై

# క్రిమినల్ కేసులు

### అటవీ చట్టాల కింద కేసులు పెట్టాలి

### సహకరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు

### ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లాలో అటవీ భూముల్ని ఆక్రమించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులతో పాటు అటవీ చట్టాల ప్రకారం కూడ కేసులు నమోదు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూములను ఆక్రమిస్తుంటే అడ్డుకోలేకపోయిన అధికారులను గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనిచెప్పారు.పెద్దిరెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం >>2

# 21 నుంచి 'స్వర్ణాంధ్ర సంకల్పం'

### మూడు రోజులు అధికారుల పల్లెబాట

**విజయవాడ.మే14,ప్రభాతవార్తప్రతినిధి:** ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు శాఖాధిపతులు ఈ నెల 21, 22, 23 తేదీల్లో పల్లె బాట పడుతున్నారు. స్థానిక సచివాలయంలో కానీ, అంగన్‌వాడీ కేంద్రం/పాఠశాల భవనంలో కానీ రెండు రాత్రులు నిద్ర చేస్తారు. మూడు పగళ్లు అక్కడే ఉంటారు. ప్రజల సాధకబాధకాలు తెలుసుకుంటారు. సివిల్ సర్వీసు అధికారులంతా పల్లె నిద్ర చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళిక శాఖ ఈ మేరకు కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఈ కార్యక్రమానికి 'స్వర్ణాంధ్ర సంకల్పం' అని పేరు పెట్టారు. దీనికి సంబంధించి ఇప్పటికే ముసాయిదా మార్గదర్శకాల్ని రూపొందించారు. వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆయన సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్నారు. కార్యక్రమ అమలుకు సంబంధించి త్వరలో అధికారులకు కార్యశాల నిర్వహించనున్నారు. పల్లెలకు వెళ్లే అధికారులు రాజకీయ నేతలకు దూరంగా ఉండాలి. వారి ఇళ్లకు వెళ్లకూడదు. ఉక్కపోతగా ఉందనో, దోమలు కుడుతున్నాయనో రాత్రి సమయాల్లో నేతల ఇళ్లలో బస చేయకూడదు. మొదటి రాత్రి ఎక్కడ నిద్రించాలి, రెండో రాత్రి ఎక్కడ నిద్రించాలో ప్రభుత్వమే సూచిస్తుంది. అక్కడే బస చేసి స్థానికులతో మాట్లాడాలి. స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమానికి సివిల్ సర్వీసు అధికారులను మాత్రమే పంపాలని తొలుత అనుకున్నారు. సెలవుల్లో ఉన్న వారిని మినహాయిస్తే రాష్ట్రంలో ఐఎఎస్‌లు 150 మంది, ఐపిఎస్‌లు 90 మంది, ఐఎఫ్ఎస్‌లు 50 మంది కలిపి 290 మంది ఉంటారు. వీరితో పాటు శాఖాధిపతుల్ని కూడా కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని తర్వాత నిర్ణయించారు. వీరు సుమారు 100 మంది వరకు ఉంటారు. అంటే దాదాపు 400 మంది వరకు పల్లెనిద్రకు వెళ్లే అవకాశం ఉంది. ఎవరు ఎక్కడికి వెళ్లాలి? అనేదానిపై ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సారథ్యంలోని ఉన్నతాధికారుల కమిటీ కసరత్తు చేస్తోంది.

ప్రభుత్వ పథకాల అమలుపైనా అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటారు. పథకాలు ఎలా అందుతున్నాయి? వాటి అమలులో సాధక బాధకాలేమిటి? ఇంకా ఏమైనా కోరుకుంటున్నారా? ప్రజల అవసరాలేమిటి? పథకాల్లో మార్పులు చేయాలా? అని వారి అభిప్రాయాలు >>2

## కౌన్సిల్ డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా రాజీనామా

### వైఎస్సార్సీ నుండి బిజెపిలో చేరిక

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** శాసన మండలి డిప్యూటీ ఛైరపర్సన్ జకియా ఖానం రాజీనామా చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఆమె తన ఎమ్మెల్సీ పదవితో పాటు శాసన మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవికీ రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. జకియా ఖానంతో కలిపి ఇప్పటివరకు వైఎస్సార్సీపీకి ఆరుగురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాయచోటి నియోజకవర్గంనుంచి బలమైన మైనారిటీ నేతగా జకియా ఖానంపేరుంది. ఆమె భర్త అఫ్జల్ >>2

### పాక్‌కు మరో షాక్

## సొంత జెండా ఎగరేసిన బలూచ్‌లు

### స్వతంత్ర గణతంత్ర దేశంగా ఏర్పడినట్లు యుఎన్, భారత్‌కు లేఖ రాసిన బలూచిస్థాన్



**క్వెట్టా, మే 14:** పాకిస్థాన్‌లో దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న బలూచిస్తాన్ ఇపుడు స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఇండోపాక్ వివాదాలు, ఉద్రిక్తతలు దాడుల క్రమంలో బలూచ్‌నేతలు భారత్‌కే మద్దతు పలికారు. భారత్ మద్దతిస్తే పాకిస్తాన్‌ను మొత్తం స్వాధీనంచేసుకుంటామని కూడా ప్రకటించారు. ఓపక్క భారత్ ఆంక్షలు కొనసాగుతున్న క్రమంలో బలూచిస్తాన్ నాయకుడు మీర్ యార్ బలోచ్ రిపబ్లిక్ ఆఫ్ బెలూచిస్థాన్‌గా ప్రకటించారు. తమకు పాకిస్థాన్‌నుంచి స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. బలూచ్ ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన నాయకునిగా యార్‌బలోచ్‌కు పేరుంది. భారత ప్రభుత్వం న్యూఢిల్లీలో బలూచ్ రాయబార కార్యాలయం ఏర్పాటుకు అనుమతినివ్వాలని, అలాగే ఐక్యరాజ్యసమితి కూడా బలూచిస్థాన్‌కు శాంతిపరిరక్షకదళాలను పంపించాలని కోరారు. అంతేకాకుండా తమ ప్రాంతంనుంచి >>2

# పాడిపరిశ్రమకు పెద్దపీట

>> రూ.1,95,460 కోట్లుగా పెట్టుకున్నాం.

**పాడి రంగంతో పేదల జీవితాల్లో మార్పు**

లైవ్ స్టాక్‌పైన 42 లక్షల కుటుంబాలు అధారపడి జీవిస్తున్నాయని, పాడి పరిశ్రమ ద్వారా పేదల బతుకుల్లో మార్పు వస్తుందన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో రైతుల ఆదాయాలు రెట్టింపు అయ్యాయి. కానీ తరువాత వచ్చిన ప్రభుత్వాలు సమర్థవంతంగా పని చేయలేదు. మా ప్రభుత్వంలో పాడి పరిశ్రమలో 22 శాతం సిఎజిఆర్ సాధించాం. జీఎస్టీలో రూ.లక్షా 69 వేల కోట్ల రూపాయలే లైవ్ స్టాక్ విభాగం నుండి వస్తోంది. 18 లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగైతే రూ.లక్షా 55 వేల కోట్ల ఆదాయం వస్తుంది. అదే 50 లక్షల హెక్టార్లలో పండే వ్యవసాయ పంటల కారణంగా రూ.55 వేల కోట్లు వస్తోంది. అందుకే అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాం. 18 లక్షల హెక్టార్లను 36 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**వ్యవసాయ రంగంలో మనమే టాప్**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయంలో నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంది. కానీ సేవల రంగం కూడా మెరుగవ్వాలి. ఇండస్ట్రీలు కూడా పెరగాలి. తెలంగాణ ఆదాయంలో 67 శాతం సేవల రంగం నుండే వస్తోంది. అదే మన రాష్ట్రంలో 46 శాతం మాత్రమే ఉంది. రాష్ట్రంలో సేవల రంగంతోపాటు ఇండస్ట్రీని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. మంచి అరోగ్యం కోసం ప్రోటీన్ ఫుడ్ వైపు ప్రజలు మళ్లుతున్నారు. మిల్లెట్స్ వంటి వాటిపై ఆసక్తి చూపతున్నారు. వీటితోపాటు పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకోసమే మనం ఉద్యానవన పంటలను అధికంగా పండించాలి. ఉద్యావన పంటల సంరక్షణ కోసం మైక్రో ఇరిగేషన్ చాలా అవసరం. మైక్రో ఇరిగేషన్‌పై అప్పటి వాజ్ పేయి ప్రభుత్వానికి నేనొక నివేదిక ఇచ్చాను. ఆ నివేదికనే ఇప్పటికీ మైక్రో ఇరిగేషన్‌కు ఒక బైబిల్‌గా వాడుతున్నారు. మైక్రో ఇరిగేషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిరునామాగా ఉంది.

**పాడి, పౌల్ట్రీ పరిశ్రమలను లాభాల బాట పట్టిస్తాం**

పాడి, పౌల్ట్రీ పరిశ్రమలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుంది. ఈ రెండు రంగాలను లాభాల బాట పట్టిస్తాం. గ్రామస్థాయిలో డెయిరీ షెడ్లకు ప్రాపర్టీ టాక్స్, హౌస్ టాక్స్ రద్దు చేస్తాం. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఆన్ లైన్‌లో పెడతాం. అలాగే రాష్ట్రంలో మొబైల్ అంబులెన్స్ లు ఎన్ని ఉన్నాయి, ఇంకెన్ని అవసరమో అధ్యయనం చేస్తాం. నరేగా ఇంటిగ్రేట్ చేస్తున్నాం. అవసరమైతే వాటిని డ్వాక్రాకు అప్పగిస్తాం. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడి దానిపై కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి రైతుకు నరేగా ద్వారా వాటర్ సప్లయ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతాం. బీసీల్లో కులవృత్తుల వారిని ఆర్థికంగా పైకి తీసుకొస్తాం. యాదవ, కురబలతో పాటు అన్ని వర్గాల వారిని ఆదుకుంటాం. డెయిరీకి మైక్రో ఇరిగేషన్ వర్తింపచేస్తాం. మైక్రో ఇరిగేషన్‌లో 2.50 లక్షల ఎకరాలకు ఈ ఏడాది ప్రాధాన్యత ఇచ్చాం. సోలార్ పవర్ వెయ్యి యూనిట్ల వరకు పర్మిషన్ ఇస్తాం. మహిళలు తేలిగ్గా గడ్డి కోసేలా కటింగ్ మిషన్స్ అందుబాటులోకి తెస్తాం. డెయిరీని ఎలా ముందుకు తీసుకుపోవాలి, ఖర్చు ఎలా తగ్గించాలి పశువుల ఎలా చూసుకోవాలనే అంశంపై అధ్యయనంతో అవగాహన కల్పిస్తామని ముఖ్యమంత్రి అన్నారు.



బుధవారం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన సుందరీమణులు

## సహకార ఎన్నికలు

>> సంఘ ఎన్నికలు నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోందన్నారు. దసరా లోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. నూతన చేనేత సహకార సంఘాల ఏర్పాటుతో పాటు నిద్రావస్థలో ఉన్న సంఘాలను క్రియాశీలకంగా పనిచేసేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 3 నెలలకోసారి ఆప్కో ద్వారా కొనుగోలునేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుతం నేతన్నల నుంచి ఆప్కో ద్వారా ఆరు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇకపై మూడు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. నేతన్నలకు బకాయిలను కూడా విడతలవారీగా చెల్లించున్నామన్నారు. త్రిఫ్ట్ పథకం కింద కేటాయించిన రూ.5 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ పార్కుల్లో యూనిట్ల స్థాపనకు నేతన్నలకే పెద్దపీట వేస్తున్నామన్నారు. వర్క్ షెడ్ల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో చేనేతలకు అదనంగా రూ.50 వేలు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎన్.హెచ్.డి.ఎస్. రీజనల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసేలా సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందజేస్తామని, సీఎం చంద్రబాబుతోనే చేనేతలకుస్వర్ణయుగమని మంత్రి సవిత తెలిపారు. చేనేత అమ్మకాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలోనూ ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. చేనేత దుస్తులకుమరింత ప్రాచుర్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో ఓ నిర్ణయం తీసుకోనున్నాయన్నారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులువారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగాధరించేలా రెండు ప్రభుత్వాలు త్వరలో ఓ పిలుపునివ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## బిఆర్ గవాయి

>> అమ్రావతిలో 1960 నవంబరు 24న జన్మించిన గవాయి 1985మార్చి 16న న్యాయవాదిగా వృత్తిజీవితం ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 2003 నవంబరు 14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయిన జస్టిస్ గవాయి 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ఆ హైకోర్టు ప్రధాన ధర్మాసనం ఉన్న ముంబయితోపాటు నాగ్‌పూర్, ఔరంగాబాద్; పనాజీ ధర్మాసనాల్లో సేవలందించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గత ఆరేళ్లలో జస్టిస్ గవాయి సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వాములయ్యారు. రాజ్యాంగ, పరిపాలన, సివిల్, క్రిమినల్ చట్టాలు వాణిజ్య వివాదాలు ఆర్బిట్రేషన్, విద్యుత్, విద్య, పర్యావరణానికి సంబంధించిన కేసులను విచారించారు.

## క్రిమినల్ కేసులు

>> భూముల్ని ఆక్రమించినట్లు వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెట్ డిజి విచారణ చేసి పవన్ కల్యాణ్‌కు నివేదిక అందచేశారు. ఆక్రమదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, భూములు ఆక్రమణలకు గురవుతుంటే రక్షించలేని అధికారులను భాద్యులను చేయాలని డీజీ సిఫార్సు చేశారు. నివేదికను పరిశీలించిన పవన్ కల్యాణ్ అటవీ భూముల ఆక్రమణలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట డిజి సిఫార్సులకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించాలని అధికారులను ఆదేశించారు.

## జకియా రాజీనామా

>> అలీ ఖాన్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నాయకుడిగా ఉంటూ రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. వైయస్సార్ మరణం అనంతరం వైఎస్సార్సీపీలో కొనసాగుతూవచ్చారు. మైనారిటీ నాయకుడిగా ఉంటూ ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించారు. శాసనమండలి డిప్యూటీ ఛైరపర్సన్ పదవికి రాజీనామా చేసిన జకియా ఖానం ఆ వెంటనే వైఎస్సార్సీపీని వీడి బిజెపిలో చేరారు. జకియా ఖానంను బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్‌తో కలిసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జకియా ఖానం బిజెపిలో చేరడం సంతోషదాయకమని పురందేశ్వరి, సత్యకుమార్ అన్నారు. ప్రధాని మోడీ అందరికీ సమాన హక్కులు అమలు చేస్తున్నారని జకియా ఖానంఅన్నారు. ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చిన ఏకైక ప్రధాని మోడీయేనని ఆమె కొనియాడారు.

## 'స్వర్ణాంధ్ర సంకల్పం'

>> తెలుసుకుంటారు. పొదుపు సంఘాలు, నీటి సంఘాలు, పాఠశాల కమిటీలతోనూ చర్చిస్తారు. స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమానికి ప్రత్యేక యాప్ రూపొందించారు. అధికారులు తమ ప్రతి కార్యక్రమానికి సంబంధించిన అంశాన్నీ అందులో నమోదు చేయాలి. పల్లెబాటలో పాల్గొని వచ్చాక తాము గమనించిన అంశాలపై అధ్యయన వివరా లనూ యాప్‌లో పొందుపరచాలి. వాటన్నింటినీ ప్రణాళిక శాఖ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తుంది.





బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు ప్రదర్శన జరిపిన దృశ్యం

# డ్రోన్లను ఛేదించే 'భార్గవాస్త్ర'

>> వెల్లడించారు. ఈ భార్గవాస్త్ర డ్రోన్ సమూహాల ముప్పును ఎదుర్కోవడంలో చాలా కీలకం. భార్గవాస్త్ర అనేది ఒక కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్ దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. ఈ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 2.5 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగలదు. 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న వైమానిక వాహనాలను కూడా ఇది గుర్తించి, గైడెడ్ మైక్రో బాంబులను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తుంది. భార్గవాస్త్ర వ్యవస్థకు ఏకకాలంలో 64 మైక్రో క్షిపణులను ప్రయోగించే సామర్థం ఉంది. ఎక్కడికైనా సులువుగా, వేగంగా తరలించవచ్చు. ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కోసం అభివృద్ధి చేసిన మొట్టమొదటి మైక్రో క్షిపణి ఆధారిత కౌంటర్‌డ్రోన్ వ్యవస్థ ఇది. గగనతలంలో ఆరునుంచి పదికిలోమీటర్ల దూరంలో ఉన్న ముప్పును కూడా పసికడుతుంది. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లను పెట్టి 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనంచేసేలా దీన్ని రూపొందించారు. ఇక రెండో లేయర్‌లో గైడెడ్ మైక్రో మిసైల్‌ను ఉంచుతారు. ఇవి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యంచేస్తాయి. సముద్రానికి ఐదువేలమీటర్ల ఎత్తులో ఉండే భూభాగాల్లో కొండలప్రాంతాల్లోను వీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని కంపెనీ చెపుతోంది. భారత్‌లోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ ఈ భార్గవాస్త్రను రూపొందించింది.

# ఢిల్లీలో ఎపి గవర్నర్‌కు అవమానం!

## ప్రొటోకాల్ పాటించని రెసిడెంట్ కమిషనర్

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అవమానం జరిగింది. న్యూఢిల్లీలోని ఎపి భవన్‌లో రాష్ట్ర ప్రథమ పౌరుడు అబ్దుల్ నజీర్‌ను రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ అవమానించారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో నూతన సిజెఐ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఎపి భవన్‌కు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేరుకున్నారు. ఢిల్లీకి గవర్నర్ వచ్చిన వెంటనే ఆయన్ని కలవక పోగా.. ఇప్పటి వరకు గవర్నర్‌ను రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ మర్యాద పూర్వకంగా కూడా కలవక పోవడం గమనార్హం. దేశ రాజధాని న్యూఢిల్లీకి రాష్ట్ర గవర్నర్ కానీ, ముఖ్యమంత్రి కానీ వస్తే.. ప్రోటోకాల్ ప్రకారం.. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లి.. వారికి తప్పనిసరిగా రెసిడెంట్ కమిషనర్ స్వాగతం పలకాల్సి ఉంది. గవర్నర్ అబ్దుల్ నజీర్.. న్యూఢిల్లీకి వచ్చి దాదాపు 24 గంటలు గడిచినా.. ఆయనకు ఈ రెసిడెంట్ కమిషనర్ కలవక పోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతోన్నాయి. ప్రోటోకాల్ ఉల్లంఘనకు ఎపి భవన్ రెసిడెంట్ కమిషనర్ పాల్పడినట్లు విమర్శలు ట్రోల్ అవుతున్నాయి.

# గోవిందప్ప బాలాజీ కోర్టుకు హాజరు

>> దంలో బాలాజీ తెర వెనుక వ్యవహారం నడిపారని సిట్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. కేసుకు సంబంధించి ఈనెల 11న విచారణకు రావాల్సిందిగా గోవిందప్పకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కదలికలపై ఆరా తీసిన సిట్ అధికారులు కర్ణాటకలో ఉన్నట్లు గుర్తించారు. చామరాజనగర్ జిల్లా యల్లందూరు తాలుకాలోని ఒక అటవీ ప్రాంతంలోని వెల్‌నెస్ సెంటర్‌లో ఉన్న గోవిందప్పను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. తాడేపల్లి ప్యాలెస్‌కు మద్యం సొమ్ములు చేర్చడంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సిఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల పాత్రను సిట్ అధికారులు గుర్తించారు. వీరిలో బాలాజీ వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ద్వారా జగన్ కుటుంబానికి దగ్గరైన గోవిందప్ప భారతీ సిమెంట్స్‌తో పాటు జగన్, భారతి ఆర్థిక లావాదేవీలను చూసుకునేవారు. ఈ క్రమంలో లిక్కర పాలసీలో మొదటి నుంచి బాలాజీది కీలక పాత్ర అని గుర్తించిన సిట్.ఆ మేరకు ఆధారాలను కూడా సేకరించింది. గోవిందప్ప బాలాజీకి కోర్టు రిమాండ్ విధించింది.

# సురేష్ బాబుపై అనర్హత వేటు

>> రాలు ఆర్.మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఈమేరకు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం విచారణ చేపట్టింది. మేయర్ సురేష్ బాబు కుమారుడు అమరేష్, భార్య జయశ్రీ పేరుతో వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ పేరిట రిజిష్టర్ చేశారు. ఈ సంస్థ కూడా ఎన్నికల నాటికి(18.3.2021) ఏర్పాటు కాలేదు. ఈ సంస్థ పేరుతో జనరల్ ఫండ్ కింద 27.45 లక్షల పనులు సంస్థ చేసింది. అలాగే 55.6 లక్షలు పనులు కూడా సంస్థ ద్వారానే చేపట్టారు. ఈ పనుల్లో 7 పూర్తికాగా మిగతా మూడు పూర్తి చేయలేదు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విచారణ నివేదికను 28.2.2025న రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది. దీనిపై పురపాలక శాఖ కడప మేయర్ సురేష్ బాబుకు షోకాజ్ నోటీస్ 24.3.2025న జారీ చేయడం జరిగింది. దీనిపై మేయర్ సురేష్ బాబు హైకోర్టులో రిట్ పిటిషన్ (డబ్ల్యూపి నెంబర్ 9197/2025) దాఖలు చేశారు. షోకాజ్ నోటీసులో మేయర్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పురపాలక వర్గాలు స్పష్టం చేశాయి. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కడప మేయర్ దాఖలు చేసిన పిటిషన్‌కు జవాబుగా పురపాలక శాఖ మెమో జారీ చేసింది. మంగళవారం వ్యక్తిగతంగా కడప మేయర్ సురేష్ బాబు పురపాల శాఖ కార్యదర్శి ఎదుట హాజరై వివరణఇచ్చారు. ఇది కూడా సంతృప్తికరంగా లేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు మేయరు సురేష్ బాబును పురపాలకశాఖ చట్టం క్లాజు 221(హెచ్) 1955,1956 ప్రకారం పదవి నుంచి తొలగిస్తూ జిఓఆర్‌టి నెంబర్ 446 ను రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు. జీవో జారీచేసిన రెండువారాలతర్వాత అనర్హతవేటు అమలులోకివస్తుందని జీవోలో పేర్కొన్నారు.

## పాలిసెట్ పరీక్షలో 95.36 శాతం ఉత్తీర్ణత

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా పాలిసెట్ ఫలితాలను విడుదలు చేశారు. ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించిన ఈ పాలిసెట్ పరీక్షను 1,39,840 మంది పరీక్ష రాశారు. దీనిలో 1, 33,358 మంది పాసైనట్లు మంత్రి వెల్లడించారు. ఈ పరీక్షా ఫలితాల్లో 95.36 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ఈ పరీక్షల్లో 96.9 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారని మంత్రి నారా లోకేశ్ వివరించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీ ని మే 2వ తేదీన విడుదల చేయగా.. ఇప్పుడు తుది ఫలితాలను విడుదల చేశారు.ఇక ఈ ఫలితాలను గమనిస్తే 19 మంది విద్యార్థులు120కి 120 మార్కులు సాధించారు.

వీరిలో అయిదుగురు బాలికలు,మిగిలిన 14 మంది బాలురు కావడం విశేషం.ఇక ఇందులో 15 మంది విద్యార్థులు ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వారు,విశాఖ నుంచి ఇద్దరు, కాకినాడ,ప్రకాశం జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.,19 మంది టాపర్లు బి.శశివెంకట్, బాలినేని కల్యాణ్‌రామ్,మెర్ల జెస్‌ఎన్‌వీ చంద్రహర్ష, బొడ్డేటి శ్రీకర్,వరుణ్‌తేజ్,వి.ప్రవళిక, ఆకుల నిరంజన్ శ్రీరామ్, చింతాడ చౌహన్, కోదాటి కృష్ణప్రణయ్, బి,రక్షిత శ్రీ స్వప్న, ఆరన చాహ్నా.పాల రోహిత్,యు,చక్రవర్తుల శ్రీదీపిక,చలువాది ఖాదిరేశ్, కొప్పిశెట్టి అభిజిత్,. పి.నితీశ్. వై.హేమచంద్రకుమార్, ఎ,యశ్వంత్ పవన్ సాయిరామ్, ఎం,ఉమా దుర్గ శ్రీనిదిలకు లభించాయి,.ఈ విద్యార్థుల అపూర్వ విజయాన్ని మంత్రి లోకేష్ ఎక్స్ ఖాతాలో అభినందించారు.ఈ ఏడాది పాలిసెట్ మొత్తంగా 95.36శాతం ఉత్తీర్ణత నమోదైంది.ఈ సారి మొత్తంగా 1,39,840 మంది పాలిసెట్ రాసారు.వీరిలో 1,33,358 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

# పదినెలలుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలు ఏమయ్యాయో!?

## గత అక్రమాలపై టిటిడి వర్గాల్లో చర్చ

**తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడిలో గత ఐదేళ్ళ వైసిపి హయాంలో గత టిటిడి పెద్దలు,అధికారుల పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటన్నిటిపై సమగ్రదర్యాప్తుకు పదినెలల క్రిందటే గత ఏడాది జులైలోనే రాష్ట్రప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి దర్యాప్తు బాధ్యతలు అప్పగించింది. అప్పట్లోనే

టిటిడిలో పలు అంశాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మలివిడత సోదాలు, పూర్వఅదనపు ఇఒ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులను విచారణ చేయడం ప్రకంపనలు సృష్టించింది.14 అంశాలకు సంబంధించి టిటిడిలో జరిగిన అవినీతి అక్రమాల ఆరోపణలపై కూపీ లాగి లోతుగా దర్యాప్తుచేపట్టారు. లక్షమంది వరకు భక్తులకు ప్రతిరోజూ ఉచితంగా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న టిటిడి ,దాతల నుండి విరాళాలు సేకరిస్తోంది. అప్పటికే 1,800కోట్ల రూపాయలు విరాళాలు దాటాయి. దానిద్వారా అన్నదానం నిర్వహిస్తుండటం తెలిసిందే. ఈ విరాళాల రూపంలో వచ్చిన నగదు డిపాజిట్‌లు, ఏ మేరకు నిధులు వెచ్చిస్తున్నారనే విషయంపై పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి పెట్టారు. అలాగే తిరుమలలో ప్రముఖుల సిఫార్సు లేఖలపైగత ఐదేళ్ళలో జారీచేసిన విఐపి బ్రేక్ దర్శనాల టిక్కెట్లు, ఆర్జితసేవల టిక్కెట్లు పై కూడా విచారణ చేపట్టారు. గతంలోనే టిటిడి ఇంజనీరింగ్ విభాగం, శ్రీవాణి ట్రస్ట్ విరాళాలు, ఆర్జితసేవల టిక్కెట్లు జారీ అంశాలపై పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టిన విషయం విదితమే. హిందూ సనాతన ధర్మాన్ని మరింతగా వ్యాప్తి చేసి,మతమార్పిడిలను అరికట్టేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు వినియోగంలో అక్రమాలు జరిగాయనేఆరోపణలపై గతంలోనే ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మొదటి విడతలోనే ఆరాతీశారు. ఈ ట్రస్ట్ ద్వారా నిర్మించిన ఆలయాల్లో ఓ సేవాసంస్థ భాగస్వామ్యం పై కూడా విచారణ సాగనుందనేదిఅప్పట్లో గుప్పుమంది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా గత ఐదేళ్ళలో టిటిడికి అందిన ప్రతిపాదనలు, వాటిలో ఎన్ని ఆమోదించారు, ఎక్కడెక్కడ ఆలయాలు నిర్మించారు, ఏఏ ఆలయాలకు ధూపదీప నైవేద్యాలకు నెలకు 5వేల రూపాయలు చెల్లిస్తున్నారు అనే ఆధారాలు మరింతగా సేకరించారు. ఈ ట్రస్ట్‌క్రింద 10వేల రూపాయలు విరాళ రూపంలో, 500 రూపాయలు విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్ క్రింద నగదు వసూలుచేస్తున్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తెలుగురాష్ట్రాల్లోనేగాక దేశ వ్యాప్తంగా సమరస సేవా ఫౌండేషన్ సహకారంతో 2,273నూతన ఆలయాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు. 176పురాతన ఆలయాలు పునరుద్ధరణ చేపట్టారు.

# సొంత జెండా ఎగరేసిన బలూచ్‌లు

>> పాకిస్థానీ దళాలు వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్‌చేసారు. ఈనెల 7వ తేదీనుంచి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బలూచ్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేం మా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నామని ఆయన అన్నారు. బలూచ్ స్వాతంత్ర్యయోధులు పాకిస్తాన్‌లోని సహజవాయుక్షేత్రాలపై దాడిచేసారని, డేరా బుగ్తి ప్రాంతంలో 100కుపైగా ఉన్న గ్యాస్ బావులపై దాడులుజరిపినట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి మా స్వతంత్ర దేశాన్ని గుర్తించాలని మీర్ యార్‌బలోచ్ విజ్ఞప్తిచేసారు. నేటినుంచి బలూచిస్థాన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ బలోచిస్తాన్‌గా అవతరించిందని, ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలన్నీ కూడా మా స్వతంత్రతను గుర్తించి మద్దతివ్వాలని కోరారు. అంతేకాకుండా కరెన్సీ, పాస్‌పోర్టు వంటి వాటి ముద్రణకు అంతర్జాతీయ సంస్థలు బిలియన్ డాలర్ల కరెన్సీ సాయం చేయాలని కోరారు. ఇదిలా ఉంటే పాకిస్థాన్ మిలిటరీ సిబ్బంది వెళుతున్న వాహనంపై బలూచ్‌మిలిటెంట్లు దాడిచేసి ధ్వంసంచేసారు. ఈదాడిలో 14 మంది సైనికులుచనిపోయారు. పాకిస్థాన్‌లోని అనేక జిల్లాల్లో బిఎల్ఏ సమన్వయంతో కూడిన దాడులుచేసిందని మీర్‌యార్ బలోచ్ తెలిపారు. ఆపరేషన్ హీరో 2.0గా మొత్తం 58 ప్రాంతాల్లో 78 దాడులుచేసినట్లు ప్రకటించారు. బిఎల్ఎ ప్రతినిధి జీయాంద్ బలోచ్‌మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ప్రతిఘటించేందుకు తమపై ఆధిపత్యం నిలువరించేందుకు దాడులుచేసామని, పాకిస్తాన్ ఆక్రమణనుంచి నేటికి విముక్తి లభించిందన్నారు. ఏడు దశాబ్దాలపాటు పాకిస్తాన్ తమపై అణిచివేత, ప్రముఖులను కిడ్నాప్ అదృశ్యం, హింస, చట్టాలను ఉల్లంఘించి హత్యలకు పాల్పడిందని అప్పటినుంచి బలూచ్ పోరాటంసాగిస్తూనే ఉందని అన్నారు. భారత్‌పాక్ విభజన సమయంలో ఆనాటి బ్రిటిష్ పాలకులు కలత్‌గా పిలిచే ఈప్రాంతాన్ని ఎటూ తేల్చకుండా ఆప్రాంత పాలకులకే వదిలివేసారు. దీనితో ఆనాటి పాలకుడు యార్‌ఖాన్ ఈప్రాంతం స్వయంప్రతిపత్తితో ఉండేవిధంగా కొనసాగించినా తర్వాత పాకిస్థాన్‌లో విలీనంచేసేసాడు. అప్పటినుంచి ఈ ప్రాంతం బలూచిస్తాన్‌గా వ్యాప్తిలోకి వచ్చినా దశాబ్దాలుగా అణిచివేతకు గురవుతుందని యార్ బలోచ్ అన్నారు. అంతేకాకుండా జిన్నా హౌస్‌ను బలూచిస్తాన్‌హౌస్‌గా పేరుమార్చాలని కూడా ఆయన భారత్‌కు విజ్ఞప్తిచేసారు. ఇటీవల జరిపిన దాడులకు కూడా బలూచిస్తాన్ బిఎల్ఎ తన సంఘీభావాన్ని ప్రకటించింది.

## వారం - వర్జ్యం

తేది : 15-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
తదియ 4.02
జ్యేష్ఠ మ.2-05
వర్జ్యం రా.3.21-తె.5.05
దు.ఉ.9.56-10.48, మ.3.05-3.57
శుభసమయం: ఉ.5.10-5.50, సా.5.00-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగయత్నాలు కలిసి వస్తాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తువస్త్రాలు కొనుగోలు.

**వృషభం :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:**పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. కొత్తగా ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారాలు కొంత లాభిస్తాయి.

**కన్య :** ఉద్యోగాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :** జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. ప్రముఖుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పనిభారం తగ్గుతుంది. వస్తు, వస్త్రాలు లాభాలు.

**ధనుస్సు:** ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** కుటుంబంలో ఎదురైన సమస్యలు కొంత వరకు తీరుతాయి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కుంభం:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలుగుతాయి.

**మీనం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. కార్యజయం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు రామదాసు మృతి



రామదాసు(ఫైల్)

**గుంతకల్లు రైల్వే,మే 14,ప్రభాతవార్త:** అఖిల భారత రైల్వే ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు తోట రామదాసు (76) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. వయోభారంతో గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు స్థానిక రైల్వే ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి క్షీణించి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రమాదేవి,నలుగురు కుమారులు ఉన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం గోరంట్లకు చెందిన రామదాసు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత దామోదరం సంజీవయ్య సమీప బంధువు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో రైల్వేలో ఉద్యోగంలో చేరిన ఆయన అనంతరం గుంతకల్లు సీనియర్ డిఎఫ్ఎం కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ 2009 ఆగస్టులో పదవి విరమణ చేశారు. ప్రారంభం నుంచి అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం బ్రాంచి కార్యదర్శి పదవి నుంచి డివిజనల్ కోశాధికారిగా, డివిజనల్ కార్యదర్శిగా జోనల్, జాతీయ స్థాయి కమిటీలలో ఉన్నత పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. లలిత కళల పట్ల తనకు ఉన్న అభిరుచి కారణంగా స్థానిక రైల్వే ఇన్స్‌టిట్యూట్ పాలక మండలికి జరిగిన ఎన్నికలలో అనేక పర్యాయాలుఎన్నికై కళాసమితి, సాహిత్యం విభాగాలకు సంబంధించిన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఆయా రంగాలకు సముచిత న్యాయం చేకూర్చారు.దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏర్పడిన 30ఏళ్లు (1996)వరకు చాలామంది రైల్వే సిబ్బందికి తెలియని దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సహకార సొసైటీ ప్రస్థానాన్ని 1996లో రాయలసీమ జిల్లాల రైల్వే కార్మికులకు పరిచయం చేశారు. నాడు రెండు/మూడు మాసాలకు గానీ మంజూరు కానీ సహకార సొసైటీలోను నేడు దరఖాస్తు చేసుకున్న రోజే/ఆరు గంటల వ్యవధిలోనే లోన్ మంజూరు అవుతుంది. రామదాసు మృతిచెందారన్న విషయం తెలుసుకుని సెంట్రల్, జోనల్ పూర్వపు నాయకులు, రైల్వే ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం వెటరన్ అధ్యక్షులు క్రిష్ణ సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన జీ రాముడు,అదనపు డివిజనల్ కార్యదర్శిగా పనిచేసిన సి రామాంజినేయులు,ప్రస్తుత పాలకమండలి సభ్యులు సాయిబాబా, మురళీ కృష్ణ, జీఎస్ కిశోర్ కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు నాయక్,అకౌంట్స్ విభాగం సిబ్బంది గుంతకల్లు, గుత్తి,ఆదోని,రాయచూరు తదితర ప్రాంతాలకు చెందిన రైల్వే కార్మికులు,సాహితీ బంధువులు,మిత్రులు రామదాసు మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు.

GNT 15-05Pg3exHMNWJQEVTPS.qxd:15-05Pg3exHMNWJQEVTPS.qxd 01/01/01 7:38 AM Page 1



# బుడమేరుకు రిటైనింగ్ వాల్

## ముంపునుంచి విజయవాడకు రక్షణ: మంత్రి నిమ్మల



బుధవారం బుడమేరు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల తదితరులు

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** బుడమేరు ముంపు నుంచి విజయవాడ రక్షణకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు జలవనరులశాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్పష్టం చేసారు. గత ఏడాది వర్షాకాలంలో ఆకస్మికంగా వచ్చిన వరదకు బుడమేరుకు 3గండ్లుపడి విజయవాడను ముంచెత్తిందన్నారు. అయినప్పటికి అప్పటికప్పుడు అత్యవసరంగా యుద్ధప్రాతిపదికన భారీ వర్షాల్లో సైతం బుడమేరు గట్టుమీదనే ఉండి 3గండ్లను పూడ్చి విజయవాడకు వరదముంపును నివారించడం జరిగిందన్నారు. బుడమేరు వరద నుండి విజయవాడ నగరానికి శాశ్వత ప్రాతిపదికన ముంపును నివారించేందుకు, గతంలో పడిన ఈ 3గండ్లను కలుపుతూ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. దీని కోసం త్వరలోనే కాంక్రీట్ నిర్మాణ పనులు మొదలు పెట్టబోతున్నామని తెలిపారు.

బుధవారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఇఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజనీర్లతో కలసి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులు మొదలుపెట్టి, వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా, జూన్ 10వ తేదీలోగా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఒకొలిక్కి తీసుకురావాలని, దీనికోసం అదనంగా యంత్రసామాగ్రిని సమకూర్చుకోవాలని అధికారులను, ఏజెన్సీలను ఆదేశించారాయన. అదేవిధంగా విజయవాడను వరద ముంపునుండి శాశ్వతంగా రక్షించేందుకు బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. బుడమేరు వరద, ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, డిపిఆర్ తయారీ దశలో ఉందని, బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా, మరొక కొత్త ఛానెల్‌ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్థంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం అని తెలిపారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మానేజ్మెంట్ కింద, కేంద్రం సహకారంతో ముందుకు వెళ్లేలా ప్రపోజల్స్ తయారు చేసాం అని, మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మానేజ్మెంట్ శాఖలు సమన్వయం చేసి ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచుతాం అని స్పష్టం చేశారు.



## వారంరోజుల గంగమ్మజాతర ఆదాయం

# రూ.10.69లక్షలు

### విశ్వరూపం చెంప తొలగింపుతో ముగిసిన గంగమ్మజాతర

**తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వారంరోజుల్లో భక్తులు ఆలయంకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు తమ మొక్కుబడుల్లోభాగంగా హుండీకి సమర్పించిన కానుకల ఆదాయం 10,69,618 రూపాయలు చేకూరిందని ఆలయ ఇఒ జయకుమార్‌తెలిపారు. ఈ వారంరోజులు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీకి కానుకలుసమర్పించడంతో బుధవారం లెక్కింపు జరిగింది. కాగా వారం రోజుల గంగమ్మజాతర బుధవారం వేకువజామున గంగమ్మవిశ్వరూప ప్రతిమ చెంపను పేరంటాలు తొలగించడంతో ప్రశాంతంగాముగిసింది. ఆలయంలో,ఆలయంవద్ద పూర్తిస్థాయిలో భద్రతకల్పించారు.

## సినిమా టికెట్ల ధరల ఖరారుపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటు

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** సినిమా టికెట్ల ధరల ఖరారుపై ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సినిమా టికెట్ల ధరల ఖరారుపై ఏపీ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. హైకోర్టు ఆదేశాలతో కమిటీ ఏర్పాటు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం అమరావతిలో ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో 5 మంది సభ్యులతో కమిటి ఏర్పాటు చేస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో సభ్యులుగా సమాచార, ఆర్థికశాఖ, న్యాయ శాఖల కార్యదర్శులతో పాటు సినీ నిర్మాత వివేక్ కుచిభట్ల ఉండనున్నారు. సినిమా టికెట్ ధరలు పెంచాలంటూ గతంలో హైకోర్టులో పిటీషన్ దాఖలైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సంక్రాంతి పండగ వేళ.. పలు సినిమాలు విడుదలయ్యాయి. ఈ సినిమాల బెనిఫిట్ షో వేసే క్రమంలో టికెట్ ధరలు పెంచుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సినిమాలకు బెనిఫిట్ షోకు అనుమతి ఇవ్వడం వల్ల శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతోందని హైకోర్టు దృష్టికి పిటిషనర్ తీసుకు వెళ్లారు.ఈ క్రమంలో ఎపి ప్రభుత్వం తన నిర్ణయాన్ని కోర్టుకు తెలిపింది.

## సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశలో కేబుల్ బ్రిడ్జి

- రూ.593 కోట్లతో త్వరలో టెండర్లు
- మణిపాల్ ఆస్పత్రి వద్ద జాతీయ రహదారితో అనుసంధానం

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులో క్లిష్టమైన మూడో దశకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) త్వరలోనే టెండర్లు పిలవనుంది. ప్రకాశం బ్యారేజి నుండి మణిపాల్ ఆస్పత్రి వరకు 3.5 కి.మీ.పొడవైన రహదారిని రూ.593.03 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఇటీవల ఆమోదముద్ర వేసింది. దీన్ని సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశగా పిలుస్తున్నారు. ఇది మణిపాల్ ఆస్పత్రి వద్ద చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారితో కలుస్తుంది. ఇక్కడ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మిస్తారు. మూడో దశ రహదారి ప్రకాశం బ్యారేజి సమీపం నుండి పాత మద్రాసు రహదారి మీదుగా వెళుతుంది. మధ్యలో 320 మీటర్ల మేర కేబుల్ బ్రిడ్జి కూడా ఉంటుంది. దీని నిర్మాణానికి 48 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. రెండేళ్లలో ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలన్నది లక్ష్యం. సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారితో అనుసంధానించే చోట మూడు ర్యాంప్‌లు నిర్మిస్తారు. అమరావతి నుండి విజయవాడ వైపు (232 మీ.,),గుంటూరు నుండి అమరావతి వైపు (280 మీ.,) విజయవాడ నుండి అమరావతి వైపు వెళ్లేందుకు (115 మీ.) మూడు ర్యాంప్‌లు ఉంటాయి.1.52 కి.మీల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది. దానిలో భాగంగా పాత మద్రాసు రోడ్డులో బకింగ్‌హాం కెనాల్‌పై ప్రస్తుతం ఉన్న ఆర్చ్ బ్రిడ్జి మీదుగా 320 మీటర్ల పొడవైన ఎక్స్‌ట్రా డోస్ట్ బ్రిడ్జి (కేబుల్ బ్రిడ్జి) నిర్మిస్తారు. రాజధానిలోని దొండపాడు నుండి మణిపాల్ ఆస్పత్రి వరకు సీడ్ యాక్సెస్ రోడ్డు మొత్తం పొడవు 21.7 కి.మీ.తొలి దశలో దొండపాడు నుండి మంతెన సత్యన్నారాయణరాజు ఆశ్రమం వరకు 2019కిముందే అప్పటి టిడిపి ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చింది. దాని పొడవు సుమారు 14కి.మీ. అక్కడి నుండి ప్రకాశంబ్యారేజి వరకు సుమారు 4.2 కి.మీ, రహదారి నిర్మాణం.భూ సేకరణ సమస్యల వల్ల నిలిచిపోయింది. రాజధాని పనుల్ని శరవేగంగా పట్టాలెక్కించిన కూటమి ప్రభుత్వం మంతెన ఆశ్రమం నుండి ప్రకాశం బ్యారేజి వరకు 4.కి.మీ రహదారి నిర్మాణ పనుల్ని చేపట్టింది. దీన్ని సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశగా వ్యవహరిస్తున్నారు. మధ్యలో అక్కడక్కడా భూసమీకరణకు సంబంధించి ఇబ్బందులు ఉన్నప్పటికీ పనులు చేస్తూనే రైతులతో సిఆర్‌డిఎ సంప్రదింపులు జరుపుతోంది. 4.2 కి.మీలో 1.5 కి.మీ., పనులు ఇప్పటికే మొదలయ్యాయి.

## మైనార్టీల సొమ్ము రూ.352 కోట్లు మళ్లించారు

### సాంఘిక వసతిగృహాల్లో పనులకు బిల్లులు చెల్లించలేదు: అసెంబ్లీ అంచనాల కమిటీ

### ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ విషయంలో వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలకు.. చేసిన పనులకూ ఎక్కడా పొంతనే లేదని అసెంబ్లీ అంచనాల కమిటీ నిర్ధారించింది. ఎస్సీ, ఎస్టీ,మైనార్టీల సంక్షేమాభివృద్ధికి 2019-22 సంవత్సరాల మధ్య ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడ ఖర్చు చేయలేదని బడ్జెట్ లెక్కలతో ఎండగట్టింది. గ్రామీణాభివృద్ధి కుంటు పర్చిందని విమర్శించింది.గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారినా పట్టించుకోలేదని వ్యాఖ్యానించింది అమ్మ ఒడి పథకాన్ని కూడ ఐదేళ్లలో మూడు సార్లు మాత్రమే ఇచ్చిందనీ..అదీ పిల్లలందరికీ ఇవ్వలేదని పేర్కొంది. వివిధ పథకాల క్రింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులనూ దారి మళ్లించినట్లు కమిటీ తేల్చింది.మైనార్టీ సంక్షేమానికి సంబంధించి రూ.352 కోట్లను ఆ మూడేళ్లలోనే దారి మళ్లించారని, దాని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా షాదీఖానాల నిర్మాణాలు, పాతవాటి మరమ్మత్తులు, ఈద్గాలు, మైనార్టీ కాలనీల అభివృద్ధివంటివేమీ చేయలేదని కమిటీ అసహనం వ్యక్తం చేసింది. అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం కమిటీ సమావేశమైంది. సాంఘిక, గిరిజన,మైనార్టీ సంక్షేమ శాఖలకు మూడు ఆర్థికర సంవత్సరాల్లో కేటాయించిన బడ్జెట్, కేంద్రం నుండి వచ్చిన నిధులు,వాటిని ఎలా ఖర్చు చేశారనేఅంశాలపైసమీక్షించింది. మైనార్టీల నిధుల దారి మళ్లింపు వల్ల కేంద్రం నుండి రావాల్సిన మరో రూ.1000 కోట్లు రాలేదని, రాష్ట్రం రూ.350 కోట్లు ఖర్చు చేస్తేనే ఆ నిధులను ఇస్తామని కేంద్రం చెబుతోందని అధికారులు చెప్పారు. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు సంబంధించి కేంద్రం అనేక పథకాల క్రింద నిధులు కేటాయిస్తున్నా వాటికి అప్పటి ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వక ఆగిపోయాయని సభ్యులు సమీక్షలో తేల్చారు.వసతిగృహాల్లో పిల్లలకు పెట్టిన భోజనాలకు సంబంధించిన బిల్లులూ ఇవ్వలేదు. వసతి గృహాల్లో అభివృద్ధిపనులకు మూడేళ్లలో బిల్లులేవీ ఎందుకు చెల్లించలేదు' అని కమిటీ సభ్యులు ప్రశ్నించగా అధికారులు మౌనం వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు భూమా అఖిల ప్రియ, డాక్టర్ పార్థసారథి, మద్దిపాటి వెంకటరాజు,నిమ్మక జయకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్షల ఫలితాల వెల్లడి

**విజయవాడ,మే14,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపిలో గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించినపరీక్షల ఫలితాలు బుధవారం విడుదలైనట్లుమంత్రి లోకేష్ ప్రకటించారు. ఫలితాలను ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ ఈరోజు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహించగా, మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎపిఆర్‌జేసీ, ఎపిఆర్‌డిసి ప్రవేశ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో టాపర్లు, అర్హత సాధించినవారికి మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. మొత్తంగా 7190 సీట్లు అందుబాటులో ఉండగా.. 73,993మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 62,047మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయిన తర్వాత విద్యార్థులు ఐదో తరగతి, ఆరు, ఏడు, ఎనిమిదో తరగతి, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ పేజీల్లో తాము రాసిన తరగతికి సంబంధించిన పేజీని ఎంచుకోవాలి. ర్యాంక్ రిజల్ట్‌పై క్లిక్ చేయాలి. అక్కడ క్యాండిడేట్ ఐడీ, పుట్టిన తేదీ, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి ర్యాంక్ కార్డులను పొందొచ్చు.

## త్వరలోనే అప్పా ఏర్పాటు చేస్తాం: హోంమంత్రి అనిత



బుధవారం ఉయ్యూరు పోలీసు స్టేషన్ ప్రారంభ సభలో హోంమంత్రి అనిత

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా ఉయ్యూరు రూరల్ కొత్త పోలీస్ స్టేషన్ భవనాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. గత టిడిపి హాయంలో 80శాతం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పూర్తి చేసి ప్రారంభిస్తోందని హోంమంత్రి వెల్లడించారు. రహదారి విస్తరణ కారణంగా భవనాలను అప్పట్లో తొలగించారు. ఎంతో సహృదయంతో గండిగుంట గ్రామానికి చెందిన సామాజిక వేత్త సజ్జా వెంకటేశ్వరరావు ప్రభుత్వ కార్యాలయాలకు గండిగుంట శివారు కాకానీనగర్‌కు సమీపంలో 1 ఎకరం 85 సెంట్లు స్థలాన్ని ఇచ్చి దాతృత్వం చాటుకోవడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రూ.25లక్షలతో ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించినట్లు స్పష్టం చేశారు. ఎపీకీ పోలీస్ అకాడమీ లేదు..త్వరలోనే అప్పా ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత స్పష్టం చేసారు.శ్రమదానం, జన్మభూమి, పి4 కార్యక్రమాలు సీఎం చంద్రబాబునాయుడులోని సామాజిక బాధ్యతకు నిదర్శనమని హోంమంత్రి అనిత అన్నారు.డ్రోన్లు సహా టెక్నాలజీ ద్వారా నేరాలను నియంత్రిస్తామన్నారు. ప్రతి ఇంట్లో ఓ పోలీస్ మనస్తత్వం కలిగిన వారు ఉండాలి..అప్పుడే నేరరహిత సమాజం సాధ్యమని హోం మంత్రి పేర్కొన్నారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించడమే కాకుండా ఎక్సైజ్ శాఖలో కీలక సంస్కరణలు చేపడుతోన్న మంత్రి కొల్లురవీంద్రకి అభినందనలు తెలియజేశారు.

## ఆ ముగ్గురూ బిజెపి భక్తులే

### కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రగతిశీల శక్తులతో ఉద్యమం

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు బిజెపి భక్తులేనని, వారికి పార్టీలు, జెండాలు, బొమ్మలు వేరైనా అందరూ బిజెపి ముఖాలేఅని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఎద్దేవా చేశారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత జగన్ బిజెపికి వ్యతిరేకంగా ఒక్కమాటైనా మాట్లాడగలరా అనిప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపిని నిలదీస్తే తప్పేముందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులతో కలసి రాజకీయ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేయనున్నట్లు స్పష్టంచేశారు.బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని బైరాగిపట్టెడలో సిపిఐ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లా డారు. టిడిపి, జనసేన, వైసిపి మోడీ భక్తులేనని వ్యంగ్యం చేశారు. మార్క్సిజం,లెనినజం ప్రపంచవ్యాపిత సిద్ధాంతం, చర్చలకు నక్సల్స్ సంసిద్ధత వ్యక్తంచేసినా హోంమంత్రి అమిత్‌షా ఖాతరుచేయక పోవడంపై మండిపడ్డారు.

## ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెంగళూరు వాసులు

### ముగ్గురు మృతి: పలువురికి గాయాలు

**శ్రీకాళహస్తిరూరల్, మే 14 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి-తిరుపతి మార్గంలోని జాతీయ రహదారి బుధవారం రక్తసిక్తమైంది. తిరుపతి వైపు నుంచి శ్రీకాకుళంకు వెళుతున్న ఓ వాహనం నిలబడిన లారిని వెనుక నుంచి ఢీకొనటంతో తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు అక్కడి కక్కడేమృతి చెందారు. కాగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తున్న కర్నాటకకు చెందిన ఓ టెంపో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనటంతో టెంపో బోల్తాపడింది.ఈ ప్రమాదంలో గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించగా ఓ మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. టెంపో బోల్తాలో గాయపడ్డ బెంగుళూరు వాసులు కొందరిని రుయా, మరి కొందరు బాలాజి ఆసుపత్రి ఇంకొందరిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చేర్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బుధవారం రోడ్డు ప్రమాదాలు,హత్యతో అట్టుడికిపోయింది.

**నిలబడ్డలారిని ఢీకొన్న కోళ్ళు లారీ . . .**

తిరుపతి శ్రీకాళహస్తిజాతీయరహదారి పై ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద ఉన్న టోల్‌గేట్ సమీపంలో అన్నమయ్యజిల్లా మంగంపేట నుంచి నెల్లూరు పోర్టుకు మెటల్ తీసుకెళుతున్న లారీ రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉండగా తమిళనాడు ధర్మపురి నుంచి శ్రీకాకుళంకు వెళుతున్న కోళ్ల లారీ ఢీకొనటంతో కోళ్ల లారీలో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కోళ్లు చెల్లాచెదరమైంది. ఈ ప్రమాదంలో కృష్ణన్(55),పెరుమాళ్ (40) అక్కడికక్కడే మృతి చెందారు. అయితే లారీ డ్రైవర్ స్టీరింగ్ వద్ద తగులుకోగా ఏర్పేడు పోలీసులు జెసిబితో వెలికి తీయాల్సి వచ్చింది. మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**డివైడర్‌ను ఢీకొన్న టెంపో . . .**

బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్స్‌ను అద్దెకు తీసుకొని తిరుమల, శ్రీకాళహస్తిని దర్శించుకొనుటకు బయలు దేరారు. ఈ వాహనంలో 18 మంది ఉన్నట్లు సమాచారం. శ్రీకాళహస్తికి సుమారు 10కిలో మీటర్ల దూరంలోని జాతీయ రహదారిపై డ్రైవర్ కన్ను మూయటంతో డివైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డవారిని వివిధ ఆసుపత్రులకు తరలించారు. అయితే ఎయిర్‌పోర్టు సమీపంలోని బాలాజి వైద్యశాలకు తరలించిన శుభం(45) అనే మహిళ మృతి చెందినట్లు సమాచారం అందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసు సిఐ రవినాయక్ సారథ్యంలో ఎస్ఐ నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమలలో తప్పిపోయిన ఒడిశా భక్తుడు



**తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన నార్సింగ్‌నాయక్(57)బంధువుల నుండి తప్పిపోయినట్లు తిరుమల 1టౌన్ పోలీ సులకు ఫిర్యాదు అందింది. పదిమంది బంధువులతో కలసి నాయక్ ఆదివారం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనానంతరం ఆలయం ఎదురుగా అఖిలాండం వద్ద కొబ్బరి కాయ కొట్టి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చారు. ఆ సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో నార్సింగ్ నాయక్ తప్పిపోయాడు. దీంతో బుధవారం నాయక్ కుమారుడు దేబాశిష్ నాయక్ తిరుమలకుచేరుకుని 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిఐ విజయకుమార్ కేసు నమోదుచేశారు. భక్తుడి ఆచూకీ తెలిస్తే 0877-2289027, 9440796769,9440796771 నంబర్లకుసమాచారం అందించాలని రైటర్ మోహన్ కోరారు.

## రక్తపాతంలేని విజయాన్ని భారత్ సాధించింది

### శ్రీవారి ఆశీస్సులతో భారతసైనికులకు మరింత శక్తినివ్వాలని వేడుకున్నా: ప్రభుత్వ విప్ బొల్లిశెట్టి శ్రీనివాసులు



**తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి:** శాంతిసామరస్యంగా ఉండే భారతదేశం పాకిస్థాన్‌పై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన యుద్ధంలో రక్తపాతంలేని విజయం సాధించిందని ప్రభుత్వ విఫ్ బొల్లిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. భారతసైన్యం ఎంతో హుందాగా, సమర్థవంతంగా పాక్ సైన్యం దొంగ దెబ్బను ప్రతి ఘటించి తిప్పికొట్టిందన్నారు. దేశాన్ని కాపాడుకోవడంతో బాటు ప్రజలకు పూర్తిరక్షణ కల్పించేలా దేశ ప్రధాని నరేంద్రమోదీ, భారతసైన్యం తీరు ప్రపంచదేశాలు గర్వించేలా మారిందన్నారు.ప్రధాని మోదీకి, భారత సైన్యానికి పూర్తిశక్తిసామర్థ్యాలు కలగాలని వేడుకుంటూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో తమిళనాడు, కర్నాటకలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో జనసేనపార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు.140కోట్ల భారతజనాభా ప్రశాంతంగా జీవనవిధానం సాగిస్తుండటం వెనుక సైన్యం ఒక నిబద్ధతో కాపలా కాయడమేనన్నారు. ప్రపంచంలోనే భారత్ శాంతికాముక దేశమన్నారు. పాకిస్థాన్ దొంగదెబ్బతీయడానికి కుయుక్తులు చేసినా మన సైన్యం గట్టిగా తిప్పికొట్టిందన్నారు. రానున్న రోజుల్లో మన సైన్యానికి అవసరమైన మనోధైర్యం, శక్తిసామర్థ్యాలు కలగాలని కోరుకుంటూ కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకోవడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం ఆయన విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

### భక్తులతో మమేకమైన టిటిడి ఛైర్మన్ నాయుడు

**తిరుమల,మే 14ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న మీకు తిరుమలలో కల్పిస్తున్న సౌకర్యాలు బావున్నాయా?ఇంకా మెరుగుపడాలా!అంటూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు భక్తులను పలకరించి అభిప్రాయాలు సేకరించారు. ముఖ్యంగా అన్నప్రసాదం, లడ్డూ రుచి,నాణ్యత పట్ల భక్తులు అపారమైన సంతృప్తి వ్యక్తం చేశారు. స్వామివారి దర్శనం ,క్యూలైన్లలో సేవలు కూడా బావున్నాయని పలువురు భక్తులు ఛైర్మన్‌కు తెలిపారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తిరుమలలోని అన్నప్రసాదం భవనం, లడ్డూవితరణశాలలో కౌంటర్లను, ఆలయంలోపల క్యూలైన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ భక్తులతో ఆయన స్వయంగా పలకరించి వారినుండి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.లడ్డూల నాణ్యత,పరిణామం బావుందని భక్తులు తెలిపారు. స్వామివారి దర్శనం కూడా ఆలయంలోపల మంచిగా చేసుకుంటున్నామని భక్తులు వివరించారు.

## తెలుగు, తమిళప్రజలకు అంతా మంచిజరగాలి

### శ్రీవారిసేవలో తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి

**తిరుమల, మే 14, ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల్లోని, తమిళనాడులోని ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ స్వామివారిని ప్రార్థించినట్లు తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి తెలిపారు. తమిళనాడులో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు మంచి మనసుతో ఆలోచన చేసి మళ్ళీ ఏఐడిఎంకె కూటమికి అధికారం ఇస్తారన్నారు. బుదవారం ఉదయం ఆయన అనుచరులతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు.

## మల్లేపల్లె ఘటనపై మాజీ సిఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ కడప జిల్లాలో ఈతకు వెళ్ళి ఐదుగురు చిన్నారులు మృతి చెందడంపై వైకాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లెకి చెందిన ఉప్పలపాటి నారాయణ యాదవ్ ఇంటికి అతడి చెల్లెళ్లు సావిత్రి, భవాని హైదరాబాద్ నుంచి పిల్లలతో కలిసి వచ్చారు. వేసవి సెలవులు కావటంతో ఈత కొట్టాలని సరదాగా ఐదుగురు పిల్లలు చెరువులోకి దిగారు. ఈ క్రమంలో చెరువులో ఈతకు దిగిన చరణ్ (15), పార్థు (12), హర్ష (12), దీక్షిత్ (12), తరుణ్ యాదవ్ (10) నీటిలో మునిగిపోయి మృతి చెందారు. చీకటి పడినా పిల్లలు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో చెరువు వద్దకు వెళ్లారు. పిల్లల బట్టలు ఒడ్డున ఉండటం.. చుట్టూ ఎక్కడా పిల్లల జాడ కనిపించపోవడంతో చెరువులో పిల్లలు గల్లంతైనట్టు తెలుసుకుని గాలించారు. సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. రాత్రి 11 గంటల సమయం తర్వాత పిల్లల మృతదేహాలు లభ్యమయ్యాయి.

## నకిలీపత్రాలు సమర్పించిన 17మంది న్యాయవాదులు బార్ కౌన్సిల్ నుండి తొలగింపు

**విజయవాడ,మే 14 ప్రభాతవార్తప్రతినిధి:** లా విద్యకు సంబంధించి నకిలీ ధృవపత్రాలతో న్యాయవాదులుగా కొనసాగుతున్న 17 మందిని రాష్ట్ర బార్ కౌన్సిల్ నుండి తక్షణమే తొలగిస్తూ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.ఈ సమాచారాన్ని నేడు న్యాయవాదుల ఫోరమ్ ప్రతినిధులు తెలిపారు.ఇంకా పలువురు దిగువ స్థాయి న్యాయస్థానాల్లో ఇటువంటి వారున్నారని వారిపై కుడా విచారణ జరిపి తగినచర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులుగా నమోదు అయ్యే సమయంలో రాష్ట్ర బార్ కౌన్సిలుకు వీరంతా అర్హత లేకుండా తప్పుడు మార్గంలోవిద్యకు సంబంధించిన దృవపత్రాలు సమర్పించారు. రాష్ట్ర ఎన్రోల్మెంట్ కమిటీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఈ అంశాన్ని తెలియజేయగా, బార్ కౌన్సిల్ రోల్స్ నుండి వారి పేర్లు తొలగించాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఈ నకిలీ న్యాయవాదులంతా హైకోర్టుతోపాటు వివిధ ప్రాంతాల్లో న్యాయవాద వృత్తి కొనసాగించారు.

వార్త

సంపదకి అహంకారం తోడైతే, అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.

-గోల్డ్‌స్మిత్

# సరస్వతీ నమస్తుభ్యం!


చదువుల తల్లి సరస్వతీ దేవి నేడు నదీ అంతర్ముఖాన భక్తజనులందరికీ సాక్షాత్కరిస్తోంది. ప్రాచీన కాలంలోనే త్రివేణి సంగమంలో అంతర్లీనంగా ఉండిపోయిన సరస్వతీ నది ఈసారి పుష్కరాల రూపంగా మనకు కనిపిస్తుంది. ఏటావసంత పంచమి రోజున సరస్వతీ దేవి సర్వజనుల పూజలందు కుంటుంది. సరస్వతీ నమస్తుభ్యమంటూ ప్రతి నిత్యం తెలుగునాట విద్యార్థినీ విద్యార్థులు తొలి నమస్కారం ఆ ఆశ్రిత కల్పవల్లికే సమర్పించడం ఆనవాయితీ. మేధో వృద్ధి కోసం విద్యార్థులు, జ్ఞానసముపార్జన కోసం ఉపాధ్యాయులు జ్ఞానార్జన కోసం పండితులు, సృజనాత్మకత కోసం కళాకారులు ఆ దేవికే నిత్య పూజగావించడం తెలిసిందే. పురాణాల్లో గంగా,యమున, సరస్వతిలకు నదీ స్థానం ఉంది. త్రివేణి సంగమమనగానే ఆ ముగ్వురి సంగమమే. గంగా యమున కలిసి పారినా సరస్వతీనది అంతర్లీనంగా ఉందని ప్రాచీన పురాణ సంపద నుంచి సేకరించిన వివరాలు ఆనోటా ఈనోటా జనశ్రుతిగా మారాయి. భారతీయ సంస్కృతిలో నదీస్నానమంటే ఎంతో పవిత్రమైన ఆచారం. నదీజలాలు మన శరీరాన్ని శుభ్రపరచి మనసును ప్రశాంతంగా ఉంచుతుందనినమ్ముతారు. ఇలా స్నానం చేసేటప్పుడు 'ఓం గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధమ్ కురు' అనే మంత్రాన్ని పఠిస్తారు. స్నానవిధి కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ కారణం చేతనే కాస్త పెద్ద వయసు వాళ్లు పుష్కరాల సమయంలోనేగాకుండా, పుణ్య దినాల్లోనూ స్నానమాచరించి దీపం పెడతారు. పుణ్య ఫలం దక్కుతుందని ప్రతీతి. ఈమధ్య పై శ్లోకంలో ఉచ్చరించే సింధు, సరస్వతీ నదుల ప్రస్తావన దేశకాల మాన పరిస్థితుల కారణంగా విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. ఒకటి దాయాది వివాదంలో మరొకటి పుష్కరాల సందర్భంగా. ఈ మధ్యనే మహాకుంభమేళా జరిగిన రోజుల్లో యమునా తీరాన ఉన్న న్యాఢిల్లీ కథాక్రమంలో దాదాపు నదుల ప్రస్తావన, చరిత్రల గురించి విశేషంగా తెలుసుకున్నాము. కీర్తించుకున్నాము. భారతీయ సంప్రదాయంలో పుష్కరాలకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతి 12 సంవత్సరాలకు నదులన్నిటికీ పుష్కరాలువస్తాయి. పుష్కరుడు కొలువై ఉన్న సమయాలనే పుణ్యదినాలుగా భావిస్తుంటాము. అందుకే ఆ రోజుల్లోనే భక్తులు నదీ స్నానమాచరించుటకు ఏర్పాట్లు చేస్తారు. ఈ తరుణంలో శరీర శుద్ధికే కాకుండా పితృదేవతల ఆశీస్సులకు, పాపప్రక్షాళనకు పుణ్యనదీస్నానం మంచిదని పురాణేతిహాసాల ప్రస్తావన. నదీ స్నానంతోపాటు తర్పణం, జపం, దానం తదితర పుణ్యకార్యాలు కూడా గతించిన వారికి శాశ్వత బ్రహ్మలోకం సంప్రాప్తిస్తుందన్నది భక్తుల విశ్వాసం. ఇప్పు డు చార్‌ధామ్ యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనలకు అంతిమంగా మోక్షమార్గాన్నే సూచిస్తాయి. బ్రహ్మ బృహ స్పతికిచ్చిన వరం ప్రకారం బృహస్పతి మేషం నుండి మీనం వరకు ఒక్కొరాశిలోనూ పన్నెండు రోజులుంటారు. ఏడాది పొడవునా మధ్యాహ్నం రెండు ముహూర్తాల సమయం పుష్కరుడు బృహస్పతిలో కలిసి ఉంటాడు. ఆ సమయంలో నదీస్నానం చేయడం పుణ్యప్రదం. వేదాల్లో సరస్వతీ నదిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. రుగ్వేదం ఆమెను, అమ్బీతమే, నదీతమే, దేవితమే'అనిస్తుతిస్తుంది. అంటే తల్లులలో కెల్లా గొప్ప తల్లి. నదులలోకెల్లా అతి పవిత్రమైనది. దేవతలలో శ్రేష్ఠమైనది అని అర్థం.ఆమె జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. విద్యాధిదేవత, సంగీతానికి అధిపతి, వాక్కును ప్రసాదించే వాగ్దేవి శక్తిగా పూజలందు కుంటుంది. 'పంచలింగ బ్రహ్మణం' ప్రకారం సరస్వతీ నది మహాప్రబలమైన నది. విస్తృత భూగర్భాన్వేషణుల ప్రాతిపదికగా సరస్వతీ నది పెక్కుసార్లు తన ప్రవాహ దిశను మార్చుకుంటూ, క్రీ.పూ 1900ప్రాంతంలోపూర్తిగా ఎండిపోయిందని అంచనా. మహాభారత యుద్ధకాలం నాటికి శుష్కించి ఎడారిలో కలిసిపోయినట్లు పౌరాణికులు చెప్తుంటారు. కేదారంవద్ద పశ్చిమదిశగా తిరిగి, భూగర్భంలో అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. రుగ్వేదంలోనూ, వేదాల్లోనూ ఇతిహాసాలకు పవిత్ర నదిగాఉన్న సరస్వతీదేవికి గురువారం నుంచి పుష్కర సమయం మొదలవుతుంది. దక్షిణ భారత దేశంలో తెలంగాణ ప్రాంతంలో గోదావరి,ప్రాణహిత నదులతోపాటు సరస్వతీ నది కూడా కాళేశ్వరం వద్ద కలుస్తుందని చరిత్రకారులు నిర్ణయించారు. దాంతో పుష్కరాలు విశేషంగా నిర్వహించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు రావడం పుణ్యనదీస్నానాలు చేయడం,జపతప తర్పణాలు నిర్వహించడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం, పుష్కరదినాల్లో సౌకర్యాల కల్పనలో సమయస్ఫూర్తితో సంయమనంతో వ్యవహరించే అధి కారగణాన్ని నియమించాల్సిన బాధ్యత పాలకుల మీద ఉంది.ఎక్కడో ఏదో జరిగిందనికాదు. జరుగకూడనిదేదీ ఇక్కడ జరుగకూడదని భక్తుల వినతి. మొన్నటి మహా కుంభమేళా, నిన్నటి సింహాచలం దుర్ఘటన, అటు మొన్నటి తిరుపతిలో తొక్కిసలాటలన్నీ నిర్వాహకులకు గుణపాఠాలు కావాలి. అక్కడి అనుభవాలతో మరో అవాంఛనీయాలను రానీయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాళేశ్వరంలో నదీస్నాన ఘాట్‌ల పొడవు పెంచి నూతన ఘాట్‌లను విస్తరించారు. దాదాపు రోజూ లక్ష మందికి పైగా జనం నదీస్నానాలకు వస్తారని అంచనాలున్నందున ఆలోచించాలి. ప్రత్యామ్నాయ ఘాట్‌లు ఏర్పాటు చేయడమే కాదు సరస్వతీదేవి జ్ఞానదీపాలను ఇంటికి తీసుకెళ్లే మార్గం సుగమం చేయాలి.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగినకాలం,వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### పాకిస్థాన్‌ను నమ్మకూడదు

అమెరికా చేస్తున్న భారత్ పాకిస్తాన్ల మధ్య సంధి ప్రయత్నాలు ఎందుకు అర్థం చేసుకోవాలి. అమెరికా పాక్‌తో వ్యాపారసంబంధాలు ఎప్పటినుండో కొనసాగుతున్నాయి. అవి దెబ్బతిన కుండా ఉండటం కోసమే ఈ ప్రయోగాలు. 1947,1965, 1971, 1999 సంవత్సరాలలో పాక్ తో పూర్తిస్థాయి యుద్ధాలు జరిగి పాక్ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నా దానికి బుద్ధి రాలేదు. రాదు కూడా. భారత అధీన రేఖవద్ద2016,2019లో పాక్ తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన వలసి వచ్చింది. తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు కాని మూర్ఖుని మనసు రంజింప చేయలేమని కవులు ఏనాడో చెప్పారు. ప్రధాని మోడి పాక్‌ను ఏమని హెచ్చరిస్తున్నారంటే ఉగ్రవాదులను అప్పచెప్పమని, వారు ఆక్రమించిన కాశ్మీర్‌లోని భారత భూభాగాన్ని తమ ఆధీనంలోకి యివ్వాలని అన్నారు. ఈ మాట ప్రజలకు నచ్చినట్లు లేదు. నడుస్తున్న యుద్ధాన్ని పొడిగించి మన ప్రాంతాన్ని మనం తెచ్చుకోవడంలో తాత్సారం దీనికి?

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం యువకులకు ఒకవెలుగు రేఖ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒకఆశారేఖ ఒకవైపు కోటిమంది మహిళలను రుణాలు మంజూరుచేస్తూ యువకులకు రుణాలు మంజూరుచేస్తూ రాష్ట్రం సిద్ధించిన జూన్ 2న కొత్త ప్రయానంలోకి యువకులను తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నది. యువకులకు వివిధ అవకాశాలు వ్యాపారాలకు అధిపతులు చేసే ప్రయత్నం ఈ పథకంద్వారాసాగుతుంది.దీనిప్రధాన ఉద్దేశం వినియోగాన్ని పెంచడం ద్వారా ఉత్పత్తికి అవకాశం కల్పించడమే.

-బి. అవినాష్, జనగామ

### అభివృద్ధి అంటే ఇదేనా?

అభివృద్ధి చెందుతున్న దేశంలో పరిశ్రమలు, వాహనాలు ఎక్కువ కావడంతో గాలి, నీరు కలుషితమై ప్రజలు అనేక వ్యాధులబారిన పడుతున్నారు. ఈ కలుషితమైన గాలిని పీల్చడం వల్లకేన్సర్ అనే భయంకరమైన వ్యాధి ప్రజలను పట్టి పీడిస్తోంది. జల కాలుష్యం వల్ల దాహమేస్తే నీళ్ల తాగడానికిభయపడిపోతున్నారు ప్రజలు.ఈనీళ్ల తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిదికాదని తెలిసినా తప్పడం లేదు.

-కె. నాగేంద్ర, హైదరాబాద్

### మణుగూరు ప్యాసింజర్ మళ్లీ నడపాలి

కాజీపేట నుండి భద్రాచలం రోడ్డు వరకు, భద్రాచలం రోడ్డు నుండి కాజీపేట వరకు 158 కిలోమీటర్ల పొడవునా గతంలో నడిచిన మణుగూరు ప్యాసింజర్ రైలును తిరిగి పునః ప్రారంభించాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఖమ్మం జిల్లా పరిధిలోని కాజీపేట. వరంగల్, నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, గార్ల,డోర్నకల్, కారేపల్లి,భద్రాచలం రోడ్డు,మణుగూరు, ప్రధాన రైల్వేస్టేషన్లతో పాటుగా మరికొన్నిరైల్వే స్టేషన్లలో కూడా గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు ఈ ప్యాసింజర్ రైలు అనుకూలంగా ఉంటుంది. కూలీలకు, విద్యార్థులకు,చిరు వ్యాపారులకు తక్కువ టికెట్ ధరతో పేద ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. గతంలో నడిచిన మణుగూరు ప్యాసింజర్ రైలు కరోనా వైరస్ కారణంగా నిలిపివేయడం జరిగింది. దాదాపు చాలావరకు అన్ని రైలు పునః ప్రారంభించడం జరిగింది. కానీ ఈమణుగూరు ప్యాసింజర్ రైలును మాత్రం నిలిపివేయడం జరిగింది. ప్రయాణికుల అవసరాల నిమిత్తం రైల్వే అధికారులు తిరిగి పునః ప్రారంభించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమికాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పని నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తిపలకాలి. అప్పుడు వృత్తిలో కూడా ఎదగడానికి ఆస్కారం ఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఆహార పదార్థాల కల్తీ

తెలుగు రాష్ట్రాలలో ఆహార పదార్థాలు కల్తీ విపరీతంగా పెరిగిపోతూ వున్నది. ముఖ్యంగా హోటల్స్, బేకరీలు, ఫ్రై సెంటర్స్ లో ఎక్కువగా కల్తీపదార్థాలు విక్రయిస్తువున్నారు. ఆహార పదార్థాలల్లో రుచి కోసం రంగులు కలపడం, మసాలాలు అధికంగా వాడటంవల్ల అవి తిన్నవారు మృత్యువాత పడుతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల ఇవి జరుగుతున్నాయి.

-కె. సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రేపటి సుస్థిరత కోసం సేంద్రియ వ్యవసాయం

**భారతదేశ స్మార్ట్ సిటీల మార్కెట్ 2025 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సాంకేతిక పురోగతులు సుస్థిరమైన పరిష్కారా లను రూపొందించడంలో భారతదేశం పెరుగుతున్న సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. సుస్థిరత్వం కేవలం సాంకేతికతకు మాత్రమే పరిమితం కాదు. సమాజం కూడా పర్యావరణ స్పృహతో ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్ వ్యక్తులు, సమాజాలు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సాహన్నిస్తుంది. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఉద్యమం స్థిరమైన జీవనశైలిని ప్రోత్స హిస్తుంది.సిక్కిం ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగా సేంద్రియ రాష్ట్రంగా మారడం వంటి విజయవంతమైన సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలు సమాజం కృషికి నిదర్శనం. వ్యక్తులు, సమాజాలు చురుకుగా పర్యావరణ పరిరక్షణలో పాల్గొంటేనే దీర్ఘకాలిక విజయం సాధ్యమవుతుంది.**

డి జె మోహన రావు

నేడు భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. అయితే ఈ ప్రగతి పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉండాలన్నది నేటి తక్షణావసరం. ఆర్థికాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత ఒకదానికొకటి విడదీయరాని అంశాలు. ఈ నేపథ్యంలో, సుస్థిరమైన భవిష్యత్తును సాధించడానికి ఆవిష్కరణల పాత్ర అత్యంత కీలకం. 'సుస్థిరమైన రేపటి కోసం ఆవిష్కరణల శక్తి' అనే ఈ నినాదం కేవలం ఆకాంక్ష కాదు, ఇది మనందరి కర్తవ్యం. ప్రభుత్వం,పరిశ్రమలు, వ్యక్తులు, సమాజాలు ఇలా ప్రతిఒక్కరూ కలిసి రావాల్సిన సమయం ఇది. భారతదేశం ఒక విశాలమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్నదేశం. ఇక్కడ పర్యావరణ సవాళ్లు ఎన్నోఉన్నాయి. అదే సమయంలో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలు కూడాఉన్నాయి. మన జనాభా ఎక్కువ, అభివృద్ధి అవసరాలు మెండుగా ఉన్నాయి. కాబట్టి సుస్థిరత్వం అనేది మన అభివృద్ధి వ్యూహంలో ఒక అంతర్భాగంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధిని పర్యావరణ క్షీణత నుండి వేరు చేయడానికి ఆవిష్కరణలు అత్యంత ఆచరణాత్మకమైన మార్గాన్ని అందిస్తాయి. భారతదేశం సుస్థిరత్వం దిశగా అనేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి సాధించింది. 2014-15లో 24 గిగావాట్లుగా ఉన్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2024-25 నాటికి 136 గిగావాట్లకు చేరుకుంది. 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని భారత్ సంకల్పించింది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, 2023-24లో శిలాజేతర ఇంధన సామర్థ్యం మొత్తం సామర్థ్యంలో 45శాతానికి పెరిగింది. 2014-15లో ఇది కేవలం 29శాతంగా ఉండేది. జాతీయ సౌర మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అంతేకాకుండా, ప్రభుత్వం 19,744 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్ఠాత్మకమైన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రారంభించింది. ఇప్పటికే ఐదు రాష్ట్రాలు స్వతంత్ర గ్రీన్ హైడ్రోజన్ విధానాలను ప్రవేశపెట్టాయి. స్వల్ప రాయితీలతోనే పునరుత్పాదక ఇంధన రంగం వృద్ధి చెందుతుండటం విశేషం. ఈ చర్యల ద్వారా భారతదేశం స్వచ్ఛమైన ఇంధన పరివర్తనలో ప్రపంచ నాయకత్వ స్థానాన్ని పొందుతోంది. ఇది కేవలం కర్బన ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, దేశ ఇంధన భద్రతను కూడా పెంపొందిస్తుంది. 2030 నాటికి 50 శాతం శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యానికి ఇది అనుగుణంగా ఉంది. వ్యవసాయ రంగంలో కూడా సుస్థిరతను సాధించడానికి అనేక ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. పంటల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ కోసం కృత్రిమ మేధస్సు, డ్రోన్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. ఫార్మోనాట్ వంటి సంస్థలు ఉపగ్రహ ఆధారిత వ్యవసాయ యాజమాన్య పరిష్కారాలను అందిస్తున్నాయి.సేంద్రియవ్యవసాయ పద్ధతులకు ప్రభుత్వం ప్రోత్సాహన్ని పెంచుతోంది. దీని ద్వారా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గి,పర్యావరణానికి మేలు జరుగుతోంది. వినియోగదారుల నుండి సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది తీరుస్తుంది. ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట దిగుబడి 10-20 శాతం పెరిగే అవకాశం ఉంది. నీరు, ఎరువుల వినియోగం 30-40 శాతం వరకు తగ్గుతుంది. ఈ విధంగా సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం ద్వారా ఆహార భద్రతను పెంపొందించడం



తోపాటు, నీటి వంటి విలువైన వనరులను కూడా సంరక్షించవచ్చు. ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యం2 (ఆకలిలేని ప్రపంచం), లక్ష్యం 15 (భూమిపై జీవం)కు దోహదం చేస్తుంది. భారతదేశంలో వ్యర్థాల నిర్వహణ కూడా ఒక పెద్ద సవాలు. అయితే ఈ రంగంలోనూ అనేక ఆవిష్కరణలు వస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి అధునాతన సాంకేతికతలు (మెకానికల్, కెమికల్) అందుబాటులోకి వస్తున్నాయి. వస్తువుల తయారీదారులు తమ ఉత్పత్తుల వ్యర్థాల బాధ్యత తీసుకోవాలనే 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ' విధానం ఈ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 7,793 కిలో టన్నుల వస్త్ర వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలను తిరిగి ఉపయోగించడంపై దృష్టి సారించడం చాలా అవసరం. ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈవ్యర్థాలు) రీసైక్లింగ్‌లోనూ గణనీయమైన పురోగతి ఉంది. అటెర్రో రీసైక్లింగ్ వంటి సంస్థలు విలువైన లోహాలను తిరిగి పొందడానికి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నాయి. వ్యర్థాలను సమర్థవంతంగా వేరు చేయడానికి కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలు అభివృద్ధి చేయబడుతున్నాయి. 2030 నాటికి భారతదేశ ఈవ్యర్థాలు రెట్టింపు అవుతాయని అంచనా. వ్యవసాయ వ్యర్థాలైన బయోమాస్‌ను శక్తి ఉత్పత్తికి (బయోగ్యాస్, బయోసిఎన్‌జి, బయోఫ్యూయల్) ఉపయోగించడం కూడా పెరుగుతోంది. ఈ రంగానికి పునరుత్పాదక ఇంధన విధానాలు మరింత ఊతమిస్తున్నాయి. ఈవిధంగావ్యర్థాలను విలువైన వనరులుగా గుర్తించి, వాటిని సమర్థవంతంగా రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యం 12 (బాధ్యతాయుతమైన వినియోగం ఉత్పత్తి)కు అనుగుణంగా ఉంది. సుస్థిరమైన భవిష్యత్తు కోసం భారతదేశం అనేక అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటోంది.సౌరశక్తి రంగంలో రెండు వైపులా కాంతిని గ్రహించే బైఫేషియల్ సోలార్ ప్యానెళ్లు, గ్రిడ్ స్థిరత్వం కోసం ఎ ఐ ఆధారిత సౌర సూచనలు, భూమి వినియోగాన్ని తగ్గించే తేలియాడే సౌర విద్యుత్ క్షేత్రాలు వంటివి అభివృద్ధి చేయబడుతున్నాయి. పవన శక్తిలో కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే టర్బైన్ల తయారీ, బలమైన గాలులు వీచే సముద్ర తీరాలలో పవన క్షేత్రాల ఏర్పాటు, పనితీరును మెరుగుపరచడానికి డేటా అనలిటిక్స్ వినియోగం వంటి ఆవిష్కరణలు జరుగుతున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి,పునరుత్పాదక ఇంధనాన్ని ఉపయోగించి నీటిని విడగొట్టడం ద్వారా,ఉక్కు,రవాణా వంటి కష్టతరమైన రంగాలను డీకార్బనైజ్ చేయడానికి, భారతదేశ ఇంధన భద్రతను పెంచడానికి ఒక గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఖచ్చితమైన వ్యవసాయంలో పంటల పర్యవేక్షణ, పిచికారీ కోసం డ్రోన్లు, నేల ఆరోగ్యం కోసం సెన్సార్లు, వ్యక్తిగతీకరించిన సలహా కోసం ఫార్మోనాట్ సలహా వ్యవస్థలు ఉపయోగిస్తున్నారు. స్మార్ట్ సిటీలలో కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్ ఉపయోగించి విద్యుత్ పంపిణీని ఆప్టిమైజ్ చేయడం, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడం,వ్యర్థాల సేకరణను క్రమబద్ధీకరించడం వంటివి జరుగుతున్నాయి. భారతదేశ స్మార్ట్ సిటీల మార్కెట్ 2025 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సాంకేతిక పురోగతులు సుస్థిరమైన పరిష్కారాలను రూపొందించడంలో భారతదేశం పెరుగుతున్న సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. సుస్థిరత్వం కేవలం సాంకేతికతకు మాత్రమే పరిమితం కాదు. సమాజం కూడా పర్యావరణ స్పృహతో ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్ వ్యక్తులు, సమాజాలు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సాహన్నిస్తుంది. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఉద్యమం స్థిరమైన జీవనశైలిని ప్రోత్స హిస్తుంది.సిక్కిం ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగాసేంద్రియ రాష్ట్రంగా మారడం వంటి విజయవంతమైన సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలు సమాజం కృషికి నిదర్శనం. వ్యక్తులు, సమాజాలు చురుకుగా పర్యావరణ పరిరక్షణలో పాల్గొంటేనే దీర్ఘకాలిక విజయం సాధ్యమవుతుంది. ●

# దేశ రక్షణలో జవాన్, దేశ పోషణలో కిసాన్

జి. అజయ్ కుమార్

ఒకరిది భూమి కోసం సాహసం, మరొకరిది భూమితో సహవాసం.. సైనికుడు సరిహద్దుల్లో విపత్కర పరిస్థితుల్లో అయిన వారిని ఆత్మీయులను వదిలి శత్రువులపై నిరంతరం యుద్ధం చేస్తే రైతు పుడమి ఒడిలో ప్రకృతి బడిలో విత్తనాలనే అక్షరాలతో స్వేదం విడిచి సాగు యుద్ధం సాగిస్తాడు. దేశానికి నిస్వార్థంగా సేవ చేసే ఈ ఇద్దరి ప్రస్థానం అందరికి ఎంతో గర్వకారణం. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్ర మూకలను మట్టుపెట్టింది. ఈ ఆపరేషన్‌లో మురళి నాయక్ లాంటి జవాన్లు ప్రాణాలను పణంగా పెట్టి, దేశభద్రత కోసం పోరాడిన విధానం చేసిన త్యాగం మాటల్లో చెప్పలేనిది. ఇంకా ఎంతో మంది మహిళా సైనికులు కూడా యుద్ధ భూమిలో వారి తెగువను చూపిస్తున్నారు. వీరందరి ధైర్య సాహసాలు ఎందరికో స్ఫూర్తిదాయకం ఇలాంటి ఎన్నో సందర్భాల్లో, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయినా కూడా దేశ రక్షణ కోసం ముందుండి నిలబడే ఒకే ఒక్కరు సైనికులు. సైనికుడి జీవితం త్యాగానికి, క్రమశిక్షణకు నిదర్శనం, ఉన్న ఊరినీ అయిన వారిని అందర్నీ వదిలేసి దేశ రక్షణకు ముందుండి. ఎండకు, వానకు, మంచుకు తట్టుకుని ఎన్ని కఠోర పరిస్థితులు వచ్చినా యుద్ధం వచ్చినా వెనక్కి తగ్గకుండా దేశపు ప్రతి అంగుళాన్ని కాపాడేందుకు నిద్రలేని రాత్రులు గడుపుతూ,దేశ భద్రత కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యాగం చేసే ధైర్య



వంతుడు జవాన్. రైతు దేశ ప్రజల కడుపు నింపే దేవుడు. అతని చేతుల్లోనే అందరి జీవితం, అతడు స్వేదం చిందించి సేద్యం చేస్తేనే అందరికి ఆహారం. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ధరల లేమి లాంటి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ, దేశానికి ఆహారాన్ని అందించేందుకు రైతు నిత్యం కృషి చేస్తాడు. అతని శ్రమకి వెలకట్టలేం.సైనికుడు లేకపోతే దేశం శత్రువుల ఆక్రమణలోకి వెళుతుంది. అన్నదాత లేకపోతే ప్రజలు ఆకలితో అలమటించాల్సి పరిస్థితి. ఒకరు దేశానికి రక్షణ గోడగా నిలిస్తే, మరొకరు దేశానికి కావలసిన ఆహారాన్నిఅందిస్తాడు. ఇద్దరూ దేశానికి వెలకట్టలేని సంపద వారిని గౌరవించుకోవడం, వారి పట్ల బాధ్యతగా ఉండడం అందరి కర్తవ్యం. దేశం వీరి మీద ఆధారపడినప్పుడు, దేశం కోసం వీరు ఎంతో చేస్తున్నపుడు, అందరూ కూడా వారి పట్ల బాధ్యతగా ఉండాలి. జవాన్లకు గౌరవం ఇవ్వడం, వారికి ఆర్థిక భరోసాను, భద్రతను కల్పించడం, వారి ఆస్తులకు రక్షణ కల్పించడం, వారి కుటుంబాలకు భరోసానివ్వడం,పింఛన్లు లాంటివి వారి త్యాగాలకు కొంతమేర అయినా ఉపశమనం కల్పిస్తాయి. రైతులను గౌరవించడం, వారికి ఆర్థిక భద్రత, పంటలకు మద్దతు ధరలు, రైతు భీమాలు, ప్రభుత్వ రాయితీలు కల్పించడం, రైతులకు పింఛన్లు ఇవ్వడం, రైతు కుటుంబాలకు భరోసా కల్పించడం వంటివి రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత నిస్తాయి. ఇవన్నీ సమాజంగా, ప్రభుత్వంగా అందరూ కలసి చేయాల్సిన కనీస బాధ్యత. ●

# పాకిస్థాన్‌కు పక్కలో బల్లెంలా బలూచిస్థాన్

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలో అగ్రభాగమైన బలూచిస్థాన్ అనాదిగా పాక్ ప్రభుత్వానికి, పాక్ ఆర్మీకి కొరకరాని కొయ్యగానే మారుతూ వస్తున్నది. పాకిస్థాన్‌లో 44 శాతం భూభాగాన్ని కలిగిన బలూచిస్థాన్ ప్రాంతంలో ఖరీదైన ఖనిజ, గ్యాస్, ఇతర తీరప్రాంత విలువైన నిల్వలున్నాయి. దాదాపు 25కోట్ల పాకిస్థాన్ జనాభాలో దాదాపు 4 శాతంగా, అనగా 1.5 కోట్ల జనాభా ఉన్న బలూచిస్థాన్, 44 శాతం భూభాగాన్ని కలిగి ఉంది. ఈ ప్రాంత సహజ వనరులను యథేచ్ఛగా వాడుకుంటున్న పాకిస్థానీ ప్రభుత్వం తమ ప్రాంతానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం, ఆర్థికంగా ఈ ప్రాంతం నుంచి లాభపడడం, సామాజికంగా పాక్ ఆర్మీ బలూచిస్థానీలను అణచి వేయడం జరిగిందని బిఎల్‌ఏ చెబుతున్నది. తమ ప్రాంతాన్ని 1948లో బలవంతంగా పాకిస్థాన్‌లో విలీనం చేసుకున్న నాటి నుంచి నేటి వరకు బలూచిస్థాన్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో తమ ప్రాంతం వెనుకబడి పోయిందని, ఇక్కడ పేదరికం రాజ్యమేలుతోందని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఏ) తో పాటు ఇతర బలూచిస్థానీ సంస్థలు గత కొన్నేళ్లుగా స్వతంత్ర దేశం కావాలని పోరాడుతున్నది. గత కొన్నేళ్లుగా బలూచిస్థాన్‌పై మిలటరీ ఉక్కుపాదం మోపుతూ స్థానిక ప్రజలపై విపరీతమైన అణచివేతకు గురి చేశారని నేడు బిఎల్‌ఏ ఆవేశంతో ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా తమ ప్రాంతం కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, రాజకీయ నాయకులను విచక్షణారహితంగా పాక్ భద్రతాదళాలు చంపివేస్తూ బిఎల్‌ఏ స్వతంత్ర ఉద్యమాన్ని అదుపు చేయడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తూ వస్తున్నది. ఎక్కడ దీర్ఘకాలం పాటు అణచి వేత ఉంటుందో అక్కడి బాధాతప్త ప్రజలు పిడికిలు బిగించి విప్లవ శంఖారావం పూరిస్తారని నేడు బిఎల్‌ఏ రుజువు తెస్తున్నది. ప్రస్తుతం భారత్ ప్రకటించినా ఆపరేషన్ సింధూర్‌తో పాక్ భద్రతా దళాలు మొత్తం ఇండియా సరిహద్దుల్లోకి తరలించడంతో బలూచిస్థాన్‌లో బిఎల్‌ఏ రెచ్చిపోయి పాక్య భద్రతా దళాలు,పోలీసులను తరిమి తరిమి కొట్టడం జరుగుతోంది. దీనికి తోడుగా బలూచిస్థాన్‌లో ప్రధాన నగరమైన క్వెట్టాను బిఎల్‌ఏ ఆక్రమించడం కూడా జరిగింది. బలూచిస్థాన్‌లోని విలువైన సహజ వనరులు కావాలి కాని బలూచిస్థాన్ అవసరం లేదు అన్నట్లుగా పాకిస్థానీ ప్రభుత్వాలు, భద్రతాదళాలు గత కొన్నేళ్లుగా ప్రవర్తిస్తూ వస్తున్నాయని బిఎల్‌ఏ ఆరోపిస్తున్నది. బలూచిస్థాన్ పక్షాన మాట్లాడిన ప్రతి ఒక్కరినీ తీవ్రవాదులు లేదా 'విదేశీ ఏజెంట్లు'గా ముద్రవేసి శిక్షలు ఖరారు చేయడం,కాల్చి చంపడం, చిత్రహింసలు పెట్టడం కొనసాగుతున్నట్లు అంతర్జాతీయ స్వచ్ఛంధ సంస్థలు సహితం పేర్కొంటున్నాయి. తాజాగా పాక్‌కు చెందిన పోలీస్ స్టేషన్లు, మిలటరీ కాన్వాయ్‌లు లాంటి ముఖ్యమైన 39 వ్యూహాత్మక ప్రదేశాలపై



బిఎల్‌ఏ బాంబులతో దాడి చేసి నాశనం చేసినట్లు కూడా తెలుస్తున్నది. తమ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించాలని పోరాటం చేస్తూ, గాయాల పాలవుతూ, ప్రాణాలు కోల్పోతూ దీర్ఘకాలం నుంచి పోరాడుతున్న బిఎల్‌ఏకు నేడు ఆపరేషన్ సింధూర్ ఓమంచి అవకాశాన్ని ఇచ్చినట్లు అయిందని, దీనిని ఆసరాగా చేసుకొని పాక్ భద్రతాదళాలు ప్రభుత్వ యంత్రాంగాలపై దాడులు చేస్తూ ఆయా ప్రాంతాలను విజయవంతంగా తమ అధీనంలోకి తీసుకోవడం కొనసాగుతున్నది. గత కొన్ని రోజులుగా బలూచిస్థాన్ ప్రాంతంలోని పాక్ భద్రతాదళాల క్యాంపులు లేదా స్థావరాలు లక్ష్యంగా బిఎల్‌ఏ, ఇతర సారూప్య గ్రూపులు దాడులు చేస్తూ, సర్వనాశనం చేస్తూ ముందుకు సాగుతున్నారు. తమ ప్రాంత వనరులను దోచుకుంటున్న పాకిస్థానీ ప్రభుత్వ యంత్రాంగాలపై బిఎల్‌ఏ దాడులను పెంచడం జరుగుతున్నది. బలూచిస్థాన్‌లో జరుగుతున్న అల్లర్లకు కారణం కేవలం 1,500 మంది బలూచిస్థానీ వాసులు మాత్రమే అని ఇస్లామాబాద్ ఆరోపిస్తున్నది. కొన మెరుపుగా 14 మంది పాకిస్థానీ భద్రతాదళాలను బిఎల్‌ఏ మట్టుబెట్టడం మనం చూసాం. బలూచిస్థాన్ అమూల్య సహజ వనరులపై కన్నేసిన పాకిస్థాన్ 1948లో తమ ప్రాంతానికి చెందిన కలత్, ఖరన్, లాస్ బెల్, మక్రాన్, బలూచిస్థాన్ ఎజెన్సీ లాంటి పలు రాచరిక రాజ్యాలను తమలో విలీనం చేసుకున్నారని, తమ వనరులను వాడుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని విస్మరించిన పాక్ పాలకులకు ఎదురుగా బిఎల్‌ఏ లాంటి పలు విమోచన సంస్థలు అనాదిగా శాంతియుతంగా, సాయుధ దళాలుగా ఏర్పడి పోరాడుతూ వస్తున్నాయి. బలమైన పాకిస్థానీ మిలటరీ ముందు బిఎల్‌ఏ లాంటి సాయుధ సంస్థలు ఓడిపోతూ, తిరిగి పోరాడుతూ వస్తున్నారు. నాటి నుంచి నేటివరకు పాక్ ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని విస్మరించడంతో తమ ప్రాంత స్వాతంత్ర్య కోసం పోరాటాలు క్రమంగా తీవ్రరూపం దాల్చడం జరిగింది. దీనికి తోడుగా నేడు పాకిస్థానీ మిలటరీతో పాటు చైనా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్డు ఇనిషియేటివ్ ద్వారా చైనాపాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం కూడా బిఎల్‌ఏ పోరాటానికి అడ్డురావడం జరిగింది. ఈ పోరాటాలను అదుపు చేయడానికి పాకిస్థాన్ వాడని పద్ధతి లేదు, చేయని మానవ హక్కుల ఉల్లంఘన లేదు. ఈ పోరాటంలో బలూచిస్థానీ సాయుధ మహిళలు కూడా నడుం బిగించడం వారి అణచివేతను రుజువు చేస్తున్నది. 2024లో బలూచిస్థానీ విమోచన పోరాటంలో పాక్య మిలటరీ చేతుల్లో 383 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆపరేషన్ సింధూర్‌ను తట్టుకోలేకపోతున్న పాక్ భద్రతాదళాలు, మరో వైపు బిఎల్‌ఏ దెబ్బకు ముందునుయ్యి వెనుక గొయ్యి చందంగా నలిగిపోతున్నది, నష్టపోతున్నది. బలూచిస్థాన్ ప్రాంత సమగ్రాభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యం, తగు ఆర్థిక వనరుల కేటాయింపులు కావాలని కోరినప్పటికీ పాక్ పాలకులు పెడచెవిన పెట్టడం జరిగింది. తను తవ్వుకున్న గోతిలో తానే పడుతున్నట్లుగా నేడు పాకిస్థాన్ ఒక వైపు భారత దాడులను తట్టుకోలేక, మరో వైపు బిఎల్‌ఏ ఆక్రమణలను నిలువరించలేక, మరోవైపు ప్రజల వ్యతిరేకతను మూటకట్టుకుంటూ, మరోవైపు ఉగ్రమూర్ఖులను అదుపు చేయలేక చేతులెత్తేసిన కాల్పుల విరమణ అంటూభరతమాత కాళ్ల బేరానికి రావడం,మళ్లీకాల్పుల విరమణను ఉల్లంఘించి పాక్ దాడులు చేయడం, భారత్ సహనాన్ని పరీక్షిం చడం, ఎస్400తో పాటు బ్రహ్మోస్ ప్రతాపాలను రుచి చూడడం, ఓటమిని అంగీకరించకనే ఒప్పుకున్నట్లు అవుతున్నది. ●

## కేజీబీవీలో ఇంటర్ కాలేజీకి శంకుస్థాపన

**కొత్తపట్నం మే 14. ప్రభాతవార్త**



కస్తూరిబా బాలికల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ తరగతులకు ఒక కోటి 52 లక్షల రూపాయలతో భవనానికి శంకుస్థాపన చేశారు. బుధవారం మధ్యాహ్నం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కాలేజీ భవనానికి భూమి పూజ చేయడం జరిగింది. సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని పద్మావతి, కన్స్ట్రక్షన్ డిఇ జనార్దన్, కేజీబీవీ ఇన్చార్జి ప్రిన్సిపల్ అరుణ్ కుమారి, మాజీ ఎంపీపీ నరసమ్మ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ జంపాల రామచంద్ర గౌడ్, కాంట్రాక్టర్ కొమ్మినేని బాలచంద్, ఆలా శ్రీనివాస్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ పాలిసెట్‌లో చీమకుర్తి విద్యార్థికి 14వ ర్యాంకు

**చీమకుర్తి, మే 14, ప్రభాతవార్త**





ఏపీ పాలిసెట్ లో చీమకుర్తికి చెందిన చలువాది ఖదిరేష్ రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకును సాధించారు. మొత్తం 120 మార్కులకు గాను 120 120 మార్కులు పొంది ఈ ర్యాంకును పొందారు. చీమకుర్తికి చెందిన కడవ వెంకట ధన్విని రాష్ట్రస్థాయిలో 1420 ర్యాంకును సాధించారు. వీరిద్దరూ చీమకుర్తి ఎమ్మెస్సార్ కాలేజీ క్యాంపస్ నందు శ్రీ సూర్య పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందారు. ఆర్గనైజర్ ఎం బి ఋషి, ఎమ్మెస్సార్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వివి శివారెడ్డి, వెంకారెడ్డి, నాగార్జున రెడ్డి,గోపికృష్ణ రెడ్డిలు ఆ ఇద్దరినీ అభినందించారు.

## ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రదర్శన

**ఒంగోలు టౌన్, మే 14, ప్రభాతవార్త**



ఒంగోలు-ఎం.నిడమానూరు రూట్ ఆటో కార్మికులకు బస్టాండ్ వద్ద పర్మినెంట్ స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బస్టాండ్ నుండి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ సిఐను, మున్సిపల్ కమీషనర్‌ను కలసి వినతి పత్రాన్ని అందజశారు. రోడ్డు విస్తరణ, డివైడర్ ఏర్పాటు వల్ల ఆటో స్టాండ్ సాధ్యం కాదని చెప్పడం న్యాయం కాదని, ఆటో కార్మికుల జీవనోపాధి కాపాడేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, నగర కార్యదర్శి టి.మహేష్, ఆటో కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జాజుల వెంకటేశ్వర్లు,తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జిల్లాలో విద్యా వసతులు పెంచాలి

### - సిటిజన్ ఫోరమ్ వినతి

**ఒంగోలు టౌన్, మే 14, ప్రభాతవార్త**

జిల్లా పర్యటనకు రానున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జిల్లాలో విద్యా వసతుల పెంపుపై తగిన హామీ ఇవ్వాలని సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు కొల్లా మధు విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, ఐఐటి ఏర్పాటు జరిగినా వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడితే మంచిదన్నారు. జిల్లా ఏర్పడి 4 దశాబ్దాలు దాటినా ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు లేవని, మైనింగ్ యూనివర్శిటీ, వెటర్నరీ యూనివర్శిటీ, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కళాశాల, ఆడిటోరియం, సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటు దిశగా ప్రకటన చేస్తే జనం హర్షిస్తారన్నారు.

## సమ్మర్ క్యాంప్ విజయవంతం

**ఒంగోలు టౌన్, మే 14, ప్రభాతవార్త**



ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిజి భవన్ నందు సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ముగింపు సభలో క్యాంప్ కన్వీనర్ వినోద్ మాట్లాడుతూ పది రోజుల పాటు చిన్నారులకు బొమ్మలు గీయడం, క్రాఫ్టింగ్, ఫన్నీ ఇంగ్లీష్, గేమ్స్, సైన్స్ ప్రయోగాలు, కరాటే, మెమరీ టెక్నిక్, మ్యాజిక్ అంశాలలో నిపుణులచే శిక్షణ ఇప్పించామన్నారు. అనంతరం విశ్రాంత తహసిల్దార్ ఇస్మాయిల్, మాంటిసోరి ప్రకాష్ తమ ప్రసంగంలో విద్యార్థులు చదువులతో పాటు సామాజిక బాధ్యత కలిగి వుండాలని, ఆశావహ దృక్పథంతో లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సర్టిఫికేట్స్ ప్రదానం చేశారు.

## అపరిశుభ్ర రెస్టారెంట్లకు సీజ్ తప్పదు - జిల్లా ఎఫ్ఐ

**వేటపాలెం, మే 14, ప్రభాతవార్త**



మండలంలోని ఎన్‌హెచ్ 216 జంక్షన్ వద్ద గాయత్రి బిర్యానీ పాయింట్‌లో బుధవారం బాపట్ల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలి ఉండటం, ఆహార పదార్థాలు తయారు చేసే పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకపోవడం చూసి రెస్టారెంట్ యజమానులను పరిశుభ్రంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేసే హోటళ్లు రెస్టారెంట్లు బిర్యానీ పాయింట్‌లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేస్తామని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను నిల్వ చేసిన మాంసాన్ని ప్రజలకు అందిస్తే వీటి వల్ల వివిధ జబ్బులకు గురయ్యే అవకాశం ఉందని, ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడరాదన్నారు. ప్రతి దుకాణదారుడు ఖచ్చితంగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## కేక్ ప్రింటర్స్‌తో సెయింట్ ఆన్స్ అవగాహన ఒప్పందం

**చీరాల, మే 14, ప్రభాతవార్త**



సెయింట్‌ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల కేకే ప్రింటర్స్‌తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు మాట్లాడుతూ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ సంబంధించిన కన్సల్టెన్సీ సెల్ నుండి కేక్ ప్రింటర్స్‌కు సాఫ్ట్వేర్‌ను అభివృద్ధి చేసి సాఫ్ట్‌వేర్ సంబంధిత నిర్వహణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి మాట్లాడుతూ ఇప్పటికే కళాశాల నుండి సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్‌కి సంబంధించి పలువురితో అవగాహన ఒప్పందాలు జరిగాయని, ప్రస్తుతం మనుగడలో ఉన్న లేటెస్ట్ టెక్నాలజీతో సాఫ్ట్‌వేర్‌ను డవలప్ చేసి ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ కోఆర్డినేటర్ ఎస్.అమర్నాథ్‌బాబు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

### - ప్రకాశం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రమణ్యం

**సంతనూతలపాడు, మే14, ప్రభాతవార్త**




విద్యార్థుల్లో చిన్నతనం నుండే ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింపజేసినట్లయితే వారు ఉన్నతంగా అన్ని రంగాల్లో ఎదగగలరని ప్రకాశం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యం అన్నారు. సంతనూతలపాడులోని సుందరయ్య భవన్‌లో జేవీవీ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవం ఆరోరోజు బుధవారం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన చిట్టి చిట్టి సైన్స్ ప్రయోగాలను పిల్లల చేత చేయించడం జరిగింది. కాయిన్ మాయం చేయడం, బెలూన్ రాకెట్, గాలి తీయగానే లాగితే కదిలే థర్మకోల్ గొలుసు లాంటి 10 రకముల ప్రయోగాలను విద్యార్థులచేత చేయించారు. వేసవి వినోదం ద్వారా విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను వెలికి తీయవచ్చని వారి అభిరుచులను బట్టి అభివృద్ధి చెందుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి పాల్గొన్నారు.


# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


## క్విస్ ఫిజికల్ డైరెక్టర్‌కు పురస్కారం

**ఒంగోలు టౌన్, మే 14, ప్రభాతవార్త**



జెఎన్‌టియు కాకినాడ నిర్వహించిన స్పోర్ట్స్ డే వేడుకలలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావుకు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సన్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. కిక్ బాక్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బిటెక్ మూడవ సంవత్సరం విద్యార్థిని భార్గవికి రూ.20 వేలు నగదు బహుమానం అందజేశారు. అవార్డు అందుకున్న ఫిజికల్ డైరెక్టర్‌ను, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు అభినందించారు.

# వీరయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు సిద్ధాంతి

### - కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ ఏఆర్ దామోదర్







**నాగులుప్పలపాడు, మే 14, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన నిందితులు హత్యకు రూపకల్పన చేసిన వ్యక్తి అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన సిద్ధాంతి ఆళ్ల సాంబశివరావు అని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం సాయంత్రం పత్రికా విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వివరాలను వెల్లడించారు. అమ్మనబ్రోలు గ్రామంలో రాజకీయంగా వ్యాపారంగా ఆదిపత్య పోరు ముప్పవరపు వీరయ్య చౌదరితో ముప్పా సురేష్ మేనమామ సిద్ధాంతి కక్ష పెంచుకుని వ్యక్తిగతంగా పంచాయతీ ఎన్నికలతో పాటు రాజకీయ కార్యక్రమాల్లో ఒకరిపై ఒకరు ఆదిపత్యం కోసం పోటీ పడుతూ హత్య వరకు దారి తీసిన పరిణామాలను ఎస్పీ వివరించారు. సిద్ధాంతి సాంబశివరావు అల్లుడు సురేష్ ఎదుగుదలకు వీరయ్య చౌదరి ఆటంకంగా ఉన్నారని నిర్ణయించుకుని ఆయనకున్న పరిచయాలతో వినోద్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని ఆయనకు అధిక మొత్తంలో రూ.20లక్షలకు పైగా డబ్బులు చెల్లిస్తూ వీరయ్య చౌదరి అడ్డం తొలగించుకోవాలని ప్లాన్ చేసి అందులో నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తులు, ఒంగోలుకు చెందిన వ్యక్తులతో సంబంధాలు నడిపి హత్యకు పథకం పన్ని.. పథకం ప్రకారం ఏప్రిల్ నెల 22న రాత్రి 7గంటల 30 నిమిషాలకు సుమారు 52 కత్తిపోట్లతో హత్య చేయడం జరిగిందని ఎస్పీ దామోదర్ తెలిపారు.

**ముద్దాయిలుః**

బోర్లగడ్డ వినోద్ కుమార్, తొవ్వర వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకట గౌతమ్, మన్నే తేజ, మద్దూరి కిరణ్ కుమార్, షేక్ సమీర్, ఆళ్ల సాంబశివరావు, వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, తోట శ్రీనివాసరావు అనే తొమ్మిది మంది ముద్దాయిల పేర్లను జిల్లా ఎస్పీ తెలిపారు.

**పరారీలో ఉన్న ముద్దాయిలుః**

ముప్పా సురేష్, ఓబిలి నాగరాజు, గోలరితేంద్రబాబులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలియజేశారు.

**22 రోజుల్లో కేసును చేధించిన పోలీసులకు అభినందనలుః**

మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు జరిగి 22 రోజుల్లోనే ముద్దాయిలను అన్ని కోణాల్లో విచారించి అరెస్టు చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందనలు తెలిపారు. హత్యకేసును చేధించిన వారిలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావుతో పాటు ఒంగోలు, చీమకుర్తి ట్రాఫిక్ తదితర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంకా అనేక ప్రాంతాల నుండి టీములుగా ఏర్పడి ముద్దాయిలను గుర్తించడంలో సహాయపడిన ఎస్సైలు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జిల్లాకు రాక

### - భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**నాగులుప్పలపాడు, మే 14, ప్రభాతవార్త**



నేడు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరిని హత్య చేసిన ఘటనలో వారి కుటుంబాన్ని పరామర్శించడానికి రానున్న నేపథ్యంలో ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా అధికారులు పరిశీలించారు. అనంతరం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడలోని సాయి విష్ణు విల్లాస్ చతుర్వాటిక హెడిప్యాడ్ ప్రదేశం, కాన్వాయ్ రూట్, చుట్టు ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



హెలిప్యాడ్ నుంచి అమ్మనబ్రోలు వరకు ఉన్న రూట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రూట్ అండ్ రూఫ్- టాప్ ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు,బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు,ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఆర్ఐ రమణారెడ్డి, ఎన్‌జీ పాడు ఎస్సై శ్రీకాంత్, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



## బాధ్యతాయుతంగా పార్టీకి పనిచేయండి

### - ఇకపై టీడీపీకి పనిచేసిన వారికే గుర్తింపు: ఎమ్మెల్యే దామచర్ల

**కొత్తపట్నం,న ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీకి ఎంతో బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. కొత్తపట్నం నల్లూరి గార్డెన్స్ నందు మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జనార్ధన్ మాట్లాడుతూ పార్టీకి పనిచేయని పదవులకు దూరంగా పెడతామని తెలిపారు. పార్టీకి కష్టపడిన కార్యకర్తలకే తగిన గుర్తింపుని ఇస్తామన్నారు. టిడిపిలో గ్రూపు రాజకీయాలకు తావు లేదని మనమంతా టిడిపి కుటుంబ సభ్యులమేనని పేర్కొన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న విభేదాలు ఉంటే కుటుంబ సభ్యుల్లా కలిసికట్టుగా కూర్చొని సమస్యను పరిష్కరించుకుందామని తెలిపారు. గత ఎన్నికల్లో టిడిపికి వచ్చిన మెజార్టీపై పంచాయతీల వారీగా పోలింగ్ బూత్ లో వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి చేసిన పనులను నాయకులు మరియు కార్యకర్తలకు వివరించారు. తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అల్లూరు గ్రామంలో పార్టీకి వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్న మెట్నసల ప్రసన్న కుమార్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీకి నష్టం కలిగిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో పార్టీకి పనిచేసిన వారికీ పదవల్లో గుర్తింపును ఇస్తామని తెలిపారు. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో 15 పంచాయతీలకు నూతన గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగినది. మండల పార్టీ అధ్యక్షులు గా ద్వారాబాకుల శ్రీనివాసులరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులుగా పిన్ని దేవప్రసాద్, 13 అనుబంధ సంఘాల అధ్యక్షులును ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో పీడీసీసీ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చీరాల మున్సిపాలిటీ పీఠం టీడీపీ కేవసం





**చీరాల, మే 14, ప్రభాతవార్త**

చీరాల మున్సిపాలిటీ పీఠాన్ని టీడీపీ కేవసం చేసుకుంది. చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి. చైర్మన్ వైస్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణంకు మద్దతుగా 27 మందికౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలిపారు. ఇప్పటికే వైసీపీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసీపీని వీడిటీడీపీ గూటికి చేరారు. అయినప్పటికి చైర్మన్ శ్రీనివాసరావు పై గతంలో వైసీపీలో ఉండగా జిల్లా కలెక్టర్‌కు టీడీపీ మద్దతు కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసు ప్రకారం నేడు అవిశ్వాస తీర్మాణం నిర్వహించారు. శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మణంలో 27 మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలపడంతో అవిశ్వాసం ముగిసింది. మరో పక్క వైసీపీ వైస్ చైర్మన్ జైసన్‌బాబుకు వ్యతిరేకంగా 27 మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతె తెలిపారు. మరో నాలుగు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ఉంటుందని అధికారులు తెలిపారు. దీంతో చీరాలలో టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు టపాసులు పేల్చి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

**చీరాల మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసంః**

మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు వైస్ చైర్మన్ జైసన్‌బాబులపై టీడీపీకి చెందిన 22 మంది వార్డు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం తీర్మాణం నెగ్గింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్లో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు ఎన్నికల అధికారిగా కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలో 33 కౌన్సిలర్లు ఉండగా చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి చైర్మన్ మినహా 25 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మాణానికి అనుకూలంగా మద్దతు తెలిపారు. చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి 26 మంది కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి కౌన్సిలర్లు 27 మంది మద్దతు తెలిపారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే సమయంలో ఒకటో వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక సమావేశానికి రాలేకపోయారు. వైస్ చైర్మన్ బాబుపై అవిశ్వాసం తీర్మాణం పెట్టే సమయంలో దీపిక సమావేశానికి హాజరయ్యారు. 10.30గంటలకు ప్రారంభమైన అవిశ్వాస తీర్మాణం మధ్యాహ్నం 1గంట వరకు జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బాపట్ల ఎంపీ ఆర్డీఓలు మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్యాలయాన్ని వారి అడ్డాగా మార్చుకుని అభివృద్ధికి ఆటకంగా మారారని వారు అన్నారు. ఈ రోజు అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టింది చీరాల నియోజకవర్గం అభివృద్ధి కోసం మాత్రమేనని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆమంచి మద్దతుతో నెగ్గిన అవిశ్వాసంః**

మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు టీడీపీ కౌన్సిలర్లు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ ఆమంచి కృష్ణమోహన్ మద్దతుతో అవిశ్వాసం ప్రతిపాదించారు. కౌన్సిలర్ల ప్రతిపాదన మేరకు కలెక్టర్, ఎన్నికల కమీషన్ బుధవారం అవిశ్వాస సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి 26 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫిసియో సభ్యులైన శాసనసభ్యులు ఎంఎం కొండయ్య, ఎంపీ కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. హాజరైన కౌన్సిలర్లు అందరూ అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు ఎత్తడంతో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై ప్రతిపాదించిన అవిశ్వాసం నెగ్గింది. టీడీపీ కౌన్సిలర్లు 14 మందితో పాటు ఆమంచి కృష్ణమోహన్ వద్ద ఉన్న ఐదుగురు కౌన్సిలర్లకు తోడు వైసీపీకి చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు ఆమంచి కృష్ణమోహన్‌కు మద్దతుగా అవిశ్వాస సమావేశానికి హాజరయ్యారు. ఒకటో వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక, రెండో వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు టీడీపీకి మద్దతుగా హాజయ్యారు. వైసీపీ కౌన్సిలర్లు ఏడుగురు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడంతో సంతోషం వ్యక్తం చేశారు.

# 16న ఎస్‌ఎల్ గుడిపాడులో గ్రామసభ



**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**
మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో ఈనెల 16వ తేదీన గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎం.రవి నాయక్ తెలియజేశారు. గ్రామ పరిధిలో సోలార్ పవర్ ప్రాజెక్టు మంజూరైనందున గ్రామస్తుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. చీరాల ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు ఈ గ్రామ సభకు హాజరు కానున్నారని, గ్రామస్తులు విధిగా గ్రామసభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# రేవంత్‌కుమార్‌కి మాజీ మంత్రి సురేష్ నివాళులు



**పొన్నలూరు, మే 14, ప్రభాతవార్త**
స్థానిక బాప్టిస్టు నగర్‌కు చెందిన గంధం సింగయ్య కుమారుడు గంధం రేవంత్ కుమార్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కింద పడిపోయి తీవ్ర గాయాలతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం రేవంత్ కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రేవంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యచరణ కార్యదర్శి కాటా మాధవరావు, బోడా మల్లిఖార్జునరావు, జ్యేష్ట వేణు, బాలు ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# దశదిన కర్మకు హాజరైన మాజీ మంత్రి సురేష్



**పొన్నలూరు, మే 14, ప్రభాతవార్త**
మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపాటి నరసింగరావు భార్య రాయపాటికుమారి దశదిన కర్మకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం హాజయ్యారు. ఈ సంద్భంగా కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యచరణ కార్యదర్శి కాటా మాధవరావు, మాజీ ఎంపీటీసీ వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, వెన్నపూస మాల్యాద్రిరెడ్డి, తన్నీరు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు నిఘానేత్రంలో మార్కాపురం

**- శివారు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు**




**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**
నేర నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ పి.సుబ్బారావు నేతృత్వంలో పట్టణంతో పాటు శివారు ప్రాంత కాలనీలలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, అల్లూరి పోలేరమ్మ గుడి వెనుకాల గల కాలనీలలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలకు గంజాయి విక్రయాలు కొనుగోళ్లకు, అపరిచిత వ్యక్తులకు షెల్టర్ల కల్పించే విషయంలో శివారు ప్రాంత కాలనీలో అడ్డాగా మారడంతో పోలీసులు ఆ దిశగా దృష్టి సారించి నిరంతరం తనిఖీ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బుధవారం నిర్వహించిన తనిఖీలలో సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా సీఐ పి.సుబ్బారావు మాట్లాడుతూ నేరాల అదుపు విషయంలో పోలీసు శాఖ చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, ఏ ఒక్క వ్యక్తి తప్పు చేసిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, మోసపూరిత మాటలకు తలొగ్గి నేరాలకు పాల్పడ్డవద్దని హెచ్చరించారు.సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఎతుకు పై ఎత్తు వేస్తూ ఎదుటివారిని మసం చేస్తూ ఆర్థిక లబ్ది పొందే వారి సంఖ్య పెరిగిందని, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. నిషేధిత మత్తు పదార్థాల విక్రయించొద్దని, ఎక్కడైనా జూదం నిర్వహణ జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, రూరల్ ఎస్సై అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్టీసీ, రవాణా శాఖ అధికారుల తనిఖీలు :**




నిబంధనలకు వ్యతిరేకంగా పరిమితికి మించి వాహనాలు నడుపుతున్న వారిపై ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు బుధవారం కొరడా ఝులిపించారు. అధిక లోడుతో వెళ్ళన్న వాహనాలను పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్ళన్న ఆటోలను, హెల్మెట్ లేకుండా అతి వేగంతో త్రిబుల్ రైడింగ్ వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను అధికారులు అడ్డుకొని వారికి అవగాహన కల్పించి పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాధవరావు, డీఎం నరసింహులు మాట్లాడుతూ నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలని సూచించారు. ప్రతి వాహన చోదకుడు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు లైసెన్సులు కలిగి ఉండాలని అన్నారు. లైసెన్సు వాహన పత్రాలు లేని వాహనాలు ప్రమాదాలకు గురైతే ఎలాంటి భీమా వర్తించదని తప్పనిసరిగా భీమా కలిగి ఉండాలని అవగాహన కల్పించారు.

# రేషన్ కార్డు అర్జీ దారులకు తప్పని అవస్థలు

**- మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో అయోమయ పరిస్థితిలో కొత్త దంపతులు**

**- సిబ్బంది కొరతతో పాటు సర్వర్ సతాయిస్తుండటంతో సచివాలయ సిబ్బందికి తప్పని పాట్లు**



**వెలిగండ్ల, మే 14, ప్రభాతవార్త**
గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో చోటు చేసుకున్న అవకతవకలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పలు అధ్యయ నాల అనంతరం 1 సంవత్సర కాలం తరువాత కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు రేషన్ కార్డులలో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించడంతో కొత్త రేషన్ కార్డులతో పాటు మార్పులు చేర్పుల కోసం ఎదురు చూస్తున్న వారు రేషన్ కార్డులకు అప్లై చేసుకొనే క్రమంలో పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న జంటలు కొత్త రేషన్ కార్డుకు అప్లై చేసుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో కొత్తగా పెళ్ళైనవారు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం అనేక అవస్థలు పడుతున్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ క్రమంలో వయస్సు ధృవీకరణ కొరకు భార్య, భర్త ఇరువురికి 10వ తరగతి సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో 10వ తరగతి చదివిన వారికి కొంత వెసులు బాటు ఉన్నప్పటికి చదువుకోని వారి పరిస్థితి అయోమయంగా మారింది. చదువుకోని వారు ఎలా రేషన్ కార్డు పొందాలి అనే విషయంపై సంబంధిత శాఖ నుండి ఎటువంటి మార్గ దర్శకాలు లేకపోవడంతో చదువుకోని దంపతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. రేషన్ కార్డులకు అప్లై చేసుకునే క్రమంలో సిబ్బంది కొరత సమస్యతో పాటు సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో లబ్ధిదారులు మరింత ఇబ్బందులకు గురవడంతో పాటు సచివాలయ సిబ్బంది సైతం ఒత్తిడికి లోనవుతున్నారు. సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను అధ్యయనం చేసి సమస్యలకు తగు పరిష్కారం కొరకు ప్రయత్నం చేయాలని రేషన్ కార్డుల అర్జీ దారులు వేడుకుంటున్నారు.

# ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎంపీడీఓ



**వెలిగండ్ల, మే 14, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని తాడివారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా ఉపాధి హామీ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదని మస్టర్ల నిర్వహణలో ఎటువంటి అవినీతి జరగకూడదని, ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పనికిరాని వారికి హాజరు వేస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి



**వెలిగండ్ల, మే 14, ప్రభాతవార్త**
మండలంలోని రేషన్ కార్డులు లేని వారు రేషన్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా తెలిపారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల సచివాలయంలో నూతన రేషన్ కార్డులు రేషన్ కార్డులో మార్పులు చేర్పుల కోసం వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల కోసం వచ్చే అర్జీలను సచివాలయ సిబ్బంది పారదర్శకంగా ఎటువంటి పొరపాటు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో నూతన రేషన్ కార్డులు, రేషన్ కార్డులో మార్పులు చేర్పులు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి లబ్దిదారుడు వినియోగించుకోవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# వృద్ధురాలి కంట్లో కారం చల్లి బంగారు నగల దోపిడి







**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**
ఇంట్లో ఇంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి కంట్లో కారం చల్లి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు,చేతులకు ఉన్ననాలుగు బంగారు గాజులను అపహరించిన సంఘటన మార్కాపురం పట్టణంలో మంగళవారం రాత్రిజరిగింది. మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల అన్న క్యాంటీన్ వెనుక బజారులో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇరుగుపొరుగు రక్త సంబంధీకులు ఉన్నప్పటికి గుట్టు చప్పుడు కాకుండా ఈ దొంగతనం జరగడం, ఇంట్లో బీరువాలో ఉన్న ఇతర బంగారం జోలికి వెళ్లకుండా కేవలం వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం చోరీ చేయడం పట్ల ఇరుగుపొరుగు వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అపహరణ సంఘటన ఇంటి దొంగ పని అయి ఉంటుందని భావిస్తున్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ

**- ప్రారంభించిన తహాశీల్దార్ ఆదిలక్ష్మీ**



**సంతనూతలపాడు, మే 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్ వద్ద దాత వాసవి క్లబ్ ప్రతినిధి గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద బుధవారం నాడు దాతలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సంతనూతలపాడు తహాశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ ప్రారంభించారు. సంతనూతలపాడు వాసవి క్లబ్ సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, లక్ష్మీల వివాహ వార్షికోత్స వ వేడుకల్లో భాగంగా వారి కుమారులు ప్రసన్న రాకేష్, మణిదీప్‌లు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారం వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్‌లు ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను వాసవిక్లబ్, మహిళా క్లబ్ ప్రతినిధులను తహాశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం తహాశీల్దార్ ఆదిలక్ష్మీని వాసవి క్లబ్ సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, లక్ష్మీ దంపతులు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంవీ రమణ, వీఆర్వోలు వెంకట స్వామి, జాలయ్య, సంజీవరావు, రెవెన్యూ కార్యాలయ ప్రతినిధులు సుధీర్, నాగేశ్వరరావు, అనిల్, అలీ ఖాన్, మార్కెట్ కమిటీమాజీ డైరక్టర్ జి.శరత్‌బాబు, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శ్రీను, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు జీఎల్ జీఎల్ ప్రసాద్‌రావు, వీఎన్ ప్రసాదరావులు, మహిళా క్లబ్ ప్రతినిధులు ఎస్.విజయలక్ష్మీ, జి.సులోచన, ఎన్.సుకన్య రాణి, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, వాసవి క్లబ్, ఆర్యవైశ్య గ్రామ నాయకులు పి.సుబ్రహ్మణ్యం, వేమా సుబ్బారావు, పి.గురుమూర్తి, సీహెచ్ బ్రహ్మయ్య, జి.శివ, ముద్రగడ శివ, తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో 51వ వారం పేద వర్గాలకు అన్నదాన వేడుకలు



**సంతనూతలపాడు, మే 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో బుధవారం సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 51వ వారం పేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహించారు. ట్రస్టు సభ్యులు దాత దాచర్ల శివయ్య కుమారుడు డాక్టర్ మంజునాథ్ చౌదరి జన్మదినోత్స వంలో భాగంగా ఈ అన్నదాన వేడుకలను నిర్వహించారు. సంతనూతలపాడు కేంద్రానికి చెందిన యాదాల ఇందిరా దేవి జన్మదిన వేడుకలలో భాగంగా పేద వర్గాలకు ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దేశ విదేశాల నుండి దాతల సహకారంతో గత 51 వారాల నుండి ఒక పక్క సేవలు, మరొక పక్క అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. 51 వారాలు పాటు ట్రస్టు ఆధ్వర్యంలో వందలాది మందిపేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహించడం పట్ల పలువురు ట్రస్టు ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్టు సెక్రటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ కే.వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు బొడ్డు శంకర్‌బాబు, దాచర్ల విశ్వనాథం, ఎం.పోలిశెట్టి, కే.ఆంజనేయులు, వేమా సుబ్బారావు, పాదర్తి సతీస్, ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, వేమా కవిత, బి.సుధారాణి, ఎం.రామాంజనేయులు, ఆర్.జార్జి తదితరులు పాల్గొన్నారు.

# ముఖమండపానికి కరి వారి విరాళం



**అద్దంకి ,మే 14, ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ముఖ మండపానికి కీ.శే. కరి ఆంజనేయులు జ్ఞాపార్థం కరిచిరంజీవి ధర్మపత్ని శివలక్ష్మి కుమారుడు భువనేశ్వర్‌లు రు.1,01,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు అందజేశారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి శాంతి కళ్యాణం

**- విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు**





**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**
మండలంలోని కొనిదేన గ్రామంలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్రస్వామి శాంతి కళ్యాణ మహోత్స వం బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఈ ఆలయ ప్రాంగణంలో నాగమయ్య, నాగమ్మల విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా కొనసాగింది. వేద పూజారులు శ్రీనివాసా చారి,నాగబ్రహ్మాచారిల ఆధ్వర్యంలో ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాలు కొనసాగాయి.

## ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**- సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్**




**యర్రగొండపాలెం,మే14,ప్రభాతవార్త**
ఈ నెల 20వ తేదిన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.బుధవారం యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని సిపిఐ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక,రైతాంగం యొక్క వ్యతిరేక విదానాలను అవలంబించి,మూడవ సారి అధికారంలోకి వచ్చి నరేంద్రమోడి బరి తెగించాడని ఆయన అన్నారు.ఎన్నోసంవత్స రాల నుంచి సాధించుకున్న కార్మిక 44లేబర్ కోడ్‌లను,నాలుగు కోడ్‌లుగా కుదించారని ఆయన మండిపడ్డారు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి వచ్చే ఆదాయము కార్మికులకు ఆందడం లేదన్నారు.దేశవ్యాప్తంగా ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామిలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ20వేలు వెంటనే రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు.పొగాకు రైతులనున,కౌలు రైతులను ప్రబుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు.ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసి కూలీలకు రోజుకు రూ600వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టీసిహెచ్ చెన్నయ్య,రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షకార్యదర్శులు మన్నే సాంబశివరావు,బాణాల రామయ్య,మొగిలి వెంకటేశ్వర్లు,నక్కా తిరుపతయ్య,తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**- జాయింట్ డైరెక్టర్ శ్రీమతి జయలక్ష్మి**



**యర్రగొండపాలెం,మే14,ప్రభాతవార్త**
ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిషోర వికాసం వేసవి శిక్షణాతరగతుల వలన బాలికల భవిష్యత్తుకు పునాది వేస్తుందని జాయిండ్ డైరెక్టర్ శ్రీమతి జయలక్ష్మి అన్నారు.నల్లమల గిరిజన గూడెంలోని పాలుట్ల,నెక్కంటి లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఒంగోలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి జయలక్ష్మి అకస్మికంగా తనికి నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో చిన్నారులకు ఆటపాటలతో పాటు విద్యను కూడ నెర్పించాలని అమె అన్నారు.ప్రతి ఒక్కరు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చెర్పించి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని అన్నారు.గర్భవతులకు బాలింతలకు పౌష్టిహారం తప్పనిసరిగా అందజేయాలని అమె కోరారు.సిడిపివో మాట్లాడుతూ అన్ని గ్రామల్లో కిశోర వికాసం ప్రారంభం కావడం బాలికలకు ఆదృష్టం అన్నారు,శిక్షణా తరగతుల ద్వారా బాలికల నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు దోహదపడతాయి అన్నారు.అదే విధంగా బాలికల యుక్త వయస్సులో ఎలాంటి జాగ్రత్తలుతీసుకోవాలో తెలియజేశారు.రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. తద్వార ఆనారోగ్య సమస్యలు దరిచేరమన్నారు.అలాగే లైగింక విద్య పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీ కార్యకర్తలు,గిరిజనమహిళలు పాల్గొన్నారు.

# ముఖమండపానికి అవిశన వారి విరాళం



**అద్దంకి , మే 14, ప్రభాతవార్త**
ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపానికి బల్లికురవ మండల వాస్తవ్యులు అవిశన మారుతీ రెడ్డి ధర్మపత్ని సుభాషిణిగార్ల వారి కుమారుడు సమీర్ రెడ్డిలు రు.1,01,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు అందజేశారు.

# ముఖమండపానికి చిన్ని వారి విరాళం



**అద్దంకి ,మే 14, ప్రభాతవార్త**
ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపానికి అద్దంకి వాస్తవ్యులు సింగరకొండ దేవస్థాన మాజీ చైర్మన్ చిన్ని శ్రీమన్నారాయణ, ధర్మపత్ని సీతాదేవిలు రు.1,01,116లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు అందజేశారు.ఈ కార్యక్రమం లో చిన్ని శ్రీమన్నారాయణ దంపతుల వారి కుమారుడు శాంతివర్ధన్, ధర్మపత్ని పావని, మనుమరాలు మిధున తోపాటు చుండూరి మురళీసుధాకరరావు, సందిరెడ్డి, గూడశ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

## శ్రీప్రసన్నాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 14 లక్షలు



**అద్దంకి , మే 14, ప్రభాతవార్త**
ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన హుండీని బుధవారం ఎసి తిమ్మానాయుడు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. మొత్తం రు.14,28,554లు ఆదాయం వచ్చింది. మార్చి 16వ తేది నుండి ఈ ఆదాయం లభించినట్లు ఆలయ ఎసి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల గ్రూపు టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలి

**అద్దంకి , మే 14, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ మండల స్థాయిలో త్వరలో జరగనున్న భారత కమ్యూనిష్టు పార్టీ సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు కెఎల్‌డి ప్రసాద్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సంతమాగులూరు మండల కార్యదర్శి కాలేషా, ఖాదర్‌బాషా, అధ్యక్షతన నియోజకవర్గ సిపిఐ విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం జరిగే సమ్మెలో కార్మిక సోదరులు భాగస్వాములు కావాలన్నారు. ముందుగా ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందిన బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జెబి శ్రీధర్, సి.పిఐ ఏల్చూరు శాఖ కార్యదర్శి రాఘవులు సభ్యులు షేక్ మొహిద్దీన్, నక్క ఏసోబు, రైతు సంఘం కుందుర్రుశాఖ కార్యదర్శి రాహంతుల్లాలకు సిపిఐ నాయకులు జోహార్లు ఆరి ్పంచారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## అత్యంతవైభవోపేతంగా కుంభాభిషేక పూజలు ప్రారంభం




**అద్దంకి , మే 14,ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ముఖ మండప ప్రారంభాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న మహా కుంభాభిషేకంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు ప్రారంభమైయ్యాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం. తిమ్మానాయుడు దంపతులుతోపాటు ముఖమండపానికి విరాళాలిచ్చిన ముఖ్య ముఖ్య దాతల దంపతులు కూడ ఈ పూజలలో పాల్గొన్నారు. ప్రారంభ పూజలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి పూజతో మొదటిరోజు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యాగశాలలో క్షేత్రపాలక మండపారాధన, యోగిని, నవగ్రహ మండపారాధన, పర్వతో భద్రమండల ఆరాధన, సహస్ర మోదక గణపతి పాదానము అంకుర్పాణ అగ్ని, మదన కుండసంస్కారం, ఆపారణ దేవతా హావనములు, బలిహరణ, చేత్వురేదసృష్టి, నిరాజన, మంత్రపుష్పములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసి తిమ్మానాయుడు దంపతులతోపాటు ప్రధానదాతలైన కోట శ్రీనివాసకుమార్ ధర్మపత్ని నాగలక్ష్మి, నలమలపు విజయభాస్కర్ రెడ్డి ధర్మపత్ని శ్రీదేవి, గుంజి కృష్ణారావు ధర్మపత్ని రమాదేవి, శ్రీరంగం మిల్క్ ప్రొడెక్ట్స్, ప్రైవేట్ లిమిటెడ్ , కాట్రగడ్డ అనిల్ కుమార్ ధర్మపత్ని శ్రీవిద్య, మేదరమెట్ల శంకరారెడ్డిలు పూజలలో పాల్గొన్నారు.

## రోడ్ల ప్రక్క వ్యర్థాలు వేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

**- ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి**




**రాచర్ల, మే 14, ప్రభాతవార్త**
రోడ్ల ప్రక్క వ్యర్థాలు వేసి ఆ వ్యర్థాల ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితి కలిగించవద్దని మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి పారిశుధ్య కార్మికులకు, పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. అనుములవీడు రాచర్ల రోడ్డు మార్గంలో నిత్యం ప్రజలు వందల సంఖ్యలో తిరుగుతుంటారని ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ల ప్రక్క వ్యర్థాలు వేస్తే ఆ వ్యర్థాలు గాలికి లేచి రోడ్ల పైకి రావడం, రోడ్లపై వాహనాల మీద వెళుతున్న వ్యక్తులకు ముఖాలపై పడడం, అంతేకాకుండా పందులు, కుక్కలు ఆ ప్రదేశాల్లో ఆవాసం చేస్తూ ఆ వ్యర్థాలను కలియతిప్పుతూ రోడ్లపైకి తీసుకురావడం వలన దుర్గంధంతో కూడిన దుర్వాసన వెదజల్లడం జరుగుతుందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సోషల్ మీడియా మాధ్యమాల్లో ఈ వార్త ప్రచురితం కావడంతో ఆయన వెంటనే స్పందించి తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన వ్యర్థాలు ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి ఆ వ్యర్థాలు తొలగింపుకు తక్షణ చర్యలు చేపట్టారు. ఇక్కడ ఉన్న వ్యర్థాలు అన్నింటిని ఊరి బయట జనసంచారం లేని ప్రదేశాల్లో పడవేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా జన సంచారం ఉండే ప్రదేశంలో వేయవద్దని పారిశుధ్య సిబ్బందికి తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పారిశుధ్య కార్మికులకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ గ్రామంలో సేకరించిన చెత్త చెదారం మరియు వ్యర్థాలు అన్నింటిని తమ వాహనాల్లో నిపుకొని గ్రామ చివరలో జనసంచారం లేని ప్రదేశాల్లో వేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఐ వెంకటేష్, రాచర్ల పంచాయితీ కార్యదర్శి ఎం వెంకటేశ్వర నాయక్, గౌతవరం, అనుములపల్లి పంచాయితీ కార్యదర్శులు వి అనీల్ కుమార్, ఏవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయాలను బాధ్యతగా నిర్వహించండి

**- గ్రంధాలయ శాఖ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మీ**



**రాచర్ల, మే 14,ప్రభాతవార్త**
గ్రంధాలయాలను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా గ్రంధాలయశాఖ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ అన్నారు. రాచర్ల గ్రంధాలయ శాఖను బుధవారం ఆమె తనిఖీ చేశారు. గ్రంధాలయంలో రికార్డులు తనిఖీ చేసి అక్కడ ఉన్న పుస్తకాలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, గ్రంథపాలకుడు శ్రీధర్ రెడ్డికి సూచించారు. గ్రంధాలయ గదితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఆమె మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి విస్తరణ అధికారి ఐ వెంకటేష్‌తో కలిసి అన్ని పంచాయితీల్లో గ్రంధాలయానికి కట్టవలసిన గ్రంధాలయ సెస్ కట్టించే విధంగా చూడాలని కోరారు. లైబ్రరీ స్థలాన్ని పరిశీలించి బిల్డింగ్ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు.

### మాజీ ఎంపిటిసి పుల్లయ్య మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా



**రాచర్ల, మే 14,ప్రభాతవార్త**
మండలంలోని అనుములపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ మాజీ ఎంపిటిసి సభ్యులు యేలెం పుల్లయ్య (91) మృతదేహానికి గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపి ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు ఘన నివాళులర్పించారు. పుల్లయ్య అనారోగ్యానికి గురై బుధవారం ఉదయం అనుములపల్లి గ్రామంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు అనుములపల్లి గ్రామానికి చేరుకొని పుల్లయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల వైసిపి అధ్యక్షులు యేలెం మురళీకృష్ణ, స్థానిక వైసిపి సభ్యులు కూడా రాంబాబుతో కలిసి పుల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

## కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం



**దొనకొండ,మే 14,ప్రభాతవార్త**
Ongole BC corporation ద్వారా ప్రభుత్వము వారు దొనకొండ మండలంనకు మంజూరు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రములో 98 మంది మహిళలు శిక్షణ పొందుచున్నారు. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం దొనకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విజయ వంతంగా నిర్వహించడం జరుగుతుంది



## నిర్మాణం పూర్తి చేశారు... ప్రారంభించడం మర్చిపోయారు.. !




**రాచర్ల, మే 14, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రాచర్లలో రూ.40లక్షల వ్యయంతో నూతన సచివాలయ భవనం నిర్మించారు... నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడం మాత్రం మరచిపోయారు. అందుకు కారణమేమై ఉంటుందో అధికారులకే తెలియాలి. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామ సచివాలయాల ద్వారా సత్వర సేవలందించాలని గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దాదాపు సచివాలయ భవనాలు లేని పంచాయితీల్లో నూతన భవనాలు నిర్మించుకునేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి సచివాలయాల నిర్మాణాలు చేపట్టింది. కొన్ని పంచాయితీల్లో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసి వాటిని ప్రారంభించి కార్యకలాపాలు కూడా సాగిస్తున్నారు. మరికొన్ని పంచాయితీల్లో భవన నిర్మానాలు పూర్తయినా అవి ప్రారంభానికి నేటి వరకు నోచుకోలేదు. రాచర్ల పంచాయితీలో పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.40లక్షల నిధులు మంజూరు చేసి నూతన సచివాలయ భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయి ప్రారంభానికి ఆ భవనం సిద్ధంగా కూడా ఉంది. కానీ ప్రారంభించకపోవడానికి గల కారణాలు ఏమిటో అర్థం కావడం లేదు. పాత భవనంలో సరైన వసతులు లేక సిబ్బంది నానా రకాలుగా అవస్థలు పడుతూ విధులు నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు చూస్తున్నారే తప్పా ఇబ్బందులను గమనించి లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నూతన భవనాన్ని మాత్రం ఉపయోగించుకోవాలనే ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనాలను ప్రారంభించి సిబ్బందికి మౌలిక వసతులు కల్పించడంతోపాటు సిబ్బంది ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## అర్హులుకు కొత్త రేషన్ కార్డులు తప్పకుండా అందించాలి

**- తహశీల్దార్ వెంకటేశ్వర్లు**



**రాచర్ల, మే 14 ,ప్రభాతవార్త**
మండలంలో రేషన్ కార్డులు లేని అర్హులకు తప్పకుండా రేషన్ కార్డులు అందించే విధంగా రెవెన్యూ సిబ్బంది కృషిచేయాలని మండల తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహజంచి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు లేని నిరుపేదలకు ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ప్రత్యేక కార్యచరణ చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రెవెన్యూ సిబ్బంది కృషిచేయాలన్నారు. రేషన్‌కార్డు మంజూరు విజయవంతం చేసేందుకు రెవెన్యూ సిబ్బంది కృషిచేయాలన్నారు. రేషన్‌కార్డు మంజూరు, చేర్పులు, మార్పులు తొలగింపులు, విభజనలు వీటన్నింటినీ పకడ్బంధీగా నిర్వహించాలని ఎలాంటి అవినీతి అక్రమాలు జరుగకుండా చూసుకోవాలని అన్నారు. అదేవిధంగా రైతులకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని బాధ్యతగా సమస్యలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని అన్నారు. గ్రీవెన్స్ ద్వారా వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని చేయగలిగిన పనులు తక్షణమే చేయాలని, చేయలేనివి ఉంటే వాటిని పలానా కారణం ద్వారా చేయలేము అని అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అందుకు సంబంధిత సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశిల్దార్ జి భారతీభాయి, మండల సర్వేయర్ ఏ శ్రీనివాసరావు, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు టి ప్రభాకర్, జి అమృత, వర్షిణి, కె వినోద్ కుమార్, టైపిస్టులు దిలీప్ కుమార్, నాగార్జున, జాషువా ఇమ్మానుయేల్, విఆర్వోలు ఏ మాచర్ల, కె లక్ష్మీ, ఆర్ శివపార్వతి, ఎస్ రంగయ్యా, బి కిశోర్ కుమార్, పి రంగయ్య నాయుడు, ఏ శివారెడ్డి, డి.యోనా వీర గరుడు, శివయ్య, డానియేల్, ఈర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి



**తాళ్లూరు, మే 14, ప్రభాతవార్త**
ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని మండల విద్యాశాఖాధికారి గురిజాల సుబ్బయ్య అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో బుధవారం ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో సీఎస్సీ వెబ్ సైట్‌లో ఫామ్-1 ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి సమాచారాన్ని అందించాలని చెప్పారు. మండలంలో 15 ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రాథమిక, హైస్కూల్స్ ఉన్నాయని, ఇప్పటికే కేవలం మూడు మాత్రమే పూర్తి చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఏ-2 మార్కులను నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ పాఠశాలలు నడిపించాలని కోరారు. సీఆర్‌పీ శ్రీనివాస్, ఎంఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం, లారీ ఢీకొని యువకుడు మృతి




**గిద్దలూరు, మే 14, ప్రభాతవార్త**
ద్విచక్రవాహనం, లారీ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని దంతెరపల్లి గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పుల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తూ దంతెరపల్లె గ్రామ సమీపం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో గంగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## రాచర్లకు చేరిన మనోహర్ మృతదేహం



**రాచర్ల, మే 14 ,ప్రభాతవార్త**
మహారాష్ట్రలోని ముంబై ఆర్మీ క్యాంపస్‌లో మంగళవారం గుండెపోటుతో మృతిచెందిన గంజికుంట్ల మనోహర్ మృతదేహం బుధవారం సాయంత్రానికి రాచర్ల గ్రామానికి చేరుకుంది. మిలటరీ అధికారులు సుబేదార్ బింబి హవల్దార్ రాధాకృష్ణ నాయక్, నాగసాయిబాబుల బృందం మనోహర్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ముంబై నుండి రాచర్లకు తీసుకురావడం జరిగింది. మనోహర్ అంత్యక్రియలు గురువారం ఉదయం జరుగుతాయని కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు తెలిపారు. గ్రామానికి చేరిన మృదేహాన్ని గ్రామ ప్రజలు, సైనికులు, మాజీ సైనికులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రాతిముఖ మండపానికి రాయపాటి వారి విరాళం



**అద్దంకి ,మే 14,ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ముఖమండపానికి అద్దంకి వాస్తవ్యులు రాయపాటి హరిప్రసాద్ ధర్మపత్ని అనుమతిలు రు.1,11,116 లు ఆలయ ఎసి తిమ్మానాయుడుకు అందజేశారు.

## స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మేరుగ నాగార్జున



**మద్దిపాడు, మే 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జీ, మాజీ మంత్రి మేరుగనాగార్జున బుధవారం మల్లవరం వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మీ, ఇనమనమెల్లూరు ఎంపీటీసీ సభ్యులు వాకా కోటిరెడ్డి, గడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు పైడిపాటి వెంకటరావు, పల్లకి సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మల్లవరం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ నారా నాగిరెడ్డి, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ శ్రీరామ్‌మూర్తి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**సింగరాయకొండ, మే 14,ప్రభాతవార్త**
ప్రతిఇల్లు, దుకాణాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిఐ.హాజరత్తయ్యా పిలుపునిచ్చారు. బుధవారం సీఐ కార్యాలయం లో మీ రక్షణ మా బాధ్యత సీసీ కెమెరాలు పెట్టండి అనే కర పత్రాలు, స్టిక్కర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. దొంగతనాలు కేసులదర్యాప్తు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు, సీసీకెమెరాలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సింగరాయకొండలో గతంలో జరిగిన తాళాలు వేసిన ఇళ్లలో చోరీ లు, రాత్రి వేళల్లో గృహాల్లో దొంగతనాలు, పిల్లలు అపహరణ గురైన కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు పాత్ర ఎంతో కీలకంగా ఉపయోగపడ్డాయని అన్నారు. గ్రామాల్లోని ప్రజలందరూ తమ బాధ్యతగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని సహకరించాలని ఆయన కోరారు. వేసవి సెలవులు దృష్ట్యా దూరప్రయాణం చేసే వారు విలువైన వస్తువులు, నగదు లాకర్‌లో పెట్టుకొని తాళాలు వేసిన ఇల్లుసమాచారం పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలని ప్రజలు ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. మహేంద్ర, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాల స్థలం ఆక్రమణ



**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**
బల్లికురవ- అద్దంకి రహదారిలో గుంటుపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ వైద్యశాల వద్ద ఎదురుగా ఉన్న స్థలాన్ని రాత్రికి రాత్రి ఆక్రమించి బంకును ఏర్పాటు చేశారు. ఈ విషయంపై బాపట్ల జిల్లా వైద్యాధికారి విజయమ్మకు ఫిర్యాదు అందింది. సంబంధిత అధికారులకు సత్వరం వైద్యశాల ఎదురు ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. బంకును ఏర్పాటు చేసే ఆక్రమణదారులు శనివారం, ఆదివారం సెలవు దినాలు చూసుకుని రెండు రోజుల్లో ఆక్రమించేశారు.

### ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ సునీత



**ముండ్లమూరు, మే 14, ప్రభాతవార్త**
మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సునీత పెద్ద ఉల్లగల్లు గ్రామ పంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్ నందు వర్మీ వేసే ప్రాసెస్ ను పరిశీలించడం జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా షెడ్డు వద్దకు తీసుకురావాలని, చెత్త నుండి సంపద తయారు చేయాలని గ్రామాలలో రోడ్డుకి ఇరువైపులా చెత్త కుప్పలు దిబ్బలు ఉండరాదని, తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఆర్.జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి జే.రాజేశ్వరి, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి




**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**
జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు మండలాల పర్యటన సందర్భంగా బీజేపీ పామూరు మండల కార్యవర్గ సమావేశం అమ్మ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను అధ్యక్షతన బుధవారం జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అమర సింహ, అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటరమణయ్యలు మాట్లాడుతూ సంస్థాగతంగా మండలంలో బూత్ స్థాయి శక్తి కేంద్రం స్థాయిలలో పార్టీ నిర్మాణం చేపట్టాలని, సీనియర్ నాయకులు, పాత కొత్త పార్టీ నాయకుల కలయికతో మండలంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన జాతీయ స్థాయిలో పకాలను, ఆర్థికంగా, నూతనంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోడీ ఎన్డీఏ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలతోటి రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా మన రాష్ట్రానికి అత్యధికంగా అమరావతి, పోలవరం నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, కార్పొరేషన్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం, మౌలిక వసతులు అనేక సంస్థలకు అత్యధిక నిధులు కేటాయిస్తూ ఉన్నటువంటి విషయం బూత్ స్థాయిలో పార్టీ క్రియాశీలక కార్యకర్తలుగా మండల స్థాయిలో బూత్ స్థాయి వరకు ప్రజల్లోకి తీసకెళ్లాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొప్పరపు సుబ్బారావు, ద్రోణాదుల చరణ్, పెరమణ విజయ్ కుమారచారి, బొంతల అజయ్‌కుమార్, కొత్తూరి హరగోపాల్, సీహెచ్ మల్లిఖార్జున, జాయం చిన్న సుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి, కోటా సురేష్‌బాబు, పందిరి శ్రీనివాసులు, నీరుకట్టు రవి, యాదాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు




**రాచర్ల, మే 14, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఎడవల్లి సమీపంలో ఐటిఐ కళాశాల వద్ద (గిద్దలూరు-ఒంగోలు జాతీయ రహదారిపై) బుధవారం సాయంత్రం జరిగింది. గిద్దలూరు మండలం బురుజుపల్లి గ్రామానికి చెందిన దూదేకుల రసూల్ అనే వ్యక్తి గిద్దలూరు నుండి తాటిచెర్ల మోటు వైపు బుల్లెట్ వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు ఓ కారును ఢీకొట్టాడు. దీంతో అతనికి కాలు విరగడంతోపాటు స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో వారు వచ్చి గాయపడిన రసూల్‌ను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించాలని సూచించడంతో వారి సూచన మేరకు అతనిని కుటుంబ సభ్యులు నరసరావుపేటకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# ఎంఎన్ఎం డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

- 90 మందికి ఉద్యోగాలు



**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

ఎంఎన్ఎం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ విజయవంతంగా ముగిసింది. ఈ మేళాలో ప్రముఖ ఎయిర్ కండిషనింగ్ కంపెనీ బ్లూ స్టార్(ప్రైవేటు) లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేళాలో 100 మంది నిరుద్యోగ యువకులు పాల్గొనగా, 90 మంది అభ్యర్థులు సంస్థ ద్వారా ఉద్యోగాలు పొందడం గర్వకారణమైంది. ఎంపికైన యువతీ యువకులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు యువత భవిష్యత్తు దిక్సూచి లాంటివి, విద్యార్థులు ప్రయత్నం చేస్తే తప్పక విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, ఇతర అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉద్యోగాలు లభించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ కళాశాల, సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## మిరియం గురవయ్యను పరామర్శించిన దారపనేని బ్రదర్స్



**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ పంచాయతీ పోతవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మిరియం గురవయ్య ఇటీవల గుండెపోటు వ్యాధితో బాధపడుతూ ఒంగోలు కిమ్స్ కార్పొరేట్ హాస్పిటల్లో మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగివచ్చారు. బుధవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని జనార్దన్‌రావు మిరియం గురవయ్యను పరామర్శించి సోదరుడు మిరియం సుబ్బారాయుడును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దారపనేని గురవయ్యతో ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. నాగినేని రమేష్‌బాబు, చెనికల చినమాల కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, కొండయ్య(కరణం), మానం మల్లిఖార్జునరావు, దనియాల తిరుపతయ్య, మిరియం గురవయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

### కుడుముల వారి నూతన గృహ ప్రవేశం

## కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి ఇన్‌ఛార్జీ దద్దాల



**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

కనిగిరి మండలం పోలవరం గ్రామం వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు కుడుముల యేసయ్య-కొండమ్మల నూతన గృహ ప్రవేశంలో వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇంట్లో అడుగు పెడుతున్న మీకు అంతా మంచే జరగాలని,మీ కష్టాలన్నీ తీరిపోయి మరిన్ని సుఖసంతోషాలతో గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చిలకల మాలకొండారెడ్డి, సర్పంచ్ ముసగల బ్రహ్మారెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, అమడసాని చెన్నారెడ్డి, పాలూరి వెంకటరెడ్డి, మునలయ్య, రవీంద్రారెడ్డి, కామిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, మడతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను

### పరిశీలించిన జిల్లా అధికారులు



**ముండ్లమూరు, మే 14, ప్రభాతవార్త**

మండలంలోని పెద్ద ఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామ పంచాయతీలలో జరుగుతున్నమహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాధరరావు జోసఫ్ కుమార్ బుధవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాటర్ హార్వెస్టింగ్ పాండ్ ఇన్ కమ్యూనిటీ ల్యాండ్, ఫారం పాండ్ పనులను పరిశీలన చేయడం జరిగింది. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6గంటలనుండి 10 గంటల వరకు పని చేయాలని, రోజు వారి కూలీ రూ.307 రూపాయలు వచ్చే విధంగా మేట్స్ మార్కింగ్ ఇవ్వాలని తెలియజేశారు. వేతనాలను సంబంధించి 10 రోజులలో కూలీల అకౌంట్ నందు జమ అవుతాయని తెలిపారు. గ్రామ పంచాయతీలలో పండ్ల మొక్కల పెంపకం, చెరువులను అభివృద్ధి పనులు, ఫిష్ బ్రీడింగ్ పాండ్స్, కంపోస్ట్ పిట్స్ అంచనాలను తయారు చేసి పంపాలని సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలి ప్రధానమంత్రి సురక్షి భీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు తెలియపరిచి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి పి.సునీత, ఏపీఓ లలిత కుమారి, ఏపీవో టి.వెంకటరావు, ఈసీ జి.శివరామకృష్ణ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

- ప్రకాశం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రమణ్యం




**సంతనూతలపాడు, మే14, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో చిన్నతనం నుండే ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింపజేసినట్లయితే వారు ఉన్నతంగా అన్ని రంగాల్లో ఎదగగలరని ప్రకాశం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యం అన్నారు. సంతనూతలపాడులోని సుందరయ్య భవన్‌లో జేవీవీ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవం ఆరో రోజు బుధవారం బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి కే.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన చిట్టి చిట్టి సైన్స్ ప్రయోగాలను పిల్లల చేత చేయించడం జరిగింది. కాయిన్ మాయం చేయడం, బెలూన్ రాకెట్, గాలి తీయగానే లాగితే కదిలే ధర్మకోల్ గొలుసు లాంటి 10 రకముల ప్రయోగాలను విద్యార్థుల చేత చేయించారు. వేసవి వినోదం ద్వారా విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను వెలికి తీయవచ్చని వారి అభిరుచులను బట్టి అభివృద్ధి చెందుతారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరి చొరువ

- ఉద్యాన రైతులకు అధునాతన సాగు
- ఏలూరి కృషితో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వం, వ్యవసాయ మంత్రికి పలుమార్లు విన్నవించిన ఎమ్మెల్యే ఏలూరి
- మార్టూరు మండలంలో 250 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు
- ఉచితంగా ఆయిల్ ఫామ్ మొక్కల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



**మార్టూరు, మే 14, ప్రభాతవార్త**


ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గం లోని మార్టూరు మండల ఉద్యాన రైతులు వినూత్న సాగుకు మారేలా ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి పామాయిల్ సాగు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించడంతో మార్టూరు మండల రైతాంగం 250 హెక్టార్లలో పామాయిల్ సాగు ఉద్యాన శాఖ గ్రీన్ సిగ్నల్ వెలువరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ప్రభుత్వం రైతులు ఫస్ట్ ఫేస్ కింద సాగు చేసే ఈ 250 ఎకరాలకు సరిపడా మొక్కలను అజంతా సోయా సీడ్స్ లిమిటెడ్ సమకూర్చనుంది. ఒక హెక్టార్‌కు రూ.20వేల విలువ చేసే 150 మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనుంది. అంతే కాక నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టార్‌కు మెయింటెనెన్స్ కింద పెట్టుబడి అందజేసేలా కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖకు అనుసంధానించింది. ఎమ్మెల్యే ఏలూరి వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో మార్టూరు, బల్లికురవ మండలాల్లోని ఉద్యాన రైతులను ఆధునిక సాగు వైపు ప్రత్యేక శ్రద్ధ కనపరిచి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ సాగుకు మన ప్రాంతం అణువుగా మారనుంది. అంతే కాక ఇంపోర్టెడ్ మొక్కలు సాగు చేసి ఆయిల్ ఫామ్ రైతులకు మొక్కలు కొనుగోలు కోసం నూరు శాతం రాయితీగా రూ.29వేలు అందజేయనున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మార్టూరు మండలంలో ఆయిల్ ఫామ్ సాగుకు రూ.250 ఎకరాల్లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అన్నదాతల్లో ఆనందం తాండవిస్తోంది.

**ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషి :**

అన్నదాతలు సాగును లాభ సాటిగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతినిత్యం వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడతారు. దీనిలో భాగంగా రైతులు కొత్త సాగు వైపు నడిపేందుకు రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. గతంలో బొప్పాయి సాగుకు శ్రీకారం చుట్టి రైతులందరూ లాభాలు అర్జించేలా వినూత్న పద్ధతులు పాటించి రైతులకు ఆదర్శంగా నిలిచారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో మార్టూరు, బల్లికురవ మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ శాఖకు పలుమార్లు లేఖలు సైతం రాశారు. ఎమ్మెల్యే ఏలూరి విజ్ఞప్తి మేరకు మార్టూరు మండలంలో 100 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఎమ్మెల్యే ఏలూరికి రైతన్నలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో కంపకల్లి

- ఘనంగా ముగిసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు
- కంపకల్లిపై దొర్లుతున్న భక్తులు



**హనుమంతునిపాడు, మే14, ప్రభాతవార్త**

మండలంలోని చిన్న గొల్లపల్లిలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం కంపకల్లి కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. కంపకల్లి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, మేకపోతును బల్లి ఇచ్చి, కన్నమరాజు దండకాలతో పోతు రాజులు కంపకల్లి చుట్టూ వీర కేకలు, గోవింద నామాలతో ప్రదక్షిణ చేశారు. ముందుగా పెద్దగొల్లపల్లి, చెక్కా వంశస్తులు కంపకల్లిపై దొర్లారు. అనంతరం భక్తులు కంపకల్లిపై దొర్లి మొక్కులు చెల్లించారు. కంపకల్లిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామివారి వసంతోత్సవం, అశ్వ వాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. దేవాదాయ శాఖ నరసింహబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కంపకల్లిపై చిన్నారులను దొర్లించకుండా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ గౌసున్నీసాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కనిగిరి సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో కనిగిరి, హనుమంతునిపాడు, పీసీపల్లి ఎస్సైలు కోటయ్య, కే.మాధవరావు, శ్రీరామ్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

### యోహోవా ప్రార్ధన మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జీ దద్దాల

**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలం బుడ్డారెడ్డిపల్లి గ్రామంలోని యోహావా ప్రార్ధన మందిరం నూతన ప్రారంభోత్సవంలో వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి ఏసుప్రభువు చల్లని ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటగాని పేతురు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, గోపవరపు బొర్రారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీ కాంత, ఒకేరెడ్డి, పోలు జయరాంరెడ్డి, మూలే రాజశేఖర్‌రెడ్డి, మేకల మాల్యాద్రి, శీలం సుదర్శన్, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గుంటగాని భాస్కర్, భూమిరెడ్డి కొండారెడ్డి, ఎల్‌డీ నరసింహారెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కొండ్రు నరసింహ, సునీల్, ఓబుల్‌రెడ్డి, సూర మాల్యాద్రి, అభి, అత్యాల ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా మల్లవరం వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం కమనీయం

- కళ్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు
- పలు సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు
- పట్టు వస్త్రాలను తీసుకొని వచ్చిన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్







**మద్దిపాడు, మే 14, ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం మల్లవరం వెంకటేశ్వరస్వామి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉహయ దాతల సహకారం తోస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పలుపూజలు నిర్వహించారు. కళ్యాణం చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 15వేల పైచిలుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దామా నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు(రవికుమార్), కొండూరి శ్రీనివాస్‌అయ్యం, దివివెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో కళ్యాణ క్రతువునుకన్నులు పండుగ నిర్వహించారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పట్టు వస్త్రాలు బహుకరణ, మాంగల్య పూజ మాంగల్య ధారణ మొదలైన క్రతువులను ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఉభయ దాతలుగా మహాలక్ష్మమ్మ ఎర్రరెడ్డి దంపతులతో పాటు పల్లకి సుబ్బిరామిరెడ్డి మనవలు ఆధ్వర్యంలో కళ్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ధామా నాగేశ్వరరావు స్థానిక సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌ను శాస్త్ర యుక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీఎన్ విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంపత్ కుమార్ గాలి రాఘవ వరప్రసాద్ అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి మురళీకృష్ణ, వింజనంపాటి సారధి ఆలపించిన నారాయణ తీర్థులు తరంగాలు భక్తులను మంత్రముగ్దున్ని చేశాయి. మల్లవరం అన్నదాన కమిటీ నిర్వాహకులు నారీ పెద్ది వరహాలు చౌదరి, శ్రీవారి వనం కమిటీ సభ్యులు మార్నేని కృష్ణారావు, శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం నిర్వాహకులు గాజుల సురేష్, నున్న బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కావూరి వాసుబాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని రాఘవరావు, మన్నం శ్రీనివాస్, తేళ్ల వెంకట సుబ్బారావు, చెరుకూరి రమేష్‌బాబు, ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదే విధంగా బ్రాహ్మణ సేవా సంఘం ఆర్యవైశ్య సేవా సంఘం కాపుసేవా సంఘం ఆధ్వర్యంలో కొలచన కోట, అన్నంగి, యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రావిపాటి రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు. కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానానికి స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, కాపు నాయకులు ఆమంచి స్వాములు, గొర్రెపాటి శ్రీనివాసరావు, జనసేన మహిళ నాయకురాలు రాయపాటి అరుణ హాజరయ్యారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం వారికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు, మాజీ ఎంపీటీసీ మండవ జయలక్ష్మి, మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా నాయకులు మండవ గోపినాధ్, సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు మార్నేని రాఘవ, నున్న బాలసుబ్రహ్మణ్యం, నారిపెద్ది వరహాల చౌదరి, పోతినేని శ్రీనివాసరావు, రావిపాటి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడకా స్వాములు, మార్నింగ్ కృష్ణారావు, కావూరి వాసుబాబు, తేల వెంకట సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎం.రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వడ్డెంపూడి శ్రీనివాసరావు, ముప్పా రవి, నందిగామ కోటయ్య, కొనిజేటి శివ, బేతంపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఏడుకొండలు మృతదేహానికి నివాళులర్పించిన

### టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్



**దర్శి, మే 14, ప్రభాతవార్త**

దర్శి మండలం శామంతపూడి గ్రామంలో డాక్టర్ రావులపల్లి ఏడుకొండలు ఆక్సిడెంట్ కారణంగా మృతి చెందగా విషయం తెలుసుకున్న టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ వారి గ్రామానికి వెళ్లి మృతి చెందిన రావులపల్లి ఏడుకొండలు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొంత ఆర్థిక సహాయం చేసి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### సరదాగా యూత్‌తో కలిసి ఛాయ్ తాగిన యువనాయకులు లలిత్ సాగర్



**దర్శి, మే 14, ప్రభాతవార్త**

యూత్ ఐకానిక్ డాక్టర్లు కడియాల లలిత్ సాగర్ బుధవారం దర్శిలోని కురిచేడు రోడ్డులో గల టీ స్టాల్ వద్ద యూత్‌తో సరదాగా ఛాయ్ తాగుతూ యూత్‌ను ఉత్సాహ పరిచారు. నేను సైతం సామాన్య ప్రజానీకంతో అంటూ సరదాగా కొద్దిసేపు వారితో గడిపి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ అభివృద్ధి యూత్ పార్టీకి వెన్నుదన్నుగా ఉండాలని డాక్టర్ లలిత్ సాగర్ కోరారు.

# అద్దంకి విద్యకు సీఎస్ఆర్ అండదండలు

- మంత్రి గొట్టిపాటి చొరువతో.. విద్యాలయాలకు మౌలిక వసతులు
- రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలు, కళాశాలల్లో ఫ్యాన్లు లైట్లు
- అద్దంకి పరిధిలో 76 విద్యా సంస్థల్లో శర వేగంగా ఇన్స్టాలేషన్
- ముఖ్యమంత్రి పీ -4 ఆదర్శంగా.. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి



**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**

తన శాఖతో పాటు పేరులోనూ వెలుగులు నింపుకున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గ విద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనల్లోంచి పుట్టిన పీ-4 విధానాన్ని ఆదర్శంగా తీసుకున్న మంత్రి గొట్టిపాటి, అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటుచేస్తున్నారు. సుమారు రూ.50లక్షల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో పేద విద్యార్థులు చదువుకునే అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లతో పాటు లైట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని సుమారు 76 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ, గిరిజన, వెనుకబడిన విద్యార్థుల హాస్టళ్లలో 1,009 ఫ్యాన్లతో పాటు 1,160 లైట్ల ఏర్పాటు పక్రియ శరవేగంగా జరుగుతుంది.

**సీఎస్ఆర్ నిధులతో విద్యార్థినులకు సైకిళ్లు :**

అద్దంకి నియోజకవర్గ ఎమ్మెల్యే , విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సీఎస్ఆర్ నిధులతో స్థానిక విద్యా సంస్థల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటుకు వినియోగి స్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సుమారు 10 నెలల కాలంలోనే అద్దంకి నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు ఇప్పటి వరకు 550 కు పైగా సైకిళ్లను పంపిణీ చేశారు. రానున్న కాలంలో నియోజకవర్గంలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థినీకి కూడా సైకిళ్లను పంపిణీ చేయాలని సంకల్పించారు. సుమారు 10వేలకు పైగా సైకిళ్లను నియోజకవర్గ వ్యాప్తంగా ఉచితంగా అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. దివ్యాంగులకు సుమారు 58 మోటారు తిచక్ర వాహనాలను సీఎస్ఆర్ నిధులతో అందజేశారు.అంతే కాకుండా నియోజక వర్గంలో వీధి వ్యాపారుల కోసం 300 తోపుడు బండ్లను త్వరలోనే పంపిణీ చేయనున్నారు. అద్దంకి నియోజక వర్గంలోని జె.పంగులూరు, అద్దంకి, సంతమాగులూరు, బల్లికువ, కొరిశపాడు మండలాల పరిధిలోని అభివృద్ధిలో మంత్రి గొట్టిపాటి తనదైన ముద్ర వేశారు. ఎప్పుడూ ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రాధాన్యత ఇచ్చే మంత్రి గొట్టిపాటి విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్య అందించేందుకు తనకున్న విచక్షణాధికారాన్ని సైతం వినియోగి స్తున్నారు. విద్యాలయాలు, హాస్టళ్ల సందర్శన సమయంలో విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. నాణ్యమైన విద్య తోనే మెరుగైన సమాజం అని నమ్మిన మంత్రి గొట్టిపాటి మంచి వాతావరణంలో విద్యను అందిస్తాము.. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలని విద్యార్థులను ప్రోత్సహిస్తు న్నారు. అందరివాడు.. రాజకీయా లకు అతీతుడుః ఇప్పటి వరకు ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన గొట్టిపాటి రవికుమార్, అద్దంకి నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం తరుపు నుంచి వచ్చే నిధులతో నియోజకవర్గంలో రహదారులు, ప్రభుత్వం కార్యాలయాల నిర్మాణంతో పాటు స్థానిక కంపెనీలు వెచ్చించే సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు ప్రజల అవసరాలను తీర్చుతున్నారు. అవసరార్థం తన వద్దకు వచ్చిన వారందరి సమస్యలను రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పరిష్కరిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు.





15-5Pg5exH.qxd:15-5Pg5exH.qxd 01/01/01 7:33 AM Page 1



# యుపిలో ఆరో సెమికండక్టర్ యూనిట్


## రూ.3706 కోట్లతో ఏర్పాటు, నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తిసామర్థ్యం

### కేబినెట్ భేటీ వివరాలను వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, మే 14:** మన దేశంలో సెమీ కండక్టర్ల రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లో రూ.3,706 కోట్లతో 6వ సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ యూనిట్ ఏర్పాటుతో రెండు వేల మందికిపైగా ఉపాధి లభించనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. సెమీ కండక్టర్ల యూనిట్‌లో నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి జరుగుతుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. అంతేకాకుండా 270 వర్సిటీల్లో విద్యార్థులకు సెమీ కండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సెమీ కండక్టర్ల సాంకేతికతపై 70 స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. అంతేకాదు పరిశ్రమల అవసరాల మేరకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కొత్త విద్యా విధానంద్వారా అకడమిక్ విద్యను, పరిశ్రమలను అనుసంధానం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. టెలికామ్ విభాగం కోసం యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్‌లు, సెంటర్ ఆఫ్‌ఎక్సలెన్స్, ఇన్‌క్యూబేటర్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. సెమీ కండక్టర్ల పరికరాలు కూడా భారత్‌లో తయారీకి కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. విద్యాసంస్థల్లో సెమీకండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నాం. ఫలితంగా ఇప్పటికే కొందరు విద్యార్థులు చిప్‌లను రూపొందించారు. అందులో 20 చిప్‌లను నిపుణులు, ఇంజినీర్లు ఎంపిక చేశారు. వాటిని మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్‌లో ఉత్పత్తి చేశారు. ఇది గణనీయమైన మార్పు. గతంలోని విద్యార్థులు పుస్తకాలల్లో మాత్రమే ఇలాంటివి అధ్యయనం చేసేవారు. ప్రస్తుతం వారు వాస్తవ సాధనాలు, పరికరాలతో పనిచేస్తున్నారు. జాతీయ విద్యా విధానంద్వారా పరిశ్రమలను, విద్యను అనుసంధానించాలనేది ప్రధాని నరేంద్ర మోడీ దార్శనికత. యూపీలోని జెవార్ విమానాశ్రయానికి సమీపంలో హెచ్‌సిఎల్, ఫాక్స్‌కాన్‌లు జాయింట్ వెంచర్‌గా ఈ సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. 2027లో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. హార్డ్‌వేర్ అభివృద్ధి, తయారీలో హెచ్‌సిఎల్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో ఫాక్స్‌కాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ రెండూ కలిసి యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీలోని జెవార్ విమానాశ్రయం సమీపంలో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తాయి. ఈ యూనిట్ నెలకు 20,000 వేఫర్‌ల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ఇది నెలకు 36 మిలియన్ల (3.6 కోట్ల) చిప్‌లను తయారు చేయగలుగుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ జెవార్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన చిప్‌లను మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఆటోమొబైల్స్, పిసిలు మొదలైన వాటిలో ఉపయోగిస్తారు. వాస్తవానికి భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పటికీ ప్రారంభదశలోనే ఉంది. దీనిని ఇంకా విస్తరించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ సమయంలో చిప్‌ల కొరత ఏర్పడింది. దీనితో జాతీయ భద్రత సహా, స్వదేశీ ఆవిష్కరణల కోసం దేశీయంగా సెమీకండక్టర్ల తయారీ ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ లోటును పూడ్చడానికి కృషిచేస్తోంది. ప్రస్తుతం 60శాతం సెమికండక్టర్లపరికరాలను అమెరికా కంపెనీలే ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ సాంకేతికతపై దాదాపు 70 స్టార్టప్‌లు పని చేస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. కొత్త విద్యావిధానంలో అకడమిక్ విద్య, పరిశ్రమల అనుసంధానానికి అవకాశాలు ఎక్కువన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తయారవుతున్నారన్నారు. 270 విద్యాసంస్థల్లో విద్యార్థులకు సెమికండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులురూపొందించిన చిప్‌లను మొహాలిలో ఉత్పత్తిచేసారని, వాటితయారీలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. టెలికాం విభాగంకోసం యూనివర్సిటీలో 5జి ల్యాబ్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో ఇంక్యుబేటర్ల ఏర్పాటు జరుగుతోందన్నారు.



## రాష్ట్రపతిని కలిసిన త్రివిధ దళాధిపతులు

### ఆపరేషన్ సిందూర్‌పై సమగ్ర నివేదిక

**న్యూఢిల్లీ, మే 14:** పహల్గాంవ్ దాడి తర్వాత భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కార్యాచరణను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రివిధ దళాధిపతులు వివరించారు. బుధవారం త్రివిధ దళాల అధిపతులతోపాటు చీఫ్‌ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసి మొత్తం నివేదిక ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ అమలు, పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఆర్మీ స్పందించిన విధానం, జమ్ముకాశ్మీర్ దాడులపైనా త్రివిధ దళాలు స్పందించిన తీరును రాష్ట్రపతికి వివరించారు. సిడిఎస్ జనరల్ అనిల్‌చౌహాన్ తోపాటు ఆర్మీస్టాఫ్ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎపిసింగ్, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠిలు రాష్ట్రపతిని కలిసి సమగ్ర వివరణ ఇచ్చారు. త్రివిధ దళాలు సమన్వయంతో ఆపరేషన్ సింధూర్‌నిర్వహించామని, పాకిస్తాన్‌లోను, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోను ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసినట్లు వివరించారు. సరిహద్దు ఉగ్రవాదం అంతంచేసేందుకు ముందు వాటి మౌలికవనరులను ధ్వంసంచేసే లక్ష్యంతోనే దాడులుచేసామన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత దళాలు అనితర సాధ్యమైన పనితీరును చూపించాయని, వృత్తినైపుణ్యం, ధైర్యసాహసాలు, మెరుపుదాడులు చేసి భారత ప్రతిష్టను మరింత ఇనుమండిపచేసారని సరిహద్దుల భద్రతలో త్రివిధ దళాల పాత్ర అమోఘమని ప్రశంసించారు.

## భారత్‌లో గ్లోబల్‌టైమ్స్, జిన్హువా ఎక్స్‌ఖాతాలు క్లోజ్

### తప్పడు వార్తల ప్రచారంపై షాకిచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ, మే 14:** చైనా అధికారిక మీడియా సంస్థలైన గ్లోబల్ టైమ్స్, జిన్హువా ఎక్స్ ఖాతాలను కేంద్ర ప్రభుత్వం భారత్‌లో బ్లాక్ చేసింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఈ వారం మొదటిలోనే బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం గ్లోబల్ టైమ్స్‌ను హెచ్చరించినట్లు తెలిసింది. ఎక్స్‌లో పోస్టు చేసిన సమాచారాన్ని పున:పరిశీలించుకోవాలని, తప్పుడు వార్తలు ప్రచారం చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని ఎక్స్‌ద్వారా హితవు పలికింది. పాకిస్థాన్‌కు సానుభూతిచూపే పలు ఎక్స్ ఖాతాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఎలాంటి ఆధారాలు లేకుండానే విచ్చలవిడిగా పోస్టులు చేస్తూ, ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నాయని భారత రాయబార కార్యాలయం మరో పోస్టులో వివరించింది. బాధ్యతాయుతమైన మీడియా సంస్థలుకూడా తప్పుడు సమాచారాన్ని ప్రచురించడం సరికాదని, అది జర్నలిస్టు విలువలను కాలరాయడమేనని పేర్కొంది. చైనా మరోసారి భారత్‌ను కవ్వించేందుకు ప్రయత్నించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా కొత్త పేర్లు పెట్టింది. వాటిని దక్షిణ టిబెట్‌లోని ప్రాంతాలుగా పేర్కొంది.

ఈ నేపథ్యంలోనే చైనాకు భారత్ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనా పేర్లు పెట్టిన అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు గుర్తించిన కేంద్రం గ్లోబల్ టైమ్స్ ఎక్స్ ఖాతాను విత్‌హెల్డ్‌లో పెట్టింది. ఇదే కారణాలతో చైనాకు చెందిన ఎక్స్‌హెచ్‌న్యూస్, తుర్కియేకు చెందిన టీఆర్‌టీ వరల్డ్‌ను కూడా విత్‌హెల్డ్‌లో పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాల పేర్లు మార్చడానికి చైనా వ్యర్థమైన, పిచ్చి ప్రయత్నాలు చేస్తోందని మేము గమనించాం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అరుణాచల్‌ప్రదేశ్ అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడూ భారతదేశంలో అంతర్భాగంగా ఉంది, ఇకపైనా ఉంటుంది. ఆ వాస్తవానికి ఎవరూ మార్చలేరు, తిరస్కరించలేరు రణధీర్ జైస్వాల్, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖచైనా గతంలోనూ ఇలాంటి ప్రయత్నాలు చేసింది. కానీ ప్రతిసారీ చైనా దుష్ట ప్రయత్నాలను భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది.



## తుర్కియే పాక్ దోస్తీ జిందాబాద్

### ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ వింత వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 14:** కాల్పులసమయంలో పాకిస్థాన్‌కు సాయం అందించిన తుర్కియేకు పాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్ ఆదేశ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈక్రమంలోనే షరీఫ్‌ను ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ అభినందించారు. అంతేకాకుండా పాకిస్థాన్ మాకు నిజమైన మిత్రదేశం అన్నారు.

గతంలోలాగా భవిష్యత్తు లోనూ అండగా ఉంటామన్నారు. పాక్‌ప్రధానిని విలువైన మిత్రుడిగా ఎర్డొగాన్ అభివర్ణించారు. నావిలువైన మిత్రుడు షెహబాజ్ షరీఫ్, తుర్కియే పాకిస్థాన్‌లమధ్య సోదరభావం అనేది నిజమైన స్నేహానికి నిదర్శనం. ప్రపంచంలో కొన్నిదేశాలు మాత్రమే దీన్ని కొనసాగిస్తాయి.

తుర్కియలోలాగే పాకిస్థాన్‌లో శాంతి, సుస్థిరతను కోరుతున్నాం. వివాదాల పరిష్కా రంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యం ఇస్తున్న పాక్‌ప్రభుత్వ విధానం అభినందనీయం అన్నారు. గతంలో మంచి, చెడు సమయాల్లోలాగే భవిష్యత్తులోనూ పాక్‌కు అండగా నిలుస్తామని పాకిస్థాన్ తుర్కియే దోస్తీ జిందాబాద్ అని ఆదేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ వ్యాఖ్యలు చేసారు. ఆపరేషన్ సింధూర్‌ను భారత్ చేపట్టి పాక్‌పైమూకుమ్మడి దాడులు చేయగా పాకిస్థాన్‌కు ఆయుధ సాయంచేసి తుర్కియే అండగా నిలిచింది.

డ్రోన్లతో సహా యుద్ధనౌకను కూడా పంపించింది. వీటితోపాటు సైనికసాయం కూడా అందించింది. ఇలా శత్రుదేశానికిసాయంచేస్తున్న తుర్కియేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పలు ట్రావెల్ ఏజెన్సీలు ఆదేశానికి బుకింగ్‌లు నిలిపివేయగా అక్కడి యాపిల్ దిగుమతులను కూడా పూణె వ్యాపారులు బహిష్కరించారు.

## బిఎస్‌ఎఫ్ జవాన్‌ను భారత్‌కు అప్పగించిన పాక్ ఆర్మీ



**న్యూఢిల్లీ, మే 14:** అనుకోకుండా భారత సరిహద్దు దాటి పాక్‌వైపునకువెళ్లి అక్కడి సైన్యం అదుపులో ఉన్న బిఎస్‌ఎఫ్ జవానును ఎట్టకేలకు పాక్ ఆర్మీ విడుదలచేసింది. నిర్ణీత సాంప్రదాయాలను అనుసరించి భారత జవానను సరిహద్దుల్లో భారత్ దళాలకు అప్పగించారు. ఉదయం 10.30 గంటలకు బిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణమ్ కుమార్‌షాను పాకిస్థాన్ ఆర్మీ అట్టారి వాఘా సరిహద్దువద్ద అప్పగించిందని బిఎస్‌ఎఫ్ వెల్లడించింది. విధినిర్వహణలో ఉండగానే కొందరు రైతులతో కలిసి అనుకోకుండా ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో గతనెల 23న సరిహద్దు దాటి ఆవలికి వెళ్లిపోయాడు. ఉదయం 11.50 గంటలకు జరిగిన ఈ సంఘటనతో రేంజర్స్ వెంటనే ఆతడిని అదుపులోనికి తీసుకుని ఆచూకీ కూడా తెలియనీయకుండా దాచిపెట్టారు. అప్పటినుంచి భారత్‌ఆర్మీ ఫ్లాగ్‌మార్చ్‌చేసి బిఎస్‌ఎఫ్ జవానును అప్పగించాలని శతవిధాలా ప్రయత్నాలుచేస్తూనే వచ్చింది. చివరకు పాక్ ఆర్మీ జవానును అప్పగించింది. పంజాబ్ ఫ్రాంటియర్ బిఎస్‌ఎఫ్ ఐజి అతుల్ ఫుల్జేలే మాట్లాడుతూ జవాను అప్పగింత సామరస్యపూర్వకంగా పూర్తి అయిందని అన్నారు. 40 ఏళ్ల పూర్ణమ్‌షా సరిహద్దుదాటిపోవడంతో రేంజర్స్ వెంటనే అదుపులోకి తీసుకున్నారు. సరిగ్గా పహల్గాంవ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మందిపర్యాటకులు మృతిచెందిన మరుసటిరోజే ఈ సంఘటన జరిగింది. పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ ప్రాంతానికి చెందిన షా జల్లోక్ సరిహద్దులో కిసాన్‌గార్డ్ డ్యూటీలో ఉన్నాడు. బిఎస్‌ఎఫ్ 182 బెటాలియన్ ఆతడిని ఈప్రాంతంలో డిప్యూటేషన్‌పై నియమించింది. ఆ తర్వాతకొన్ని రోజులముందే మరోప్రాంతానికి తరలించింది. జవాన్‌నురెజిమెంట్‌లోని అడ్వాన్స్ టీమ్‌లో ఉంచింది. అయితే జవానుకు ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన లేకపోవడంవల్లనే సరిహద్దును దాటి పాక్‌వైపునకు వెళ్లిపోయాడని బిఎస్‌ఎఫ్ చెపుతోంది. కేంద్ర ప్రభుత్వం, బిఎస్‌ఎఫ్ హైకమాండ్ ఆతడిని వెనక్కి తీసుకువచ్చేందుకు కృషిచేయడంపై ధన్యవాదాలు తెలిపారు.

గడచిన రెండు వారాలు మాకుటుంబం అంతా నిద్రలేని రాత్రులుగడిపామని, మా పూర్ణం శ్రేయస్సు కోసం భగవంతునికి ప్రార్థనలుచేసామని, ఆ దేవుడు మా ప్రార్థనలను ఆలకించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భారత్ పాకిస్తాన్ కాల్పుల విరమణ తర్వాతనే పూర్ణమ్‌షా భారత్‌కు తిరిగిరావడం భారత సంప్రదింపుల శక్తిసామర్థ్యాలకు నిదర్శనంగా నిలిచింది.

## రాఫెల్ విమానాలే నడుపుతుంటే మహిళలపై ఎందుకు వివక్ష?



### కేంద్రంపై సుప్రీం అసహనం

**న్యూఢిల్లీ, మే 14:** ఇండియన్ ఆర్మీలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచీ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆ పోస్టులకు స్త్రీపురుష నిష్పత్తి వర్తించదని నిబంధన ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిని ఎందుకు అనుసరించడం లేదని అడిగింది. రఫేల్ లాంటి అత్యాధునిక యుద్ధ విమానాలనే అమ్మాయిలు నడుపుతున్నప్పుడు, మరి వారికి లీగల్ పోస్టులను ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగి అనే ఇద్దరు మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీనితో వాళ్లిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నా, మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే మొత్తం 6 పోస్టులు మాత్రమే ఉన్నాయని, అందులో మహిళలకు 3 పోస్టులు మాత్రమే కేటాయించామని, అందుకే మెరిట్ ఉన్నప్పటికీ తమను ఎంపిక చేయలేదని ఉన్నతాధికారులు చెప్పారని వారిద్దరూ అన్నారు. వీరి పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత వాయుసేనలో మహిళలు రఫేల్ యుద్ధ విమానాలను నడిపేందుకు అనుమతి ఉన్నప్పుడు, ఇండియన్ ఆర్మీలోని లీగల్ బ్రాంచీల్లో పురుషుల కంటే మహిళలను ఎక్కువ సంఖ్యలో విధుల్లోకి తీసుకోవడంలో కష్టం ఏముంది? స్త్రీ పురుష భేదంతో సంబంధంలేకుండా అవి తటస్థ పోస్టులను కేంద్రం చెబుతోంది. అలాంటప్పుడు మెరిట్ సాధించిన మహిళలకు ఎందుకు పోస్టులను కేటాయించడంలేదు? స్త్రీపురుష సమానత్వం అంటే మహిళలకు, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడం కాదు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా అర్హత ఉంటే అవకాశం ఇవ్వడమే" అని సుప్రీం బెంచ్ వ్యాఖ్యానించింది. అనంతరం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది.

## పాక్ దాడుల్లో ధ్వంసం అయిన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయం

### జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, మే 14:** నియంత్రణరేఖ వెంబడి పాకిస్థాన్ బలగాలు జరిపిన షెల్లింగ్‌లో ధ్వంసమైన ఇళ్లను జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా పరిశీలించారు. నష్టానికి సంబంధించి బాధితులను స్వయంగా వివరాలు అడిగారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడానికి అవసరమైన ప్రభుత్వ సాయం అందిస్తామని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. వారిబాధను తాము అర్థం చేసుకో టగలనని అన్నారు. ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని సలామాబాద్, లాగామా, బందీ, గింగల్‌సహా ఊరీలోని షెల్లింగ్‌ప్రభావిత ప్రాంతాల్లో ఒమర్ అబ్దుల్లా పర్యటించారు. ఈ ప్రాంతాల్లో వ్యక్తిగత బంకర్లను నిర్మించాలనే డిమాండ్‌ను కేంద్రంతో చర్చిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పునర్‌నిర్మించుకోడానికి సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఊరీ ప్రాంతంలోని ప్రజలు అనేక సార్లు బాధను భరించారని అయితేప్రతిసారి ఎంతో ధైర్యంతో కోలుకున్నారని అబ్దుల్లా అన్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాక్ దళాలు సరిహద్దుల్లోని ప్రజలకు ఎక్కువ హాని తలపెట్టే లక్ష్యంతోనే దాడులుచేసాయని ఒమర్ అన్నారు. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాలు రెండురోజులుగా నిశ్శబ్దంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభావితప్రాంతాల్లో నష్టాన్ని అంచనావేస్తున్నామని బాధితులందరికీ సాయంచేసేందుకు యత్నిస్తున్నట్లు జమ్ముకాశ్మీర్ సిఎం అన్నారు.

# నిఘా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైన షార్

## ఇప్పటికే షార్‌ను చేరుకున్న ఇఒఎస్-9 ఉపగ్రహం

### పిఎస్‌ఎల్‌వి-సి61 నిర్మాణం చకచకా: ఇస్రో చైర్మన్ వి. నారాయణన్

**శ్రీహరికోట (తడ), మే 14 ప్రభాతవార్త:** భారతదేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 18న తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఇఒఎస్-09 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. భారత్‌కు ఎంతో పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్‌ఎల్‌వి) ద్వారా ఈ ఉపగ్రహ ప్రయోగం జరుపుతున్నారు. పిఎస్‌ఎల్‌వి-సి61 పేరుతో రాకెట్‌ను నాలుగు దశలుగా నిర్మించారు. గత ఏడాది చివరలో పిఎస్‌ఎల్‌వి-సి60 రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఇన్నాళ్లకు మరో పిఎస్‌ఎల్‌వి రాకెట్ షార్ నుంచి ఎగరనుంది. మధ్యలో ఇస్రో 100వ రాకెట్ జిఎస్‌ఎల్‌వి-ఎఫ్15ను ప్రయోగించి ఉన్నారు. ఇదిలావుంటే సరిహద్దుల్లో ఇటీవల నెలకొన్న కొన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇస్రో ఈ నిఘా ఉపగ్రహం అవసరాన్ని గుర్తించి చకచకా ఏర్పాట్లతో ప్రయోగం చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఉపగ్రహం శ్రీహరికోటను చేరింది. ఇక్కడ ఉన్న అన్ని రాకెట్ నిర్మాణ దశల సౌకర్యాలను ఉపయోగించుకుని పిఎస్‌ఎల్‌వి-సి61ని నిర్మాణపరంగా పనులు పూర్తిచేశారు. ఈ ఉపగ్రహ లక్ష్యం ఏదైనప్పటికీ ప్రస్తుతం అవసరమైన ఉపగ్రహం. దీనికి తగ్గట్లే ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఇస్రో ప్రయోగాల వలన దేశానికి రక్షణ సేవలు కూడా అందుతున్నాయని ప్రకటించి ఉన్నారు. ఇప్పటికే పది ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి తమ పని తాము చేసుకుపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇఒఎస్-09 పేరుతో ప్రయోగిస్తున్న భూపరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా సరిహద్దు ప్రాంతాలను, అందులో ఉగ్రవాద కదలికలను పసిగట్టే సామర్థ్యం కలిగి ఉందని ఇస్రో వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఐదేళ్లలో కనీసం 52 నిఘా ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టి భారతీయ రక్షణ రంగానికి విలువైన సేవలు అందిస్తామని కూడా ఇస్రో వర్గాలు తెలిపి



ఉన్నాయి. ఈ ఉపగ్రహాలు శత్రువుల పనితీరును పసిగట్టేందుకు సరిహద్దులను పర్యవేక్షించేందుకు సైనిక కార్యకలాపాల సమయంలో త్రివిధ దళాలకు సాయపడేందుకు ఉపయోగపడతాయని ఇస్రో వర్గాల నుంచి సమాచారం. అందుకే ప్రస్తుతం ఉపగ్రహ ప్రయోగంపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరో వైపు షార్‌లో భద్రత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇటీవల సిఐఎస్‌ఎఫ్ దళాలు, స్థానిక పోలీసుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధ వాతావరణం ప్రస్తుతం లేదని భావిస్తున్నా షార్‌ను మరింత భద్రత కల్పించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. దేశ భద్రతను కాపాడుకోవాలంటే దేశంలోని 7వేల కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యాధునిక ఉపగ్రహాల, డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఇప్పటికే స్పష్టంచేశారు. ఇఒఎస్09 ఉపగ్రహం రీశాట్ 1బి సేవలు అందించనుంది. ఇప్పటికే రీశాట్ 1ఎ ఉపగ్రహంఅంతరిక్షం నుంచి మన దేశ రక్షణ కార్యక్రమాలు పర్యవేక్షిస్తోంది. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా భూ ఉపరితలాన్ని అత్యంత స్పష్టతతో కూడిన హై రిజల్యూషన్ ఫొటోలను తీసి పంపే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. ఇందులో అమర్చిన సి బ్యాండ్ సింతటిక్ అపార్చ్ రాడార్ ప్రధాన ప్రత్యేకత కాగా, ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడా లేకుండా సునిశిత విశ్లేషణ చేసే సామర్థ్యం ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలకు ఉంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటరీ స్థాయీసంఘం సభ్యులు ఉపగ్రహ ప్రయోగాన్ని వీక్షించేందుకు శ్రీహరికోటకు రానున్నట్లు తెలిసింది. ఈ ఉపగ్రహ ప్రయోగ ప్రాధాన్యత దృష్ట్యా మరికొంతమంది విఐపిలు ఇస్రో ఛైర్మన్‌తో పాటు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయంలో షార్‌లోనే ఉండబోతున్నారు.



## పరదీప్ నౌకలో 21 మంది పాక్ సిబ్బంది

### భద్రతపెంచిన మెరైన్ పోలీస్

**న్యూఢిల్లీ, మే 14:** భారత పాకిస్థాన్‌లమధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఓడరేవులవద్ద భద్రతను కట్టుదిట్టంచేసారు. ఈ క్రమంలోనే ఒడిశాలోని పరదీప్ పోర్టుకు వచ్చిన ఒక నౌక కలకలం రేపింది. అందులో 21 మంది పాకిస్థాన్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనితో ఆపోర్టులో భద్రతను ఒక్కసారిగా పెంచారు. ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణకొరియా నుంచి సింగపూర్ మీదుగా ఒక నౌక పరదీప్ పోర్టుకు చేరింది. ఎంటి సైరెన్2 పేరుతో ఉన్నఈ నౌకలో మొత్తం 25మంది సిబ్బంది ఉన్నారు. ఐఒసికోసం ముడిచమురును తెచ్చింది. తనిఖీలుచేయగా సిబ్బందిలో 21 మంది పాకిస్తానీలుగా గుర్తించారు. ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్‌నుంచి దీనికి సమాచారం అందడంతో ఒడిశా మెరైన్‌పోలీసులు, సిఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తం అయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈనౌక పోర్టుకు 20 కిలోమీటర్ల దూరంలోని పీఎం బెర్త్‌వద్ద లంగరువేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడిచమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడిచమురు అన్‌లోడింగ్ పూర్తయ్యేవరకూ 25 మంది సిబ్బంది నౌకను వీడకుండా భద్రతా ఏర్పాట్లుచేసామని అధికారులు తెలిపారు.

## సుప్రీం కోర్టు సిజెఐగా గవాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మిఠాయిలు పంచిన న్యాయవాదులు

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీం కోర్ట్ 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి ఈరోజు ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేసారు. ఈ సందర్భముగా నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సీనియర్ జూనియర్, మహిళ న్యాయవాదుల అందరూ సంతోషాలతో స్వీట్లు మిఠాయిలు పంచినారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఉప్పులూరి డేవిడ్ రాజ్ మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొందలపాటి రామకృష్ణ మన్నెం నారాయణరావు చిరుమామిళ్ల శ్రీనివాసరావు మాజీ ఏజీపీ మట్ట ప్రసాద్ షేక్ సైదా బొబ్బిళ్ల పాటీ భాస్కరరావు వేదుల సుబ్రహ్మణ్యం, పెసరమిల్లి సురేష్ పంది ప్రకాష్, కొనకంచి శ్రీనివాసరావు, వేల్పుల స్వామి దున్న కోటేశ్వరరావు, వేల్పుల కిషోర్, కొండలరావు, కర్ల నాగభూషణం ప్రదీప్, వేల్పుల ప్రభాకర్ రావు తదితరులు మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా భూషణ్ రామకృష్ణ గావాయి 52వ సీజే గా ఎన్నికకాబడినందుకు భారత ప్రజలందరూ మరియు మనదేశంలో ఉన్నటువంటి న్యాయవాదులందరూ సంతోషాలను వ్యక్తపరిచినారని, ఇటువంటి అత్యున్నత పదవికి రెండవ దళిత బిడ్డగా ఎన్నికావటం చాలా శుభ పరిణామం అని మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబర్ 24న పుట్టినారు. 1985 లో అమరావతి బార్‌లో న్యాయవాది వృత్తిని చేపట్టినారు. మహారాష్ట్రలోని నాగపూర్, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్లుకు , అమరావతి విశ్వవిద్యాలయంకి స్టాండింగ్ కౌన్సిల్ గా పనిచేసినారు. 1992:93 వరకు బొంబే హైకోర్టు నాగపూర్ ధర్మసనం లో ప్రభుత్వం సహాయ న్యాయవాదిగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సేవలందించారు. 2005 నవంబర్ 12న బొంబాయి హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. మే 24న 2019 న ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందినారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు జస్టిస్ గవాయి 2016 లో పెద్ద నోట్ల రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్ధిస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో ఉన్నారు. ఎస్సీ వర్గీకరణలో రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అధికారం కలిపిస్తూ ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసములో ఇచ్చిన తీర్పులో జస్టిస్ గవాయి సభ్యులుగా ఉన్నారు. అదేవిధంగా 2023 డిసెంబర్లో జమ్మూకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్ధిస్తూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసములో ఇచ్చిన ఏకగ్రీవ తీర్పులో ఉన్నారు. అడవులు వన్యప్రాణులు, చెట్లు రక్షణకు సంబంధించిన విషయాలు విచారించే బెంచ్‌కు ఆయన నాయకత్వం వహించారు. రానున్న రోజుల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అనేకమైనటువంటి విషయాల్లో మంచిగా రాణించాలని కోరినారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్ల లారీ: ఇద్దరు మృతి

**శ్రీకాళహస్తిరూరల్,మే 14 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ వద్ద అన్నమయ్యజిల్లా నుంచి మట్టిని తీసుకెళుతున్న లారీ పార్కింగ్ చేసి ఉండగా కోళ్ల లారీ ఢీకొంది. ఈ కోళ్లన లారీ ఈ నెల 13న సేలం నుంచి నాటుకోళ్ళు లోడుతీసుకొని బయలుదేరారు. బుధవారం వేకువ జాము 2.45 ప్రాంతంలో ఏర్పేడు దాటుతూనే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కోళ్ల లారీ డ్రైవర్ కృష్ణన్ పెరుమాళ్, పక్కన కూర్చొన్న రాజన్ మధు మృతి చెందారు. అతి కష్టంమీద వారిని పోలీసులు బయటకులాగారు. మృతదేహాలను శ్రీకాళహస్తి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బోలేరో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కేసు దర్యాప్తులో ఉంది.




## ఎపి పాలిసెట్ ఫలితాలలో సత్తా చాటిన తిరుమల విద్యార్థులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 14 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ఆరుగురు 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ 120 మార్కులు బాలినేని కళ్యాణ్ రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్ శ్రీరామ్, బల్లా రిషిత శ్రీ స్వప్న, రూపిటి చహ్నా, పాల రోహిత్ లు సాధించారన్నారు. అదేవిధంగా 120 మార్కులకు గాను 119 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో స్టేట్ 2 వ ర్యాంకు, ఐదవ ర్యాంకు, ఏడవ ర్యాంకు, పదవ ర్యాంకు, 11వ ర్యాంకు, 12వ ర్యాంకు లను కైవసం చేసుకోవడమే కాకుండా 50లో 14 మంది, 100 లోపు 23 మంది, 500 లోపు 79 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ జి సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి శ్రీహరి లు అభినందించారు.

## ఎపిఆర్.జె.సి ఫలితాలలో తిరుమల విద్యార్థులకు స్టేట్ ఫస్ట్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మే 14ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్.జె.సి ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బాలినేని కళ్యాణ్ రామ్ స్టేట్ ఫస్ట ర్యాంకు, బైపీసీ విభాగంలో బొడ్డుపల్లి మనోజ్ కుమార్ స్టేట్ ఫస్ట ర్యాంకు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె. ఫణిశ్రీ వసంత్ మూడవ ర్యాంకును, ఆర్. చహ్నా ఆరవ ర్యాంకును, కె. అవినాష్ ఏడవ ర్యాంకును, వూన్న వరుణ్ తేజ్ 8వ ర్యాంకును, కే. సాకేత్ గుప్తా 9వ ర్యాంకును సాధించారని తెలిపారు. 50లోపు 38 ర్యాంకులు, 100 లోపు 74 ర్యాంకులు, 500 లోపు 247 ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలను పొందారని తిరుమలరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ జి సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి శ్రీహరి అభినందించారు.



## వైభవంగా సత్యదేవుని శ్రీపుష్పయాగ మహోత్సవం

### రత్నగిరిపై ముగిసిన కల్యాణోత్సవాలు

**అన్నవరం, మే14 ప్రభాత వార్త:** కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా, భక్తుల పాలిట కొంగుబంగారంగా రత్నగిరిపై పూజలందుకుంటున్న రత్నగిరి వాసుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మి ్మ అమ్మవార్ల శ్రీ పుష్పయాగ మహోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు శ్రీ పుష్ప యాగ మహోత్సవాన్ని మనోహరంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు వేద మంత్రాలతో పండ్లు, స్వీట్లుతో నవ దంపతులతో పాటు పెండ్లి పెద్దలైన సీతారాములను నిత్య కళ్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చి సుందరంగా అలంకరించిన వేదికపై ఏర్పాటుచేసిన వెండి సింహాసనంపై స్వామి, అమ్మవార్లను, మరో వేదికపై పెండ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి, ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నవ దంపతులైన స్వామి, అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు రకాల సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన తూగుటుయ్యాలపై శేష పాన్పుపై శయనించిన విష్ణుమూర్తిగా సత్య దేవుడిని శిరస్సును మహాలక్ష్మి ్మగా అనంతలక్ష్మి ్మ సత్యవతి దేవి ఒడిలో పెట్టుకుని విశిన క్రతో విసురుతున్నట్టు అలంకరించారు. తొలుతగా నవ దంపతులతో విఘ్నేశ్వర పూజ, అష్టోత్తర శతనామావళి, మంత్ర పుష్పం, వేద స్వస్తి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి రోహిత్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందించారు.

# జూన్ మొదటి వారంలో మంగినపూడి బీచ్ ఉత్సవాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే జూన్ మాసం మొదటి వారంలో 4 రోజులపాటు "మసులా ఫెస్ట్ " పేరుతో మంగినపూడి బీచ్ ఉత్సవాలను నిర్వహించుటకు వీలుగా అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మంత్రి మంగినపూడి బీచ్ సందర్శించి అక్కడ జరుగుతున్న పలు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత ప్రవేశ మార్గంలో ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలను మంత్రి వర్యులు పరిశీలించారు. మంత్రి స్వయంగా తోరణాల వెల్డింగ్ పనులను చేసి అందరిని ఆశ్చర్యపరిచారు. తదుపరి మంత్రి అక్కడ ధర్మాకోల్ తో తయారు చేస్తున్న గౌతమ బుద్ధుడు, ఆక్టోపస్, డాల్ఫిన్, ఎండ్రకాయ, నక్షత్ర చేప, వివిధ రకాల చేపలు, తాబేలు, శంఖము, తదితర సముద్ర జీవులు, పాండురంగ స్వామి ఆకారాలతో బొమ్మలను పరిశీలించారు. వచ్చే జూన్ మొదటి వారం ముసులా ఫెస్ట్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి అధికారులను, ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ ను ఆదేశించారు. బీచ్ లో ప్రధాన రహదారి వెడల్పు చేసి మధ్యలో ఒక కూడలి ఏర్పాటు చేసి అక్కడి నుండి హెలిపాడ్ వరకు రహదారి నిర్మించాలని సూచించారు. అనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వచ్చే జూన్ నెల మొదటి వారంలో మసులా ఫెస్ట్ పేరుతో మంగినపూడి బీచ్ ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

బీచ్ ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంకను పిలిపించామని, వారి ఆధ్వర్యంలో అమరావతికి ముఖద్వారంగా ఉండేలా ప్రవేశ మార్గంలో స్వాగత తోరణాలు, అసెంబ్లీ టవర్ తలపించే విధంగా రూపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మచిలీపట్నం బీచ్ ను తీర్చిదిద్దుతామన్నారు. మన రాష్ట్రం తో పాటు చుట్టుపక్కల పరిసరాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కలంకారి, బందరు లడ్డు, హల్వా, బంగారు నగలు, డాల్ఫిన్, వివిధ రకాల చేపల ఆకృతులతో ధర్మాకోల్ బొమ్మలు రూపొందిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయా కింగ్ జల క్రీడలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడల్లో 2,000 మందికి పైగా క్రీడాకారులు



మంగినపూడి ఉత్సవాల సందర్భంగా బీచ్‌లో పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పాల్గొంటున్నారన్నారు. ఇవి కాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పారా గ్లైడింగ్, హెలికాప్టర్ రైడింగ్, నీటిలో నడిపే స్కూటర్లు, నీటిలో గ్లైడింగ్, స్కోవ డైవింగ్, మోటార్ స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలు కూడా ఉంటాయన్నారు.

అంతేకాకుండా ఉల్లాసం కోసం జెయింట్ వీల్స్, రకరకాల పూల ప్రదర్శన, మ్యూజికల్ ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారువివిధ రకాల రుచికరమైన వంటకాల శాలలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే పర్యాటకులకు వినోదం కోసం అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ముఖ్యంగా ప్రముఖ సినీ కళాకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తా మన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని ఆహ్వానిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకం కింద 100 నుంచి 150 కోట్ల రూపాయలు రానున్నాయని, ఇందుకోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దీని ఆధారంగా చేసుకుని పలు రకాల రిసార్టులు, హోటల్లు నెలకొల్పుటకు 800 నుంచి 1000 కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. విజయవాడతోపాటు రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉండటమే కాకుండా హైదరాబాదుకు అత్యంత సమీపంలో మంగినపూడి బీచ్ ఉందని, ఈ బీచ్ అభివృద్ధికి మెండుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఈ ఉత్సవాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఇదివరకు 2018లో మంగినపూడి బీచ్ ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించామని, 10 లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీసు రెవెన్యూ పర్యాటక అధికారులతో సమన్వయం చేసుకొని ఎంతమంది వచ్చినా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మచిలీపట్నం ఆర్డీఓ కే స్వాతి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, తహాసీల్దారులు హరినాదు, నాగభూషణం, సీఐ ఏసుబాబు, విద్యుత్ శాఖ డి ఈ రామకృష్ణ, రహదారులు భవనాల శాఖ డి ఈ సంగీత, తదితర అధికారులు అధికారులు పాల్గొన్నారు.

## చిత్తూరులో డెకాయిట్ ఆపరేషన్

### లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పట్టుబడిన సభ్యుల ముఠా

**చిత్తూరు టౌన్, మే 14 ప్రభాతవార్త:** చిత్తూరులో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వారిపై బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, తహసిల్దారు చంద్రశేఖర్‌లు డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించి ముఠా సభ్యులను పట్టుకున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అక్కడి నుండి పరారు కావడంతో మిగిలిన ముఠా సభ్యులను వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల అదుపులో 11 మంది ముఠా సభ్యులు వున్నారు. వివరాలిలా వున్నాయి. చిత్తూరు 9వ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఓ స్వచ్ఛంద సంస్థ నేరుగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమాచారం అందించింది. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ సత్వరం డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని అర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అర్డీఓ శ్రీనివాసులు తహసిల్దారు చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది నేరుగా భరత్‌నగర్ కాలనీలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఇంటి వద్దకు వెళ్ళారు. అప్పటికే లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడానికి తమిళనాడు క్రిష్ణగిరి నుండి 11 మంది గర్భిణీ స్త్రీలు అక్కడ వేచి వున్నారు. తనను పట్టుకోవడానికి అధికారులు పక్కా స్కెచ్‌తో వచ్చారని గ్రహించిన గర్భ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే డాక్టర్ అక్కడి నుండి పరారీ అయ్యాడు. పరీక్షలు నిర్వహించుకోవడానికి వచ్చిన గర్భిణీలతో పాటు ఈ ముఠా సభ్యులను అధికారులు అదుపులోకి తీసుకుని



లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న భరత్ నగర్‌లోని ఓ ప్రైవేటు ఇల్లు.

వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో పాటు డిసిహెచ్‌ఎస్‌లకు నోటీసులు జారీ చేశారు. భరత్‌నగర్ కాలనీలో ఒక ఏడాది కాలంగా ఓ ప్రైవేటు ఇంటిని అద్దెకు తీసుకుని తమిళనాడు రాష్ట్రం క్రిష్టగిరి పరిసర ప్రాంతాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు ఇక్కడ గర్భ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అనునిత్యం ఆ ఇంటికి గర్భిణీ స్త్రీలు వస్తుండటంతో అనుమానం వచ్చిన ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు దీని కూపి లాగి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమాచారం అందించారు. దీనిపై సత్వరం స్పందించిన కలెక్టర్ అర్డీఓ శ్రీనివాసులును అప్రమత్తం చేయడంతో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ముఠా సభ్యులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అధికారులు గర్భ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఇంటితో పాటు స్కానర్, ఇతర పరికరాలను సీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సూత్రదారి డాక్టర్ కోసం వెతుకులాట ప్రారంభించారు.

## లిక్కర్ కేసులో సజ్జల శ్రీధర్ రెడ్డికి మూడు రోజులు పోలీస్ కస్టడీ

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ కేసులో సజ్జల శ్రీధర్ రెడ్డిని న్యాయస్థానం మూడు రోజులు పోలీస్ కస్టడీకి ఇచ్చింది. దీంతో రేపు అంటే, ఈనెల 15, 16, 17 తేదీల్లో సిట్ అధికారులు సజ్జలను కస్టడీలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు ముద్దాయిలను సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మద్యం స్కాం లో కీలకంగా పనిచేసిన సజ్జల శ్రీధర్ రెడ్డి ద్వారా మరింత సమాచారం రాబట్టాలని భావిస్తున్న సిట్ అధికారులు ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేసి కస్టడీ అనుమతి పొందారు. ఇలా ఉండగా, వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి(ఏ6)ని కస్టడీకి ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఏసీబీ కోర్టులో మే 12 సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. శ్రీధర్‌రెడ్డి నుంచి కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. దీంతో ఇవాళ కస్టడీకి ఇచ్చింది కోర్టు.

## అమరావతి ఉద్యమనేత బొప్పన విజయకుమార్ కన్నుమూత

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజం ఎప్పుడు కులమతాలకు అతీతంగా ఉండాలి, మనిషి తనలో మనిషి ధైర్యంగా తట్టిలేపేలా ఉండాలంటే సాహిత్యరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అమరావతి సాంస్కృతిక ఉద్యమనేత బొప్పన విజయకుమార్ బుధవారం నిదురలోనే మరణించారు. భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) నాయకునిగా విద్యార్థి దశలో రాణించిన బొప్పన పోలీసు ఉద్యోగంలో చేరారు. ఎఎస్పీగా పదవి విరమణ చేసారు. సమాజంలో కులం ఉండకూడదు. అలా జరగాలంటే మిళితులకు( బిన్న సామాజికవర్గాల వివాహలుచేసుకున్న వారి సంతానానికి) ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని ఆయన అభిప్రాయపడేవారు. అమరావతిని కీర్తిస్తూ దగ్గర, దగ్గర 15 నిమిషాలు సాగిన ఓ గేయానికి ఆయన రూపకర్త. ప్రజా నాట్యమండలి కళాకారులతో ఈ పాటపాడించారు. రేపటి కోసం



సామాజిక ఉద్యమ పత్రికను నిర్వహించారు. భార్య విజయ క్యాన్సర్‌తో మరణించిన తరువాత ఆయన మానసికంగా కొంత కలత చెందిన అమరావతి సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్వహించారు. దీర్ఘకాలం నుంచి మూత్ర పిండాల సమస్యతో ఇబ్బంది పడుతూ ఆయన నిద్రలోనే కన్నుమూసారు. గురజాల శాసనసభ్యుడు యరపతినేని, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహకారంతో ఆయన " ఆంధ్రుల చరిత్ర"పై ఓ పుస్తకం రాసారు. పుస్తకం అచ్చులోకి రాకుండానే ఆయన మరణించారు. సీఎం చంద్రబాబునాయుడు. డీసీఎం పవన్ కల్యాణ్, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, మంత్రులు సవిత, అనిత, కొలుసు పార్ధ సారధి, ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: ఎంపి పురందేశ్వరి

విజయవాడ మే 14 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్ ప్రధాని మోదీ హయాంలో ఐదో స్థానానికి చేరిందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. భవిష్యత్తులో జపాన్‌ను అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని అభిప్రాయపడ్డారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పదాధికారులు, నీటిసంఘాల అధ్యక్షుల సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ నూటికి 58 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. 70 శాతం మంది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉన్నారని పేర్కొన్నారు. పర్యావరణ మార్పులు రైతులపై ప్రభావం చూపుతున్నాయని వర్షపాతం చూసుకుని అధిక దిగుబడినిచ్చే విత్తనాలు ఎంచుకోవడం ఉత్తమమని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టబద్ధత కష్టం. ఒకే పంటను వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పరిస్థితుల మధ్య పండించడమే దీనికి కారణం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విత్తనాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం జీన్ బ్యాంకును ప్రారంభించింది. 100 వెనుకడిన జిల్లాలపై ప్రత్యేకదృష్టి సారించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను 2006 లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేదు? అని పురందేశ్వరి ప్రశ్నించారు.

## విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులకు విదేశీ బ్యాంక్ రుణాలు

**విజయవాడ,మే14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ముందుకొచ్చాయి. పలు విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. సమావేశానికి కెఎఫ్‌డబ్ల్యూ. ఎఎఫ్‌డి. ఎడీబీ. ఎన్‌డిబి. ఎఐఐబీ., జైకా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు. విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్ లను క్షేత్రస్థాయిలో ఆయా బ్యాంకుల ప్రతినిధులు పరిశీలించారు. రెండు మెట్రో ప్రాజెక్ట్ లకు అయ్యే వ్యయంలో రూ.12,000 కోట్లు రుణం అవసరం అవుతుందని అంచనా వేసినట్లు తెలుస్తోంది. విశాఖ మెట్రోకు రూ.6,100 కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు. తక్కువ వడ్డీకి లోన్ ఇచ్చే బ్యాంకులతో మెట్రో కార్పొరేషన్ ఎండీ సంప్రదింపులు జరుపుతున్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చలు జరపనున్నట్లు సమాచారం. రెండు నగరాల్లో మెట్రో ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ వేగంగా ముందుకు వెళ్తోంది. విశాఖ, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డీపీఆర్ కు ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖ తొలిదశలో 46 కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వ కారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్ వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మించనున్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30 కిలోమీటర్లు మరో కారిడార్ నిర్మించనున్నారు. విజయవాడ మెట్రో రైల్ రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో రెండు కారిడార్‌లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కారిడార్ 3గా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బి లను 38.4 కిలోమీటర్ల మేర నిర్మించాలని డీపీఆర్‌లో ప్రతిపాదించారు. ఇక రెండో దశలో నిర్మించే మూడో కారిడార్ ను 27.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు.

## మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణకు హాజరైన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి



**విజయవాడ, మే 14 ,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారుల విచారణ నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న వీరిద్దరు సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. వారిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరిద్దరూ కీలకంగా వ్యవహరించారు. మొత్తం సీఎంవో, జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వీరి ఆదేశాలు లేకుండా చివరకు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి. వీరు ఆదేశిస్తేనే నియోజకవర్గాల్లో పనులు చేయాల్సిను దుస్థితి ఏర్పడిందని ఎంతో మంది ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేసిన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో మద్యం స్కాంలో కీలకంగా వ్యవహరించిన పాత్రధారి, సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేసిన తర్వాత సిట్ అధికారులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ప్రధానంగా ఈ కేసులో ఇప్పటికే సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణుక్య, దిలీప్ మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే నిన్న ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన గోవిందప్ప బాలాజీని అరెస్ట్ చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో అనూహ్యంగా కోర్టులో ఓ పక్క గోవిందప్ప బాలాజీ విచారణ జరుగుతున్న సమయంలో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి విజయవాడలోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు.

15-5P□g7exHMNWJQE.qxd:15-5P□g7exHMNWJQE.qxd 01/01/01 9:59 AM Page 1



# వీరయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు సిద్దాంతి: ఎస్పీ ఏఆర్ దామోదర్





**నాగులుప్పలపాడు, మే 14, ప్రభాతవార్త:** నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన నిందితులు హత్యకు రూపకల్పన చేసిన వ్యక్తి అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన సిద్దాంతి ఆళ్ల సాంబశివరావు అని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం సాయంత్రం పత్రికా విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వివరాలను వెల్లడించారు. అమ్మనబ్రోలు గ్రామంలో రాజకీయంగా వ్యాపారంగా ఆదిపత్య పోరు ముప్పవరపు వీరయ్య చౌదరితో ముప్పా సురేష్ మేనమామ సిద్దాంతి కక్ష పెంచుకుని వ్యక్తిగతంగా పంచాయతీ ఎన్నికలతో పాటు రాజకీయ కార్యక్రమాల్లో ఒకరిపై ఒకరు ఆదిపత్యం కోసం పోటీ పడుతూ హత్య వరకు దారి తీసిన పరిణామాలను ఎస్పీ వివరించారు. సిద్దాంతి సాంబశివరావు అల్లుడు సురేష్ ఎదుగుదలకు వీరయ్య చౌదరి ఆటంకంగా ఉన్నారని నిర్ణయించుకుని ఆయనకున్న పరిచయాలతో వినోద్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని ఆయనకు అధిక మొత్తంలో రూ.20లక్షలకు పైగా డబ్బులు చెల్లిస్తూ వీరయ్య చౌదరి అడ్డం తొలగించుకోవాలని ప్లాన్ చేసి అందులో నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తులు, ఒంగోలుకు చెందిన వ్యక్తులతో సంబంధాలు నడిపి హత్యకు పథకం పన్ని.. పథకం ప్రకారం ఏప్రిల్ నెల 22న రాత్రి 7గంటల 30 నిమిషాలకు సుమారు 52 కత్తిపోట్లతో హత్య చేయడం జరిగిందని ఎస్పీ దామోదర్ తెలిపారు.

**ముద్దాయిలు:** బోర్లగడ్డ వినోద్ కుమార్, తొవ్వర వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకట గౌతమ్, మన్నే తేజ, మద్దూరి కిరణ్ కుమార్, షేక్ సమీర్, ఆళ్ల సాంబశివరావు, వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, తోట శ్రీనివాసరావు అనే తొమ్మిది మంది ముద్దాయిల పేర్లను జిల్లా ఎస్పీ తెలిపారు. **పరారీలో ఉన్న ముద్దాయిలు:** ముప్పా సురేష్, ఓబిలి నాగరాజు, గోలరితేంద్రబాబులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలియజేశారు. **22 రోజుల్లో కేసును చేధించిన పోలీసులకు అభినందనలు:** మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు జరిగి 22 రోజుల్లోనే ముద్దాయిలను అన్ని కోణాల్లో విచారించి అరెస్టు చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందనలు తెలిపారు. హత్య కేసును చేధించిన వారిలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావుతో పాటు ఒంగోలు, చీమకుర్తి ట్రాఫిక్ తదితర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంకా అనేక ప్రాంతాల నుండి టీములుగా ఏర్పడి ముద్దాయిలను గుర్తించడంలో సహాయపడిన ఎస్సైలు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# విద్య వైద్యం పైనే తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: డి.సిఎం భట్టి

**మధిర, మే 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంపదను సృష్టించడంతోపాటు సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం బోనకల్ మండలాల్లో రూ 52 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు ఆర్థికంగా వెసులుబాటు ఉన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో గత పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని 90 లక్షల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభు త్వం కృషి చేస్తున్నదని అన్నారు. సన్న బియ్యం పంపిణీ తో పాటు 200 లోపు యూనిట్ల విద్యుత్తును ఉచితంగా 500 కే గ్యాస్ సిలిం డర్ను అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణాన్ని కల్పించడం జరుగుతున్నదన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందించడం లక్ష్యంగా రూ 11600 కోట్లను వైద్యశాఖకు కేటాయించామని అన్నారు. ప్రతి పేదవానికి రూ.10లక్షల తో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. పేదవారి సొంతింటికలను నెరవేర్చేందుకు ప్రతి నియోజకవర్గంలో ఏడాదికి 3500 ఇందిరమ్మ గృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని కట్టిస్తామని ఆయన తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా రూ.11,600 కోట్లతో రాష్ట్రంలో కొత్తగా రెసిడెన్షియల్ , ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి గాను రైతు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన తక్షణమే నగదును రైతుల ఖాతాలో వేస్తున్నా మన్నారు. సన్న బియ్యానికి 500 బోనస్ ఇస్తున్నా మన్నారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ రైతు భరోసా, ఉచిత విద్యుత్తును అందించి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం ద్వాక్రా సంఘాల ద్వారా రూ.21 వేలకోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు.

## వేములవాడ టెంపుల్ ఘటనపై తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సురేఖ ఆరా

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త :**ఎండోమెంట్ కమిషనర్, వేములవాడ ఆలయ ఈవోలను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి సురేఖ.రాజన్న ఆలయ విస్తీర్ణం విషయంలో అపోహలు నెలకొన్నాయని ఆలయ సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందజేసేందుకు ఆలయ విస్తీర్ణం పెంచాలనే చర్యలు తీసుకున్నట్టు వివరణ ఇచ్చారు.ప్రధాన ఆలయ విస్తీర్ణం, భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన సౌకర్యం కు సంబంధించిన పనులు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు.అయితే, స్థానికంగా అన్నివర్గాల ప్రజలతో చర్చించి ముందుకు వెళ్ళాలని ఎక్కడా ఎటు వంటి అనుమానాలు, ఇబ్బందులకు తావు ఇవ్వకుండా ముందుకు వెళ్ళాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు.

## మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ రిజర్వ్ బ్యాంక్ నుంచి తాజాగా మరో రూ.2,500 కోట్ల రుణం తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ తాజాగా నిర్వహించిన ఈవేలం ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెట్టి ఈ రుణం సేకరించినట్టు రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. 21 ఏండ్లకాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 22 ఏండ్ల కాల పరిమితికి 6.86 శాతం వార్షిక వడ్డీతో రూ.900 కోట్లు, 25 ఏండ్ల కాలపరిమితికి 6.85 శాతం వార్షిక వడ్డీతో మరో రూ.900 కోట్లు సమీకరించింది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. ఏప్రిల్‌లో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. ఈ నెల 6న రూ.2 వేల కోట్లు, ఇప్పుడు మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకున్నది. ఇక ప్రస్తుత 2025-26ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ. 64,539 కోట్లు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

## గిరిజన రైతులకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:**గిరిజన రైతులకు హైకోర్టులో ఊరట లభించింది. భూ సంబంధిత వివాదంలో హైకోర్టు దాఖలైన రిట్ పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసిన ఆర్డర్ కాపీ ఇచ్చింది. జూన్ 24లోగా పిటిషన్లు ఎందుకు స్వీకరించకూడదో వివరణ ఇవ్వాలని ప్రతి వాదులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాణిక్యారంకు చెందిన గిరిజన రైతులు ఇస్లావత్ జమునా, ఇస్లావత్ బాలా తమ వ్యవసాయ భూములపై అటవిశాఖ, పోలీసు అధికారులు అన్యాయంగా బెదిరిస్తున్నారని, భూముల నుంచి బలవంతంగా తమను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖాలు చేశారు. పిటిషనర్ల తరపున అడ్వకేట్ నల్లపు మణిదీప్ వాదనలు వినిపించారు. పిటిషనర్లకు అటవీశాఖ ద్వారా మంజూరైన ఫారెస్ట్ హక్కుల గుర్తింపు చట్టం, 2006 (ఆర్వోఎఫ్ఆర్) పత్రాల ఆధారంగా భూములు ఉన్నాయని, అధికారుల బెదిరింపులు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని వారు కోర్టులో వాదించారు. మే మొదటి వారంలో విచారణ జరగగా తాజాగా ఆర్డర్ కాపీ హైకోర్టు విడుదల చేసింది. పిటిషనర్లకు చెందిన 9.30 ఎకరాలు, 6.71 ఎకరాల భూములపై ప్రస్తుతం ఉన్న యథాస్థితి కొనసాగించాలని జస్టిస్ పుల్లా కార్తీక్ స్పష్టం చేస్తూ స్టేటస్ కో ఆదేశాలను జారీ చేశారు. ప్రతి వాదులుగా పేర్కొన్న అటవిశాఖ, హోంశాఖ అధికార ప్రతినిధులకు, ప్రభుత్వ న్యాయవాదులకు ఇది వరకు నోటీసులను స్వీకరించినందున, పునఃనోటీసు జారీ చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొంది. పిటిషన్లను ఎందుకు స్వీకరించకుడదో వివరణ ఇవ్వాలన ప్రతి వాదులైప అటవీశాఖ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరికి వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సీఎం రేవంత్

### సాయిచరణ్ చికిత్సకు రూ.12 లక్షలు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే14:** క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మిప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), స్మయ (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారినపడడంతో అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సాయిచరణ్ చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ పూర్త యింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సీఎం సాయిచరణ్‌కు సూచించారు.

## ఫ్లోరెన్స్‌నైటింగేల్ అవార్డు అందుకున్న పద్మావతి వర్సిటీ

**తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం నర్సింగ్ విభాగం మెరుగైన బోధనకు "ఫ్లోరెన్స్‌నైటింగేల్ అవార్డు"అందుకుంది. ఆంధ్ర ప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ వివిధ విభాగాల కోసం ప్రవేశపెట్టిన ఈ అవార్డులను తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవానీకి అందజేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ నర్సులదినోత్సవ వేడుకల్లో ఉత్తమ నర్సింగ్ పరిశోధ కురాలు అవార్డును అందుకున్నారు. రాష్ట్రవైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకు మార్‌యాదవ్‌నుండి అవార్డును అందుకోవడం పట్ల పద్మావతి వర్సిటీ ఉపకు లపతి ఆచార్య వెన్నంఉమ,రిజిస్ట్రార్,డిప్యూటీ రిజిస్ట్రార్ అభినందించారు.

# సింగరేణిలో పారదర్శకంగా కాంట్రాక్టులు

### రివర్స్ టెండరింగ్ ద్వారా పనుల అప్పగింత: సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:**సింగరేణిలో ప్రతీ కాంట్రాక్టు, ప్రతీ కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా బహిరంగ టెండర్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సిఎండి బలరామ్ స్పష్టం చేశారు. అనంతరం అతి తక్కువ రేటును పేర్కొన్న వారికి మాత్రమే కాంట్రాక్టు అప్పగించడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఇవన్నీ బహిరంగ టెండర్లే అని, ఎక్కడా కూడా ఏ ఒక్క కాంట్రాక్టర్‌కో అప్పగించేలా పక్షపాతం చూపించే అవకాశమే ఉండదని తేల్చిచెప్పారు. అలాగే రివర్స్ టెండరింగ్ ద్వారా కాంట్రాక్టు మరింత తక్కువ ధరకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఓవర్ బర్డెన్, పేలుడు పదార్థాల టెండర్లలోనూ ఇదే పద్ధతిని పాటించడం జరుగుతుందని వెల్లడించారు. ఓవర్ బర్డెన్ కాంట్రాక్టులు, పేలుడు పదార్థాల కాంట్రాక్టులు అన్నీ సింగరేణి బోర్డు ఆమోదం లభించిన తర్వాతనే కేటాయించడం జరుగుతుందన్నారు. సింగరేణి బోర్డులో సింగరేణి డైరెక్టర్లతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ నామినీ డైరెక్టర్లు, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు ఆమో దించిన తర్వాతనే కాంట్రాక్టును కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాజకీయ నాయకులతో సహా ఎవరి ప్రమేయం ఉండదని తెలిపారు. బాధ్యత గల ప్రభుత్వ సంస్థగా ఇక్కడ కోట్లాది రూపాయల టెండర్లను అత్యంత పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా, పటిష్టమైన నియమ నిబంధనలతో నిర్వహించడం జరుగుతుందని తేల్చిచెప్పారు. ఏదైనా పనికి సంబంధించి టెండర్లు పిలిచినప్పుడు కంపెనీ పేర్కొన్న రేటుకు దాటి కాంట్రాక్టర్లు రేటు పేర్కొన్నట్లయితే, అది సబబుగా లేదని భావిస్తే కంపెనీ నియమ నిబంధనల ప్రకారం ఆ టెండర్లను రద్దు చేయడం లేదా తిరిగి పిలవడం జరుగుతుందన్నారు. అతి కనిష్ట కొటేషన్ దారుకు మాత్రమే పనులు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా భూపాలపల్లి టెండర్ కంపెనీ పేర్కొన్న రేటు కన్నా తక్కువ ధరకు (మైనస్ 1.02 శాతం) రావడం గమనార్హమన్నారు. అలాగే మణుగూరు టెండర్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. అలాంటప్పుడు అధిక ధరకు టెండర్లు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. కాగా గతంలో పేలుడు పదార్థాల కాంట్రాక్టుకు ఇచ్చిన టెండర్‌తో పోల్చితే చాలా తక్కువ రేటుకు, అంటే మైనస్ 31 శాతం తక్కువకు తాజాగా కాంట్రాక్టును అప్పగించడం జరిగిందని వివరించారు. 2022-24 కాలానికి ఉపరితల గనుల్లో వినియోగించే సగటు పేలుడు పదార్థాల మెట్రిక్‌టన్ను కొనుగోలు ధర రూ.69,935 ఉండగా, ప్రస్తుత 2024-26 కాలానికి రూ.44,467 గా ఉండటం విశేషం. దీన్ని గమనిస్తే 30 శాతం అధికంగా కాకుండా 31 శాతం తక్కువ ధరకు కాంట్రాక్టును కేటాయించిన విషయం అర్థం అవుతుంది. ఇదిసింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించే విషయం లో ఉన్న పకడ్బందీ పారదర్శక వ్యవస్థకు నిదర్శనమన్నారు.

# జూన్ 2 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

### రెవెన్యూ,హౌసింగ్. సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే14,ప్రభాతవార్త :**రాష్ట్రఅవతరణ దినోత్సవమైన జూన్ 2 నుంచి భూభారతి చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్.సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.గత పది సంవత్సరాలలో రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో గత నెల 14వ తేదీన భూభారతి చట్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకున్నామని,అదేనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు4 జిల్లాల్లోని 4 మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు.ఈనెల 5 నుంచి 30 వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్నామన్నారు.ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టుకొని వచ్చే నెల2 నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టంపరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామన్నారు.ప్రయోగాత్మకంగా నిర్వహించిన 4 మండలాల్లో ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించామని,ఈనెల 30 తేదీ నాటికి దాదాపు 60 శాతం భూసమస్యలను పరి ష్కరిస్తామన్నారు.భూభారతి చట్టానికిలోబడి పరిష్కరిం చవలసిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతూ, పరిష్కరించలేనివాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియ జేస్తామన్నారు.ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి అక్రమమైనవి ఉంటే అవి పరిష్కారం కావు అని చెప్పడం జరుగుతుంది. భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అనేది భూ భారతి చట్టం లక్ష్యం. క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరం స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండవ దశలో 28 మండలాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో కూడా ఈనెల చివరినాటికి వీలైనంతవరకూ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. సాదాబైనామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని అయితే ఆన్ లైన్ లో ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకుగత ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ విభాగంలో చేపట్టిన సంస్కరణలు,తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. భూభారతి చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఈ చట్టంతోతమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న సంతోషం వారిలో కనిపిస్తుందన్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని,గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వలన మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయన్నారు.మొత్తం వ్యవస్థనుప్రజలకు చేరువు చేసి వారికి మెరుగైన సేవలుఅందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

# యేటా 35 వేల మందికి జాబ్ లక్ష్యంగా శిక్షణ

### ఎస్సీ వెల్ఫేర్ విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** టెన్త్, ఇంటర్ ఫలితాల్లో తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యాలయాలు ప్రైవేటుకు దీటుగా సత్తా చాటాయి. అంతా బానే ఉన్నా చదువులు పూర్త య్యాక ఇక్కడ నుంచి వెళ్లిన విద్యార్థుల్లో కనీసం ఒక్కశాతం మంది కూడా స్థిరమైన జాబ్ చేయడం లేదన్న సంచలన విషయాలు బయటికి వచ్చాయి. స్వయంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రటరీ వర్షిణి ఈ విషయాలను హైదరాబాద్‌లో మీడియాకు చెప్పారు. అందుకే పూర్వ విద్యార్థుల కోసం జాబ్ ఓరియేంటేషన్ శిక్షణను తెలంగాణ గురుకులాల్లో ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె వివరించారు. ఉన్నతి అనే సంస్థతో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇందులో భాగంగా 238 విద్యాసంస్థల్లో 45 రోజుల ట్రైనింగ్ ఏడాదిలో మూడు బ్యాచ్‌లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏటా 36 వేలమంది విద్యార్థులకు జాబ్ దొరికేలా శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని చెప్పారు. గురుకులాల్లో ఇటీవల ఆరా తీయగా 8,9,10 తరగతితో పాటు ఇంటర్ చదువుతున్న విద్యార్థుల్లో 40 శాతంకి పైగా నకిలి కుల, ఆదాయ పత్రాలు ఉన్నవారేనని తెలిపారు. అందుకే ఈ ఎడాది నుంచి ముందు కుల, ఆదాయ ధృవీకరణ తర్వాత అప్లికేషన్ చేసుకునే అవకాశం ఇచ్చా మన్నారు. అక్కడ కూడా తప్పుడు పత్రాలు జోడిస్తే అప్లికేషన్ రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పారు. కాగా గతేడాది గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై స్పందించిన ఆమె డిసెంబర్‌లో అందుబాటులోకి వచ్చిన కామన్ డైట్ మెనూతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు రావడం లేదని తెలిపారు. అయితే కావాలని రాజకీయాల కోసం ప్రతిష్టాత్మక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ని బదనాం చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 104 గురుకులాల్లో ప్రస్తుతం సొంత భవనాల్లో నడుస్తుండగా మిగిలిన 134 అద్దె భవనాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 36 విద్యాసంస్థలకు సొంత భవనాల నిర్మాణ ప్రతిపాదనలు ఉండగా, మిగిలిన స్కూల్స్ ఇంటిగ్రేటేడ్ స్కూల్స్‌గా కన్వర్ట్ అవుతున్నట్లు ఆమె చెప్పారు. గురుకులాల అడ్మిషన్లకు ఈ ఏడాది కూడా భారీగా అప్లికేషన్లు వచ్చాయన్నారు. రాష్ట్రంలో 57 వేల 523 సీట్లు ఖాళీగా ఉంటే లక్షా 69 వేల 171 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

వీరిలో కేటగిరిల వారీగా అర్హత ఉన్నవారికి సీట్లను కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురుకులాల సీట్ల కేటాయింపు ప్రక్రియను తెలుసుకునే విండో ఇచ్చినట్లు సెక్రటరీ చెప్పారు. గురుకులాల్లో కోఎడ్యుకేషన్ ఉండదని స్పష్టం చేశారు. డైవర్షన్ లేకుండా పిల్లలు ఫ్రీగా ఉండేలా వేర్వేరుగానే ఉంటాయని చెప్పారు. కోఎడ్యుకేషన్ గా ఉన్న ఒకే ఒక స్కూల్‌ని కూడా బాయ్స్, గర్ల్స్ పాఠశాలలుగా విభజన చేస్తున్నట్లు వివరించారు. అమ్మాయిల విద్యాసంస్థల్లో సిబ్బందిగా మహిళలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.



బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు

# మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

### శాంతి చర్చల కమిటీ డిమాండ్

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త:** శత్రు దేశంతో చర్చలతో సమస్యలు పరిష్కారం చేసుకుం టున్న పుడు మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాం తాలపై సైనిక దాడులు చేయడం అమానవియ చర్య అని గతంలో ప్రభుత్వంపై సాయుధ పోరుకు పూను కున్న గూర్ఖాలాండ్ నాగాలాండ్, ఇతర సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం మావో యిస్టులతో అదే ప్రాతిపాదికన శాంతి చర్చలు జరపాలని శాంతిచర్చల కమిటీ (పీస్‌డైలాగ్) డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాప్ రెడ్డి, కోఆర్డినేటర్ బండి దుర్గా ప్రసాద్, పొ. అన్వర్‌ఖాన్‌లు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కొన సాగిస్తున్న దాడులను ఆపాలన్నారు. కాల్పుల విరమణతో చర్చలకు ముందుకు వచ్చిన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండ వెంటనే షరతులు లేకుండా సీజ్ ఫైర్ ప్రకటించి కుంబింగ్ ఆపి చర్చల ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. బీజాపూర్ జిల్లాలో ఇటీవల జరిగిన 22 ఎన్కౌంటర్ మరణాలపై అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్న కారణంగా సుప్రీం కోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించి విచారణ చెపట్టాలన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజా స్వామిక వాదులు, రాజకీయ పార్టీలు గమనించి పెద్ద ఎత్తున్న స్పందించి ఈ మావన హనాన్ని ఆపడానికి పూనుకోవాలని పీస్ డైలాగ్ పిలుపుననిచ్చింది. రాష్ట్రపతివెంటనే జోక్యం చేసుకుని కగార్ ఆపరేషన్ ఆపి చర్చలకు ప్రభుత్వం ఒప్పుకునేలా సూచన చేయాలని కోరారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ 6 నెలల కాల్పుల విరమణ ప్రకటిం చడంను పీస్ డైలాగ్ కమిటీ స్వాగతిస్తుందని పేర్కొన్నారు.

## 250శాతంపెరిగిన తుర్కియే టికెట్ కాన్సిలేషన్లు



**న్యూఢిల్లీ, మే 14:** ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియే అజర్‌బైజాన్‌లపై మనదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో మన ట్రావెల్ ఏజెన్సీలు కూడా రెండుదేశాలకు ఆన్‌లైన్ బుకింగ్‌లు నిలిపి వేసాయి. దీనితో కొత్త బుకింగ్‌లు 60శాతం పడిపోయాయని, కాన్సిలేషన్లు 250శాతానికి పెరిగినట్లు ట్రావెల్‌ఏజెన్సీ మేక్‌మైట్రిప్‌ప్రకటించింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లకు బాయ్‌కాట్ నినాదం ప్రభావం గత వారంరోజులుగాస్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండుదేశాలకు బుకింగ్‌లు 60శాతం తగ్గిపోయాయి. గత ఏడాదితోపోలిస్తే రద్దుచేసుకుంటున్న వారి సంఖ్య 250శాతానికి పెరిగింది. మన దేశానికి సంఘీభావంతోపాటు మన సాయుధ బలగాలపై గౌరవంతో పర్యాటకుల నిర్ణయాన్ని మేమూ గౌరవిస్తున్నామనిమేక్‌మైట్రిప్ వెల్లడించింది. అత్యవసర ప్రయాణాలను మాత్రమే సూచిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బుకింగ్‌చేసుకున్నవాటిని రద్దుచేసుకోవద్దని సూచిస్తున్నా పర్యాటకులు మాత్రం ఆ రెండుదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడటంలేదు.

## సింధునదీజలాల నిలిపివేత నిర్ణయం పునఃసమీక్షించండి

### కేంద్ర జలశక్తిశాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖలు



**ఇస్లామాబాద్, మే 14:** సింధజలాల ఒప్పందం నిలిపివేత నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని పాకిస్థాన్ జలవనరులశాఖ భారత జలశకినత మంత్రిత్వశాఖకు లేఖరాసింది. ఈ నిలిపివేత నిర్ణయంపై చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని వెల్లడించింది.ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవ హారాల మంత్రిత్వశాఖకు పంపించినట్లు తెలుస్తోంది. అయితే రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేదిలేదని ప్రధానిమోడీ ఇప్పటికే స్పష్టంచేసారు.పాక్‌తో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే ఉంటాయని వెల్లడించారు. పహల్గాం దాడి అనంతరం సింధూ జలాల ఒప్పందంనుంచి వైదొలుగుతున్నట్లు భారత్‌ప్రకటించింది. సింధూ, దాని ఉపనదుల జలాలనుపంచుకోడానికి ప్రపంచ బ్యాంకుమధ్యవర్తిత్వంలో భారత్ పాకిస్థాన్‌మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి ప్రధాని నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్‌లు సంతకాలుచేసారు. ఈ డీల్‌ప్రకారం సింధు, ఉపనదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్‌నదులపై భారత్‌కు హక్కులు లభించాయి. సింధునదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు వచ్చాయి. ఉగ్రదాడి తర్వాత పాక్‌కు బుద్ధిచెప్పేందుకు సింధునదీజలాల ఒప్పందాన్ని రద్దుచేసుకుంటున్నట్లు భారత్‌ప్రకటించడంతో ముందు తీవ్రస్థాయిలో భీరాలు పలికిన పాకిస్తాన్ ఇపుడు సంధిబేరానికి వచ్చింది.

## చీటింగ్ కేసులో శ్రవణ్‌రావును కస్టడీ కోరనున్న సిసిఎస్ పోలీసులు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ఆరుకోట్ల రూపాయల చీటింగ్ కేసులో అరెస్టయిన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు మీడియా అధినేత శ్రవణ్ రావును మరి ంతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి కోరాలని సిసిఎస్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఆకర్ష్ కృష్ణ అనే వ్యాపారిని 6.29 కోట్ల రూపా యలను శ్రవణ్‌రావు మోసం చేసినట్లు అందిన ఫిర్యాదుపై సిసిఎస్ పోలీసులు శ్రవణ్‌రావు సహా ఆయన భార్య స్వాతిరావు, సన్నిహితులు ఉమామహేశ్వర రెడ్డి, వేదమూర్తిలపై గత నెల 25వ తేదీన బిఎన్ఎస్‌లోని 316 (5), 318(4)తో పాటు రెడ్‌విత్ 3 (5 ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసు లో శ్రవణ్‌రావును మంగళవారం సాయంత్రం విచారణకు పిలిచిన సిసిఎస్ పోలీసులు నాలుగు గంటలకు పైగా విచారించి అనంతరం అరెస్టు చేయడం విదితమే. రాత్రి వేళ శ్రవణ్‌రావును నాంపల్లి మెజిస్ట్రేట్ ఇంటి వద్ద హాజరుపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు. కాగా ఈ కేసులో మరింతగా విచారించేందుకు శ్రవణ్‌రావును వారం రోజుల కస్టడీ ఇవ్వాలని సిసిఎస్ పోలీసులు ఒకటి రెండు రోజుల్లో నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

## కూలీగా మారిన విహెచ్ హనుమంతరావు!

**హైదరాబాద్,మే 14,ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న స్వాతంత్రోద్యమకారుల స్మారక స్థూప నిర్మాణానికి బుధవారం హనుమంతరావు రాళ్ళు ఎత్తి కూలీ పనిచేశారు. కంకర సిమెంట్‌ను నెత్తిపై మోస్తూ కూలీలతో కలిసి పని చేశారు. 1947లో స్వాతంత్ర వచ్చిన అనంతరం శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జాతీయ జెండా ఎత్తినందుకు నాటి నవాబు సర్కార్ కాల్చిచంపింది. 1948లో కొంతమంది విద్యార్థులు జాతీయ జెండాను ఎగరవేసి ఆగ్రహంకు గురైనారు. జెండా ఎత్తిన కారణంగా అప్పటి నవాబ్ ప్రైవేట్ సైన్యమైన రజాకారులు జెండా ఎగరవేసిన వారిని ప్రభుత్వ పాఠశాలలో కాల్చి చంపారు. వారి జ్ఞాపకార్థం విహెచ్ హనుమంతరావు ఈ చరిత్రను తెలుసుకొని వారి స్మారకార్థం స్థూపం నిర్మించాలని ఆయన కోరుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆగస్టు 15వ తేదీన వల్లాల ప్రభుత్వ పాఠశాలకు వచ్చి వారికి నివాళులు అర్పిస్తున్నారు. గత సంవత్సరం మృతి చెందిన వారి జ్ఞాపకార్థం నిర్మిస్తానని ఆయన ప్రకటించారు. రాబోయే తరాలకు వారి త్యాగాన్ని తెలియజేసేలా చేస్తానని తన సొంత డబ్బులతో స్థూపాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి బాసిత్ కాంగ్రెస్ సందేశ్ గ్రామ సర్పంచ్ ఇంతియాజ్ ఎగ్ సర్పంచ్ అశోక్ రెడ్డి శంభుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# కొత్త పార్టీ పెట్టాలనే యోచనలో కవిత!

### బిజెపితో బిఆర్ఎస్ చేస్తున్న నాటకాలు జీర్ణించుకోలేకపోతున్నారు

### టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త :** బిజెపితో బిఆర్ఎస్ చేస్తున్న నాటకాలను కవిత జీర్ణించుకోలేక పోతోందని తను జైలుకు పంపిన పార్టీతో కలిసి పనిచేయడం ఆమె వ్యతిరేకిస్తున్నారని టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్ ప్రెస్ మీట్ ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టాలనే యోచనలో ఉన్నారని ఆమె నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు. టిఆర్ఎస్ హయాంలో మహిళలకు,బిసి లకు అన్యాయం జరిగిందని కవిత ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గత పది సంవత్సరాల్లో సామాజిక తెలంగాణ నిర్మించలేకపోయామని ప్రతి వేదిక నుంచి తన తండ్రి పాలనపై ఆమె తన అసంతృప్తిని బాహాటంగానే బయట పెట్టుకున్నారని అన్నారు. కెసిఆర్ పాలనలో భూస్వాములకే రైతుబంధు వచ్చిందన్న వ్యాఖ్యలైనా, బిసిలకు అన్యాయం జరిగిందన్న వ్యవహారమైన, మహిళలకి రాజకీయాల్లో సమాన అవకాశాలు రాలేదన్న కవిత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నా మని తెలిపారు. కెసిఆర్ నియంత పోకడలను కవిత ఫాలో కావద్దు అలా ఫాలో అయితే కవిత పెట్టబోయే పార్టీ నీ తెలంగాణ ప్రజలు సమాధి చేస్తారని సామ రాంమోహన్‌రెడ్డి సలహా ఇచ్చారు. తానుపెట్టబోయే పార్టీని భ్రూణ హత్య కాకుండా చూసుకునే బాధ్యత కవితదే అని హెచ్చరించారు.సొంత పార్టీ మీద సొంత కుటుంబం మీద తోడబుట్టిన సోదరుడి మీద కన్న తండ్రి మీద కవిత అసంతృప్తితో రగిలిపోతుందని ఆయన వివరించారు. బిజెపి సంగతి చూస్తా అని పిడికిలి ఎత్తి శపథం చేసిన కవిత నోరును బిఆర్ఎస్ నొక్కుతోందని రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టిఆర్ఎస్ కు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి, ఆస్తుల్లో కేటీఆర్ కి వాటా ఇచ్చారు తప్ప కవిత పిల్లలను పట్టించుకోలేదని సామా విమర్శించారు. టిఆర్ఎస్ లోని పురుషాధిత్యాన్ని తట్టుకోలేకపోతున్నారుఅందుకే తన సొంత మనుషులే నన్ను అనుగదొకుతున్నారని చిట్ చాట్ లో చెప్పారని రామ్మోహన్ బాష్యం చెప్పారు. మా ప్రభుత్వం మీద బురద చల్లితే మిమ్మల్ని ఆ దేవుడే చూసుకుంటాడు అందుకే ఇప్పుడు మీ పార్టీ ముక్క చెక్కలయ్యే పరిస్థితి తలెత్తింది. కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నది అని మాకు విశ్వసనీయ సమాచారం ఉంది కాదని కవితనే చెప్పమనండి అని ఆయన సవాల్ చేశారు.

ఆట

## ఇటాలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు సిన్నర్



**న్యూఢిల్లీ:** మూడు నెలల డోపింగ్ నిషేధం నుండి తిరిగి వచ్చిన తర్వాత అగ్రస్థానంలో ఉన్న జానిక్ సిన్నర్ ఒక పెద్ద పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు, రోమ్‌లో జరిగిన మ్యాచ్‌లో నిష్ణాతుడైన క్లేకోర్ట్ ఆటగాడు ఫ్రాన్సిస్కో సెరుండోలోను 7-6 (2), 6-3 తేడాతో ఓడించి ఇటాలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. 18వ ర్యాంక్‌లో ఉన్న సెరుండోలో ఈ సంవత్సరం టూర్‌లో అత్యుత్తమంగా 18 క్లే కోర్టు విజయాలు సాధించాడు. ఇదే సమయంలో మాడ్రిడ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకునే ప్రయత్నంలో ఉన్నాడు. అలాగే, రెండు సంవత్సరాల క్రితం వీరిరువురూ చివరిసారిగా ఒకే కోర్టులో మరియు ఒకే రౌండ్‌లో తలపడినప్పుడు సెరుండోలో సిన్నర్‌ను ఓడించాడు. ఇక జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన మూడవ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సిన్నర్‌కు ఇది మొదటి టోర్నమెంట్, మరియు అతను మూడు మ్యాచ్‌లలో ఒక్క సెట్‌ను కూడా కోల్పోలేదు. సిన్నర్ అక్టోబర్ నుండి తన విజయ పరంపరను 24 మ్యాచ్‌లకు విస్తరింప చేశాడు. అతడు తన తదుపరి గేమ్‌లో సెరుండోలోను బ్రేక్ చేసి రెండవ సెట్‌లో 3-1 ఆధిక్యంలోకి వెళ్లి శాశ్వతంగా నియంత్రణ సాధించాడు. తదుపరి మ్యాచ్‌లో సిన్నర్ కొత్తగా టైటిల్ గెలుచుకున్న మాడ్రిడ్ ఛాంపియన్ కాస్పర్ రూడ్ లేదా జౌమ్ మునార్‌తో తలపడనున్నాడు. కాగా 1976లో అడ్రియానో పనాట్టా తర్వాత రోమ్ టైటిల్ గెలుచుకున్న తొలి ఇటాలియన్ వ్యక్తిగా నిలిచేందుకు అతను ప్రయత్నిస్తున్నాడు. ఈ నెల 25న ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమయ్యే ముందు రోమ్‌లో చివరి పెద్ద వార్మప్ జరుగుతుంది.



# చరిత్ర సృష్టించిన జడేజా

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్

**న్యూఢిల్లీ:** టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్ట్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అత్యధిక కాలం టాప్ ర్యాంక్‌లో కొనసాగిన ప్లేయర్‌గా అవతరించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జడేజా టాప్ ప్లేస్‌ను నిలబెట్టుకున్నాడు. ప్రస్తుతం అతడు 400 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. ఈ ర్యాంకింగ్స్‌లో జడేజా తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్‌కు చెందిన హసన్ మిరాజ్, దక్షిణాఫ్రికా ప్లేయర్ మార్కో జన్సెన్, ఆస్ట్రేలియాకు చెందిన పాట్ కమిన్స్, బంగ్లాదేశ్ ప్లేయర్ షకీబ్ అల్ హసన్ ఉన్నారు. మెహిది హసన్ ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో సెంచరీ సహా 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేసి జన్సెన్‌ను కిందికి దించి రెండో స్థానానికి ఎగబాకాడు. మెహిది హసన్‌కు, జడేజాకు మధ్య 73 ర్యాంకింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. కాగా 2022 మార్చి 9న వెస్టిండీస్ ఆటగాడు జేసన్ హోల్డర్‌ను గద్దె దించి అగ్రపీఠాన్ని అధిరోహించిన జడ్డూ 1152 రోజుల పాటు (38 నెలలకు పైగా) టాప్ ర్యాంక్డ్ టెస్ట్ ఆల్ రౌండర్‌గా కొనసాగాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో దిగ్గజ ఆల్‌రౌండర్లయిన జాక్ కల్లిస్, కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్‌కు కూడా ఇంత కాలం ర్యాంకుల్లో అగ్రస్థానంలో కొనసాగడం సాధ్యం కాలేదు. 36 ఏళ్ల జడ్డూ 2022 మార్చి నుండి 23 టెస్టులు ఆడి 36.71 సగటున 1175 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అయితే 22.34 సగటున 91 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఆరు 5 వికెట్ల ప్రదర్శనలు, రెండు 10 వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.



### ఖేల్ ఇండియాలో ఎపి, టిజిలకు

# పతకాల మోత

### పసిడితో మెరిసిన నిశిక, వర్షిత, సాయి

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్రీడాకారులు పతకాల మోత మోగించారు. నాలుగో రోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 7, తెలంగాణకు 3 పతకాలు లభించాయి. గయా(బీహార్) వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిశిక అగర్వాల్ స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ ఫైనల్లో నిశిక 44.33 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అద్భుత ప్రదర్శన కనబరుస్తూ నిశిక సత్తాచాటింది. ఇదే విభాగంలో అనౌష్క పాటిల్ (42.06), సారా రవూల్ (41.23) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే బాలుర యూత్ 89 కిలోల కేటగిరీలో బరిలోకి దిగిన తెలంగాణ యువ లిఫ్టర్ సాయివర్ధన్ పసిడి పతకంతో మెరిశాడు. స్నాచ్‌లో 120 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 155 కిలోలతో మొత్తం 275 కిలోలు ఎత్తిన సాయివర్ధన్ అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో చెంచు వెంకటేశ్ (272 కిలోలు, ఆంధ్రప్రదేశ్), రోహన్‌కుమార్ మహతో (266 కిలోలు, జార్ఖండ్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా బాలికల ఫెన్సింగ్ ఈపీ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి అదీబా హుర్రైన్ కాంస్యంతో మెరిసింది. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో చరణ్ రామ్, హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్) ద్వయం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ యూత్ బాలికల 64 కిలోల కేటగిరీలో జి.వర్షిత (శ్రీకాకుళం) 174 కిలోల బరువెత్తి పసిడితో మెరిసింది.

### దాయాది దేశాల రెంటిలోనూ

# డబుల్ ఛాన్స్

### ఐపిఎల్, పిఎస్‌ఎల్‌లో ఒకే ప్లేయర్లు



**న్యూఢిల్లీ:** వరల్డ్ వైజ్ క్రికెట్ లీగ్‌లు జరుగుతున్నా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాత్రం టాప్‌లో ఉంది. 2008లో స్టార్ట్ అయిన ఐపీఎల్ చూసిన తర్వాతే వివిధ దేశాల్లో కూడా లీగ్‌లు మొదలుపెట్టాయి. పాక్ క్రికెట్ బోర్డు కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్‌ఎల్) స్టార్ట్ చేసింది. ముంబయిలో ఉగ్రదాడుల తర్వాత భారత క్రికెటర్లు పీఎస్‌ఎల్‌లోను, పాక్ ప్లేయర్లు ఐపీఎల్ ఆడే ఛాన్స్ లేదు. మొదటి ఐపీఎల్ సీజన్లో మాత్రమే పాకిస్థాన్ ప్లేయర్లు ఐపీఎల్‌లో పాల్గొన్నారు. అయితే కొందరు విదేశీ, పాక్ ఆటగాళ్లు ఇటు ఐపీఎల్, అటు పీసీఎస్ టోర్నీల్లో ఆడుతున్నారు. ఐపీఎల్‌లో టైటిల్ నెగ్గిడంతో పాటు, అటు పీఎస్‌ఎల్ లోనూ ఛాంపియన్‌గా నిలిచారు. ఇంగ్లాండ్ ప్లేయర్ ఇయాన్ మోర్గాన్ ఇటు ఐపీఎల్, అటు పీఎస్‌ఎల్ నెగ్గిన ఆటగాళ్లలో ఒకడు. మోర్గాన్ 2012లో కోల్‌కతా, 2016లో సన్‌రైజర్స్ జట్ల తరఫున ఐపీఎల్‌లో ఛాంపియన్‌గా నిలిచాడు. అలాగే 2017లో పెషావర్ జల్మీ టీమ్ తరఫు పీఎస్‌ఎల్ ట్రోఫీని కూడా గెలిచాడు. బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ 2012, 2014లో కేకేఆర్ ఐపీఎల్ ట్రోఫీ గెలవడంలో పాత్ర పోషించాడు. 2017లో పెషావర్ జల్మీ జట్టులో ఉండి పీఎస్‌ఎల్ టైటిల్ గెలిచాడు. వెస్టిండీస్‌కు చెందిన మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ కూడా ఈ రెండు లీగ్‌ల్లో ఆడాడు. 2012, 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయాల్లో నరైన్ కీ ప్లేయర్ పాత్ర పోషించాడు. అటు 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున పీఎస్‌ఎల్ కప్పు గెలిచాడు. మరో పాపులర్ పవర్ హిట్టర్ ఆండ్రీ రస్సెల్ 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ట్రోఫీ అందుకున్నాడు. 2016, 2018లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరఫున రెండు సార్లు పీఎస్‌ఎల్ గెలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన సోహైల్ తన్వీర్ 2008లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ట్రోఫీ గెలిచాడు. 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్, 2021లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున పీఎస్‌ఎల్ టైటిల్స్ గెలిచాడు. ఇంకో ప్లేయర్ కమ్రాన్ అక్మల్ 2008లో ఐపీఎల్ విజేత రాజస్థాన్ రాయల్స్ టీమ్‌లో ఆడాడు. 2017లో పెషావర్ జల్మీతో కలిసి పీఎస్‌ఎల్‌ను కూడా గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియా ప్లేయర్ షేన్ వాట్సన్ 2008లో రాజస్థాన్ రాయల్స్, 2018లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తరఫున ఐపీఎల్ గెలిచాడు. అలాగే 2016లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరఫున, 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున పీఎస్‌ఎల్ టైటిల్ అందుకున్నాడు. వెస్టిండీస్ ప్లేయర్ డ్వేన్ బ్రావో 2018, 2021లో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 2019లో క్వెట్టా గ్లాడియేటర్స్‌తో కలిసి పీఎస్‌ఎల్లో కూడా విజయం సాధించాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 2020లో ముంబయి ఇండియన్స్, అదే సంవత్సరం కరాచీ కింగ్స్‌తో పీఎస్‌ఎల్ గెలుచుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ టాప్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 2022లో గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ గెలిచాడు. 2022, 2023లో లాహోర్ కలందర్స్ తరఫున కూడా వరుసగా పీఎస్‌ఎల్ ట్రోఫీ గెలిచాడు.



### దక్షిణాసియా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్:

# నేపాల్‌ను ఓడించి సెమీస్‌కు భారత్

**న్యూఢిల్లీ:** దక్షిణాసియా అండర్-19 పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ సెమీ ఫైనల్‌కు చేరింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో నేపాల్‌ను ఓడించిన భారత్ సెమీస్‌కు అర్హత సాధించింది. గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో నేపాల్‌పై 4-0 తేడాతో విజయం సాధించిన తర్వాత భారత్ దక్షిణాసియా అండర్-19 పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూప్ బి లో అగ్రస్థానంలో నిలిచింది. రోహెన్ సింగ్ చాపమాయుమ్ (28వ నిముషంలో, 76వ నిముషంలో) రెండు గోల్స్ చేయగా, స్థానిక యూత్ ప్లేయర్ ఒమాంగ్ దోడుమ్ (29వ నిముషంలో), డానీ మెయిటీ (84వ నిముషంలో) ఒక్కొక్క గోల్ చేశారు. ఈ విజయంతో భారత్ రెండు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో గ్రూప్ బి ని ముగించింది, 12 గోల్స్ తేడాతో నేపాల్ రెండు మ్యాచ్‌ల్లో మూడు పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. ఆతిథ్య జట్టు ఈ నెల 16వ తేదీ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు గ్రూప్ ఎ రన్నరప్ అయిన మాల్దీవులతో తలపడనుంది, అదే రోజు జరిగే సెమీఫైనల్లో గ్రూప్ ఎ విజేత బంగ్లాదేశ్ మధ్యాహ్నం 3.30 గంటలకు నేపాల్‌తో తలపడనుంది. రెండు జట్లు ఇప్పటికే చివరి నాలుగు స్థానాలకు చేరుకోగా, మ్యాచ్ చాలా ఉత్సాహంగా ప్రారంభమైంది. గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచే విషయంలో ఇరు జట్లు రాజీ పడటానికి ఇష్టపడ లేదు. అయితే, స్కోరింగ్ ప్రారంభమైన తర్వాత, భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. రెండు గోల్స్ తేడాతో, నేపాల్‌పై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించడంతో, భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. బ్లూ కోల్ట్స్ జట్టు 15 నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగానే మూడో గోల్ చేసింది. భారత కెప్టెన్ సింగమాయుమ్ షమీ చేసిన లాంగ్ రేంజ్ ప్రయత్నాన్ని పరియార్ అడ్డుకున్నాడు. అయితే, మునుపటి ఆటలో శ్రీలంకపై హ్యాట్రిక్ సాధించిన ప్లేమేకర్, తెలివిగా రీబౌండ్‌ను సాధించాడు.

# వాణిజ్యం

# తొలిరోజే ట్రంప్ టవర్స్ రికార్డ్ సేల్స్..


**ముంబై, మే 14:** గురుగ్రామ్‌లో నిర్మించిన ఈ ట్రంప్ టవర్స్ లోని 298 లగ్జరీ ఫ్లట్లన్నీ ఓపెనింగ్ రోజే అమ్ముడయ్యాయి. వీటి ధర రూ.8 కోట్ల నుంచి రూ.15 కోట్ల మధ్య ఉంటుంది. ఆశ్చర్యకరమైన మరో విషయం ఏంటి అంటే మొదటిరోజే రూ.3250 కోట్ల విలువైన బుకింగ్‌లు జరిగాయి. ఇందులో రూ.125 కోట్ల విలువైన నాలుగు పెంట్‌హౌస్‌లు కూడా ఉన్నాయి. గురుగ్రామ్‌లోని ట్రంప్ టవర్స్‌ని స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్ అండ్ ట్రిబెకా డెవలపర్స్ ఉమ్మడిగా అభివృద్ధి చేశాయి. ఈ ప్రాజెక్ట్ గురుగ్రామ్‌లో ట్రంప్ బ్రాండ్ రెండవ హౌస్ కంస్ట్రక్షన్ ప్రాజెక్ట్. న్యూయార్క్ తర్వాత రెండు ట్రంప్ టవర్లు ఉన్న మొదటి నగరం గురుగ్రామ్. సెక్టార్69లో ఉన్న ట్రంప్ టవర్స్‌లో రెండు 51 అంతస్తుల టవర్లు ఉన్నాయి, వీటిలో 298 లగ్జరీ ఇళ్ళు ఉండగా, ఒక్క ఇంటి ధర రూ.8 కోట్ల నుంచి రూ.15 కోట్ల మధ్య ఉంటుంది. స్మార్ట్ వరల్డ్ డెవలపర్స్ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్



మాట్లాడుతూ, ట్రంప్ టవర్స్‌కి లభించినఅద్భుతమైన స్పందన దేశంలో ప్రపంచ స్థాయి లైఫ్ స్టయిల్ని స్పష్టంగా చూపిస్తుంది. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం మాకు గర్వకారణం ఇంకా మా కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించినందుకు వారికి ధన్యవాదాలు అని అన్నారు. గురుగ్రామ్‌లోని ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్ సేల్స్ చదరపు అడుగుకు రూ.27,000 చొప్పున మొదలవుతుంది. ఇందులో ప్రత్యేక ఇంటీరియర్ డిజైన్, ప్రైవేట్ లిఫ్ట్, విలాసవంతమైన క్లబ్‌హౌస్ ఇంకా ప్రత్యేకమైన సేవలు ఉన్నాయి. ట్రంప్ అనే బ్రాండ్ పేరుకు ప్రత్యేక ఆకర్షణ ఉంది. అందుకే ప్రపంచం నలుమూలల నుండి కొనుగోలుదారులు దీనిని ప్రత్యేకమైన ఇంకా కాస్ట్లీ ప్రాజెక్టుగా భావిస్తారు. ఈ ప్రాజెక్టులో మొత్తం అమ్మకానికి ఉన్న విస్తీర్ణం 12 లక్షల చదరపు అడుగులు. దీనికిపూర్తిగా గాజు గోడలు, కొన్ని ఇళ్లలో రెట్టింపు ఎత్తు గల లివింగ్ రూములు, పెద్ద పెద్ద పైకప్పువరకుకిటికీలు, ప్రైవేట్ లిఫ్ట్, ఆరావళి కొండల దృశ్యాలతో కూడిన షేర్డ్ టెర్రస్ ఉంటాయి.

## రాణించిన ఐటి, మెటల్ స్టాక్స్


**ముంబై, మే 14:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 81,278.49 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. 80,910.03 81,691.87 మధ్య కదలాడింది. చివరికి 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద



స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.27గా ఉంది. టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభ పడ్డాయి. ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65.77 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## రూ.2.75 లక్షల కోట్ల ఆర్‌బిఐ డివిడెండ్!

**ముంబై, మే 14:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లించిన తర్వాత భారత బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు లిక్విడిటీ గణనీయంగా పెరుగుతుందని కొన్ని సంస్థల నివేదికలు చెబుతున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో ఈ లిక్విడిటీ రూ.6 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నాయి. ఈ యేడాది ఆర్‌బిఐ ప్రభుత్వానికి ఇచ్చే డివిడెండ్లు రూ.2.25 లక్షల కోట్ల నుంచి రూ.2.75 లక్షల కోట్ల మధ్య ఉంటుందని తెలుస్తుంది. ఇది కేంద్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచుతుందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అధిక రాబడినిచ్చే అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసిన విదేశీ మారక నిల్వలపై రాబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. రూపాయి అస్థిరతను నిర్వహించడానికి డాలర్లను విక్రయించడం ద్వారా వచ్చిన లాభాలతో ఆర్‌బిఐ ఆదాయం సమకూర్చుకుంటోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశీయ బాండ్ మార్కెట్ ద్వారా ఆర్‌బిఐ రూ.1.95 లక్షల కోట్లు రాబడిని అందుకున్నట్లు అంచనా. ఆర్‌బిఐ క్రియాశీల డాలర్ అమ్మకాలు కూడా ఈ ఆదాయానికి తోడయ్యాయి. 2025 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నాటికి స్థూల డాలర్ అమ్మకాలు 371.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2024 సెప్టెంబర్‌లో విదేశీ మారక నిల్వలు 704 బిలియన్ డాలర్లకు చేరాయి.తర్వాత కాలంలో ఆర్‌బిఐ 125 బిలియన్ డాలర్లకుపైగా విక్రయించినట్లు తెలుస్తుంది. మే చివరి నాటికి బ్యాంకింగ్ వ్యవస్థ లిక్విడిటీ మరింత మెరుగుపడి రూ.5.5-6 లక్షల కోట్లకు చేరుకుంటుందని బార్క్లేస్ అంచనా వేసింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 6శాతం నుంచి 5.75శాతానికి దగ్గరగా వెయిటెడ్ యావరేజ్ కాల్ రేట్ తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితులు ఆర్‌బిఐ రాబోయే ద్రవ్య విధాన వైఖరిని ప్రభావితం చేయనుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు జూన్‌లో జరగనున్న ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.



## మరికొందరు మైక్రోసాఫ్ట్ ఉద్యోగులపై వేటు



**న్యూఢిల్లీ, మే 14:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. వేలాది మందిని తొలగించేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ నిర్ణయంతో దాదాపు 6 వేల మందిపై లేఆఫ్స్ ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. గతేడాది జూన్ నాటికి ఆ సంస్థలో 2.28 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. మైక్రోసాఫ్ట్ తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని అంచనా. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌లకు ఉద్యోగుల పనితీరుకు సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది.

## లాభాల్లో హీరో మోటోకార్ప్ భేష్


**ముంబై, మే 14:** ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ గతేడాది చివరి త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ.1,169 కోట్లను తాకింది. వ్యయ నియంత్రణ, విభిన్న ప్రొడక్టులు, మెరుగుపడిన మార్జిన్ల ప్రభావం చూపాయి. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.943 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటా దారులకు రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకి రూ.65 చొప్పున తుది డివిడెంట్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ.9,794 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు బలపడింది. అయితే మోటార్ సైకిళ్ల, స్కూటర్ల మొత్తం విక్రయాలు 13.92 లక్షల నుంచి 13.81 లక్షల యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి హీరో మోటో నికర లాభం 17శాతం పెరిగి రూ.4,376 కోట్లకు చేరింది. 2023-24లో రూ.3,742 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం కూడా రూ.38,643 కోట్ల నుంచి రూ.41,967 కోట్లకు చేరింది. ఈ కాలంలో 5శాతం అధికంగా 58.99 లక్షల వాహనాలు విక్రయించింది. 2023-24లో 56.21 లక్షల వాహన అమ్మకాలు నమోదయ్యాయి. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు హీరో మోటో ఈడీ, తాత్కాలిక సిఇఒ విక్రమ్ ఎస్ కస్బేకర్ పేర్కొన్నారు.



వరుసగా 24వ యేడాదిలోనూ మార్కెట్ లీడర్‌గా కంపెనీ కొనసాగినట్లు తెలియచేశారు. కీలకమైన 125 సిసి విభాగంలో కన్సాలిడేషన్ జరుగుతున్నదని, భవిష్యత్‌లో ఈవీల విడుదల ద్వారా వృద్ధి కొనసాగనున్నట్లు వివరించారు.

## 'మారుతి'పై రూ.1.15లక్షల డిస్కౌంట్ ఆఫర్

**ముంబై. మే 14:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ నెక్సా మోడళ్లపై పెద్దఎత్తున డిస్కౌంట్ అందిస్తోంది. బాలెనో, జిమ్నీ, ఫ్రాంక్స్‌తో పాటు పలు వాహనాలపై రాయితీ ఇస్తోంది. కొన్ని వాహనాలపై ఏకంగా రూ.1.15 లక్షల వరకు తగ్గింపు అందిస్తోంది. వివిధ మోడళ్లపై నగదు తగ్గింపుతో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయోజనాలు కూడా అందిస్తోంది. మారుతీ తీసుకొచ్చిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌పై రూ.45 వేల వరకు డిస్కౌంట్ ఇస్తోంది. మేన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌పై రూ.25 వేలు, ఏజీఎస్ వెర్షన్‌పై రూ.30 వేలు వరకు తగ్గింపు ఇస్తోంది. ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.15వేలు అంది స్తోంది. దీంతోపాటు ఆప్షనల్ రీగల్ ఎడిషన్ యాక్సెసరీస్ కిట్‌పై కూడా తగ్గింపు ఇస్తు న్నట్లు ప్రకటించింది. పెట్రోల్ డీజిల్ ఇంజిన్ వేరియంట్లపై రూ.10 వేల వరకు తగ్గింపు అందిస్తోంది. సిగ్మా వేరియంట్లపై ఈ రాయితీ లభించదు. ఫ్రాంక్స్ ఏజీఎస్ వెర్షన్లపై రూ.15 వేల తగ్గింపుతో పాటు రూ.15 వేల వరకు అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు. ఇక టర్బో పెట్రోల్ వేరియంట్‌లో వచ్చిన ఫ్రాంక్స్‌పై కూడా రూ.30 వేల వరకు తగ్గింపు, రూ.43 వేల విలువైన వెలాసిటీ యాక్సెసరీస్ కిట్, రూ.15వేల ఎక్స్ఛేంజ్ బోనస్ ఇస్తోంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps